ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

RNI NO.TELTEL / 2013 /50370
తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

శుక్రవారం 24.07.2026 | సంపుటి : 13 సంచిక : 04 | పేజీలు : 12 వెల : రూ. 4/-

సామాన్యుని స్వరం
JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్




MYSPACE VENTURES PVT.LTD | Jubileehills, Hyderabad

# మన పిల్లల్ని మనమే కాల్చుకుంటామా?

సంపాదకీయం

దేశ రాజధానిలో జరిగిన నిరసనల సందర్భంగా ఒక యువతి మెడికో-లీగల్ సర్టిఫికెట్‌లో "గన్‌షాట్ ఇంజూరీ" నమోదవడం తీవ్ర ఆందోళన కలిగించే విషయం. అదే సమయంలో, తనకు ఈ గాయం పోలీసు కాల్పుల వల్లే జరిగిందని ఆ నిరసనకారిణి ఆరోపించడం మరింత తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది.

ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం నేరం కాదు. ప్రజల గొంతు వినాల్సిన వ్యవస్థ, వారి గొంతును అణచివేసేందుకే భావన కలిగే పరిస్థితి ఎన్నటికీ సమర్థనీయం కాదు. యువత తమ సమస్యలను, తమ భవిష్యత్తుపై ఉన్న ఆందోళనలను వ్యక్తం చేస్తే, వారికి సమాధానం ఇవ్వాల్సింది ప్రభుత్వం. కానీ గాయాల వార్తలు, రక్తపు మరకలు, భయాందోళనలు కనిపిస్తే అది ప్రజాస్వామ్య ఆరోగ్యానికి మంచిది కాదు.

ఒక మెడికో-లీగల్ సర్టిఫికెట్‌లో "గన్‌షాట్ ఇంజూరీ" నమోదైందంటే అది అత్యంత తీవ్రమైన అంశం. అదే సమయంలో, పోలీసు కాల్పుల వల్లే గాయమైందన్న ఆరోపణ కూడా సాధారణ విషయం కాదు. ఈ రెండు అంశాలపై వాస్తవాలు ఏమిటో దేశ ప్రజలకు తెలియాల్సిన హక్కు ఉంది. ఊహాగానాలకు కాదు, నిర్దిష్టమైన, పారదర్శకమైన విచారణ దీనికి సమాధానం చెప్పాలి. దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉంది. అదే యువత గాయాలతో ఆసుపత్రుల్లో కనిపించే పరిస్థితి రావడం ఏ ప్రభుత్వానికీ గర్వకారణం కాదు. విభేదాలను సంభాషణతో పరిష్కరించాల్సిన చోట, బలప్రయోగం జరిగినట్లు ఆరోపణలు రావడం ప్రజాస్వామ్యానికి శుభసూచకం కాదు.

మన పిల్లల్ని మనమే కాల్చుకుంటామా? అనే ప్రశ్న ఈ రోజు ఒక్క కుటుంబానిదే కాదు, యావత్ దేశానిది. అధికారంలో ఉన్నవారు గుర్తుంచుకోవాల్సిన విషయం ఒక్కటే-ప్రజలపై పాలన చేయడం అంటే ప్రజలపై శక్తిని ప్రదర్శించడం కాదు; వారి హక్కులను, వారి ప్రాణాలను, వారి భవిష్యత్తును కాపాడడం. ఈ ఘటనపై నిజానిజాలు వెలికి తీయడానికి స్వతంత్ర, నిష్పాక్షిక విచారణ జరగాలి. వాస్తవం ఏదైనా దేశ ప్రజల ముందుంచాలి. ప్రజాస్వామ్యంలో నిజం దాగిపోవడం కంటే ప్రమాదకరమైనది మరొకటి లేదు.

# కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు - మూడేళ్ల పాలన

2023 డిసెంబరులో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ప్రధాన బలం వారు ప్రకటించిన ఆరు గ్యారంటీలు, సుమారు 420కి పైగా ఇచ్చిన ఎన్నికల హామీలు. అధికార పగ్గాలు చేపట్టిన రెండు రోజుల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించి, ప్రజా పాలన వైపు వేగంగా అడుగులు వేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. ప్రస్తుతం మూడేళ్ల పాలన పూర్తి కావస్తున్న తరుణంలో, ఆ హామీలు ఏ మేరకు ఆచరణలోకి వచ్చాయి? గణాంకాలు ఏం చెబుతున్నాయి? ప్రతిపక్షాల విమర్శల్లో నిజమెంత? అనే అంశాలపై లోతైన విశ్లేషణ.



**విజయవంతంగా అమలవుతున్న కీలక పథకాలు:**

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాలలో మహాలక్ష్మి, గృహజ్యోతి, రాజీవ్ ఆరోగ్యశ్రీ ముఖ్యమైనవి. ఉచిత బస్సు ప్రయాణం (మహాలక్ష్మి) 2023 డిసెంబర్ 9న ప్రారంభమైన ఈ పథకం కింద మహిళలు దాదాపు 290 నుంచి 380 కోట్ల సార్లు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారు. దీనివల్ల నిరుపేద, మధ్యతరగతి మహిళలకు రూ.10,000 కోట్ల నుంచి రూ.11,000 కోట్ల వరకు ఆదా అయినట్లు ప్రభుత్వం గణాంకాలను వెల్లడించింది. రూ.500కే గ్యాస్ సిలిండర్ అర్హులైన కుటుంబాలకు రూ.500 కే సిలిండర్ అందించే సదుపాయం క్షేత్రస్థాయిలో అందుబాటులోకి వచ్చింది. గృహజ్యోతి నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించే ఈ పథకం ద్వారా దాదాపు 53 లక్షల కుటుంబాలు ప్రయోజనం పొందుతున్నాయి. ఇప్పటివరకు 11 కోట్లకు పైగా సున్నా బిల్లులు జారీ కావడం విశేషం. ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు గతంలో ఉన్న రూ.5 లక్షల పరిమితిని రూ.10 లక్షలకు పెంచి, పేదలకు ఉచిత వైద్య పరిధిని విస్తరించారు. ఇందిరమ్మ ఇళ్లు నిరుపేదలకు రూ.5 లక్షల ఆర్థిక సాయంతో ఇళ్ల నిర్మాణం చేపట్టే కార్యక్రమం వేగవంతమైంది.

**సాంకేతిక సమస్యలు - సగం అమలైన హామీలు:**

కొన్ని ప్రధాన హామీలు అమలవుతున్నప్పటికీ, సాంకేతిక మరియు ఆర్థిక కారణాల వల్ల పూర్తిస్థాయి లబ్ధిదారులకు చేరలేకపోయాయి. రైతు రుణమాఫీ రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, క్షేత్రస్థాయిలో అనేక ఫిర్యాదులు వస్తున్నాయి. ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతాల్లో పేర్ల తేడాలు, సాంకేతిక లోపాల వల్ల చాలామంది రైతులు లబ్ధి పొందలేకపోయారు. దీంతో కొన్ని జిల్లాల్లో రైతు సంఘాలు ఆందోళన బాట పట్టాయి.

**రైతు భరోసా**

ఎకరాకు వార్షికంగా రూ.15,000 సాయం ఇస్తామన్న హామీ కొంత జాప్యంతో, విడతలవారీగా అమలవుతోంది. నిధుల సర్దుబాటులో వచ్చిన ఇబ్బందుల వల్ల దీనిపై ప్రతిపక్షాల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ఇంకా నెరవేరని హామీలు, నిరుద్యోగ భృతి:**

ప్రభుత్వ పరిపాలనలో అతిపెద్ద సవాలుగా మారిన అంశాలు కొన్ని ఉన్నాయి: మహిళలకు రూ.2,500 సాయం మహాలక్ష్మి పథకం కింద ప్రతి కుటుంబంలో పెద్ద దిక్కుగా ఉన్న మహిళకు నెల నెలా రూ.2,500 ఇస్తామన్న హామీ మూడేళ్లు గడుస్తున్నా కార్యరూపం దాల్చలేదు. నిరుద్యోగ భృతి, ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన నెలవారీ నిరుద్యోగ భృతి స్థానంలో, "యువ వికాసం" ద్వారా నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ప్రభుత్వం చెబుతోంది. అయితే నేరుగా నగదు బదిలీ చేయకపోవడంపై విద్యార్థి, యువజన సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.

**ఆర్థిక పరిస్థితి - పెరుగుతున్న అప్పుల భారం:**

హామీల అమలుకు భారీగా నిధులు అవసరం కావడంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఒత్తిడి పెరుగుతోంది. తెలంగాణ ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరానికి సుమారు రూ. 3.04 లక్షల కోట్ల భారీ బడ్జెట్ ను ప్రవేశపెట్టగా, సంక్షేమ పథకాలు మరియు హామీల అమలు కోసం అప్పులపై ఎక్కువగా ఆధారపడాల్సి వస్తోంది. 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలోనే ప్రభుత్వం రూ. 21,919 కోట్ల మేర రుణాలు స్వీకరించింది. ఇది ఆ సంవత్సరానికి ప్రభుత్వం నిర్దేశించుకున్న మొత్తం వార్షిక రుణ లక్ష్యమైన రూ. 58,458 కోట్లలో 37.5 శాతానికి సమానం. సంవత్సర ప్రారంభంలోనే ఈ స్థాయిలో రుణాలు తీసుకోవడం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మరియు పెరుగుతున్న అప్పుల భారంపై ఆందోళన కలిగిస్తోంది. ఉచిత పథకాలు, గ్యారంటీల నిర్వహణ కోసం మొదటి త్రైమాసికంలోనే నిబంధనలకు మించి అప్పులు చేయాల్సి రావడం ఆర్థిక నిపుణులను ఆందోళనకు గురిచేస్తోంది.

**రాజకీయ సమీకరణాలు ప్రజాభిప్రాయం:**

బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతున్నారు. బడ్జెట్‌లో ఆరు గ్యారంటీలకు తగిన నిధులు కేటాయించలేదని, ఎన్నికల హామీలన్నీ కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శిస్తున్నారు. ప్రభుత్వ సమర్థన మంత్రులు, ఎమ్మెల్యేలు 'ప్రజా పాలన', 'గ్రామసభల' ద్వారా తాము చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. అప్పుల భారం ఉన్నప్పటికీ సంక్షేమాన్ని ఆపలేదని స్పష్టం చేస్తున్నారు. ప్రజా స్పందన విషయానికొస్తే ఉచిత బస్సు, విద్యుత్ పథకాలపై మహిళలు మరియు దిగువ మధ్యతరగతి వర్గాల్లో తీవ్ర సంతృప్తి కనిపిస్తోంది. అయితే, రుణమాఫీ పూర్తి కాకపోవడం, నిరుద్యోగ భృతి అందకపోవడంపై రైతుల్లో, యువతలో అసంతృప్తి వ్యక్తమవుతోంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, పెరిగిన ఆరోగ్యశ్రీ పరిమితి వంటివి విజయవంతంగా అమలవుతూ ప్రజలకు మేలు చేకూరుస్తున్నాయి. అయితే రుణమాఫీ సంపూర్ణ అమలు, మహిళలకు నెలవారీ ఆర్థిక సాయం, నిరుద్యోగ భృతి వంటి హామీలను నిలబెట్టుకోవడం ప్రభుత్వానికి పెద్ద పరీక్షగా మారింది. పెరిగిన అప్పుల భారాన్ని తట్టుకుంటూ, మిగిలిన హామీలను ఏ మేరకు సమర్థవంతంగా అమలు చేస్తారనేదానిపైనే రాబోయే రోజుల్లో ప్రభుత్వం యొక్క భవిష్యత్తు మరియు రాజకీయ సమీకరణాలు ఆధారపడి ఉంటాయి.

**డా . సూర్యదేవర రామకృష్ణ,**
**9490754169**

# యువత వీధుల్లోకి వస్తే ప్రజాస్వామ్యం మేల్కొంటుంది



ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు ఎంత ముఖ్యమో, ప్రజల శాంతియుత నిరసన హక్కు కూడా అంతే కీలకం. ఓటు ద్వారా ప్రభుత్వాలను ఎన్నుకోవడం ప్రజాస్వామ్యానికి మొదటి మెట్టు అయితే, ప్రభుత్వాల నిర్ణయాలను ప్రశ్నించడం, అన్యాయాలను ప్రతిఘటించడం దాని రెండో మెట్టు. ఇటీవల ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద జరిగిన వాంగ్ చుక్ 21 రోజులుగా చేపట్టిన నిరాహారదీక్ష , కాక్రోచ్ జనతాపార్టీ యువత నిరసనలు ఈ రెండో అంశాన్ని మరోసారి దేశవ్యాప్తంగా చర్చకు తెచ్చాయి. ఇది కేవలం ఒక ఉద్యమం మాత్రమే కాదు; దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, పరీక్షల నిర్వహణలో వరుస వైఫల్యాలు, పాలనా వ్యవస్థలపై విశ్వాస సంక్షోభం, భావ ప్రకటనా స్వేచ్ఛపై ఆందోళనల సమ్మిళిత రూపంగా కనిపించింది.

ఈ ఉద్యమానికి ప్రత్యేకత రాజకీయ పార్టీల సమీకరణ కంటే స్వచ్ఛంద ప్రజా భాగస్వామ్యమే. సామాజిక మాధ్యమాల పిలుపుతో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది యువతీ యువకులు తమ సొంత ఖర్చులతో ఢిల్లీకి చేరుకోవడం ఒక కొత్త రాజకీయ సంకేతం. సంపన్న కుటుంబాల విద్యార్థుల నుంచి ప్రభుత్వ కళాశాలల యువత వరకు, సివిల్ సర్వీసుల అభ్యర్థుల నుంచి మహిళల వరకు విభిన్న వర్గాలు ఒకే వేదికపై కనిపించడం ఈ నిరసనకు విస్తృత సామాజిక స్వరూపాన్ని ఇచ్చింది. ఉద్యమం ఏ ఒక్క వర్గానికో, ప్రాంతానికో పరిమితం కాకుండా జాతీయ స్థాయిలో యువత అసంతృప్తిని ప్రతిబింబించింది.

ఈ అసంతృప్తికి మూలాలు కూడా స్పష్టంగానే కనిపిస్తున్నాయి. గత కొన్నేళ్లుగా వివిధ నియామక పరీక్షల ప్రశ్నపత్రాల లీకులు, పరీక్షల రద్దులు, ఫలితాల ఆలస్యం, ఉద్యోగ నియామకాలలో జాప్యం లక్షలాది మంది అభ్యర్థులను తీవ్ర నిరాశకు గురిచేశాయి. దేశంలో 15-29 ఏళ్ల యువతలో నిరుద్యోగం సాధారణ నిరుద్యోగ రేటుతో పోలిస్తే అనేక రెట్లు అధికంగా ఉందని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎలో) మరియు భారత ప్రభుత్వ గణాంకాలు సూచిస్తున్నాయి. ఉన్నత విద్య పూర్తి చేసిన యువతలో ఉద్యోగాల కొరత మరింత తీవ్రంగా ఉందనే విషయం పలు అధ్యయనాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో విద్య, ఉపాధి, పారదర్శక నియామకాలు యువత ప్రధాన డిమాండ్లుగా మారడం సహజ పరిణామమే.

ఈ నిరసనల సందర్భంగా చట్ట అమలు సంస్థల పాత్రపై కూడా తీవ్రమైన చర్చ జరిగింది. దేశీయ, అంతర్జాతీయ మీడియా కథనాలు, సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రసారమైన వీడియోలు శాంతియుతంగా ప్రదర్శన చేస్తున్న నిరసనకారులపై లాఠీచార్జి, బాష్పవాయువు ప్రయోగం జరిగినట్లు చూపించాయి. అలాగే యూనిఫాం లేని వ్యక్తులు లాఠీలతో వ్యవహరించారనే ఆరోపణలు కూడా వినిపించాయి. కొన్నిచోట్ల రాళ్లతో నిండిన వాహనాలను, యాక్సిడెంట్స్ లో దెబ్బ తిన్న కొన్ని వాహనాలు ముందుగానే ఉంచి తరువాత జరిగిన హింసాత్మక ఘటనలకు నిరసనకారులనే బాధ్యులుగా చూపించే ప్రయత్నం జరిగిందని విమర్శలు వచ్చాయి. ఇది పూర్తిగా డిల్లీ పోలీసుల చేసిన కుట్రగా స్థానికంగా యువకులు తమ సెల్ ఫోన్లతో తీసిన అనేక వీడియో దృశ్యాలు సాక్షంగా కనపడుతున్నాయి. ఈ యువకుల చలో పార్లమెంట్ నిరసన ప్రధానను ఆధారంగా చేసుకుని పోలీసులు స్వయంగా రాళ్లు విసిరిన దృశ్యాలు కూడా సామాజిక మాధ్యమాల్లో చర్చకు దారి తీశాయి. అయితే ఇటువంటి ఆరోపణలపై స్వతంత్ర, నిష్పాక్షిక న్యాయ విచారణ జరగడం అత్యంత అవసరం. ప్రజాస్వామ్యంలో పోలీసు వ్యవస్థ రాజకీయ అధికారానికి కాదు, రాజ్యాంగానికి విధేయంగా పనిచేస్తుందనే నమ్మకం బలపడాలి.


చరిత్ర చెబుతున్న ఒక వాస్తవం ఏమిటంటే, విద్యార్థి ఉద్యమాలను కేవలం రాజ్యం/అధికారంలో ఉన్న ప్రభుత్వం తమ పోలీస్, సైనిక బల ప్రదర్శనలతో అణచివేయాలన్న ప్రతి ప్రయత్నం చివరికి మరింత పెద్ద ప్రజా చర్చకు దారితీసింది. 1974 జేపీ ఉద్యమం నుంచి హాంకాంగ్, దక్షిణ కొరియా, చిలీ, అమెరికా విశ్వవిద్యాలయాల వరకు ప్రపంచవ్యాప్తంగా విద్యార్థి ఉద్య మాలు సామాజిక మార్పులకు దోహదపడ్డాయి. భారత రాజ్యాంగంలోని అధికరణ 19 పౌరులకు శాంతియుతంగా సమావేశం కావడానికి, అభిప్రాయాలను వ్యక్తపరచడానికి హక్కు కల్పిస్తుంది. ఆ హక్కు వినియోగాన్ని భద్రపరచడం ప్రభుత్వ బాధ్యత.

ఈ ఉద్యమంలో మరో విశేషం ప్రధాన స్రవంతి మీడియాపై యువత వ్యక్తం చేసిన అసంతృప్తి. అనేక టెలివిజన్ చానళ్లు, పత్రికలు ఉద్యమాన్ని తగిన ప్రాధాన్యంతో చూపలేదని నిరసనకారులు ఆరోపించారు. అందువల్ల సమాచారం కోసం యువత సామాజిక మాధ్యమాలపై ఎక్కువగా ఆధారపడింది. అయితే సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారం కూడా వేగంగా వ్యాపించే ప్రమాదం ఉన్నందున, సంప్రదాయ మీడియా మరియు డిజిటల్ మీడియా రెండూ బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం మరింత పెరిగింది. ఈ ఉద్యమానికి మరో ముఖ్యమైన కోణం అంతర్జాతీయ సంఘీభావం. విదేశాల్లోని భారతీయ విద్యార్థులు, పలు విశ్వవిద్యాలయాల విద్యార్థి సంఘాలు, మానవ హక్కుల కార్యకర్తలు వివిధ నగరాల్లో ర్యాలీలు నిర్వహించి సంఘీభావం ప్రకటించారు. సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరాహార దీక్షకు మద్దతుగా ప్లకార్డులు ప్రదర్శించారు. ప్రపంచీకరణ యుగంలో స్థానిక సమస్యలు అంతర్జాతీయ చర్చగా మారడం ఇప్పుడు సాధారణమవుతోంది. అందువల్ల దేశీయ ఉద్యమాలపై ప్రపంచ దృష్టి పడటం కూడా సహజ పరిణామమే.

సోనమ్ వాంగ్‌చుక్ ఈ ఉద్యమంలో ఒక ప్రతీకగా నిలిచినా, ఈ కాక్రోచ్ జనతాపార్టీ నాయకులు,యువత చేస్తున్న పోరాటం వ్యక్తి ఆరాధన కంటే విలువల కోసం జరిగిన ఉద్యమంగా కనిపించింది. విద్య, ఉపాధి, పారదర్శకత, పర్యావరణ పరిరక్షణ, రాజ్యాంగ విలువలు, సమాన అవకాశాలు వంటి అంశాలే యువతను ఒక వేదికపైకి తీసుకొచ్చాయి. ఇదే ఈ ఉద్యమాన్ని ఇతర రాజకీయ సమీకరణల నుంచి భిన్నంగా నిలబెడుతోంది.

ఏ ప్రజాస్వామ్యానికైనా అతిపెద్ద బలం భయపడని పౌర సమాజం. యువత వీధుల్లోకి రావడం అనేది వ్యవస్థ విఫలమైందనే తీర్పు ఇస్తుంది; వ్యవస్థను మెరుగుపరచాలని ప్రజలు కోరుతున్నారనే సంకేతం అందులో ఉంది. అదే సమయంలో నిరసనలు కూడా పూర్తిగా అహింసాయుతంగా, రాజ్యాంగబద్ధంగా కొనసాగుతుంది. ప్రభుత్వం విమర్శలను దేశద్రోహంగా కాకుండా ప్రజాస్వామ్య స్పందనగా చూడాలి. పోలీసు వ్యవస్థ చట్టపరమైన పరిమితుల్లోనే వ్యవహరించాలి. మీడియా అధికారానికీ, ప్రతిపక్షానికీ కాకుండా సత్యానికే అద్దం పట్టాలి. చివరికి ఈ ఉద్యమం ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తోంది. యువత కోరుతున్నది ఒక అసమర్థుడైన విద్యా శాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ను మాత్రమే. ఇది అతని అధికార మార్పు మాత్రమే కాదు; పాలనా విధానంలో నమ్మకం, విద్యలో న్యాయం, ఉద్యోగాల్లో పారదర్శకత, రాజ్యాంగ హక్కులకు గౌరవం. ఈ హెచ్చరికను పాలకులు వినగలిగితే ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది. వినలేకపోతే అసంతృప్తి మరింత విస్తరించే ప్రమాదం ఉంది.

ప్రజాస్వామ్యంలో శాశ్వత విజేతలు ప్రభుత్వాలు కావు; చివరికి గెలవాల్సింది రాజ్యాంగం, ప్రజల విశ్వాసం, శాంతియుత ప్రజా స్వరమే.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
**9849328496.**

# ఫాసిజాన్ని ఓడించేది ప్రజలే..



చరిత్రను ఎంత జాగ్రత్తగా చదివితే అంత స్పష్టంగా ఒక సత్యం మన ముందుకు వస్తుంది. తమను తాము శాశ్వతులుగా ప్రకటించుకున్న నియంతలు, తాము చరిత్రనే మార్చేస్తామని విర్రవీగిన పాలకులు, తమకు ఎదురే లేదని విర్రవీగిన సామ్రాజ్యాలు చివరికి ప్రజల తీర్పు ముందు తలవంచక తప్పలేదు. ప్రజల భయాన్ని తమ అధికారానికి పునాదిగా మార్చుకున్న ప్రతి పాలకుడూ ఒక దశలో చరిత్ర న్యాయస్థానంలో నిలబడా ల్సి వచ్చింది. ఫాసిజం కూడా అలాంటి చీకటి అధ్యాయం. అది ఒక దేశానికో, ఒక కాలానికో పరిమితమైన రాజకీయ విధానం కాదు; మానవత్వాన్నే లక్ష్యంగా చేసుకున్న అత్యంత ప్రమాదకరమైన భావజాలం.

బెనిటో ముస్సోలినీ తనను ఇటలీ రక్షకుడిగా ప్రకటించుకున్నాడు. ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచి, విభిన్న అభిప్రాయాలను అణచివేసి, కార్మిక ఉద్యమాలను ధ్వంసం చేసి, పత్రికల గొంతును నొక్కి, భయాన్ని పాలనా సాధనంగా మార్చుకున్నాడు. కానీ చరిత్ర ఎప్పుడూ అధికారుల ప్రచారంతో రాయబడదు; ప్రజల రక్తం, కన్నీరు, ప్రతిఘటనతో రాయబడుతుంది. రెండో ప్రపంచ యుద్ధం చివరి దశలో తన పరాజయం తప్పదని గ్రహించిన ముస్సోలినీ స్విట్జర్లాండ్‌కు పారిపోవడానికి ప్రయత్నించాడు. ఇటలీ సరిహద్దులో అతడిని పట్టుకున్నారు. ఒకప్పుడు అతని నిరంకుశ పాలనను వ్యతిరేకించినందుకు జైలుశిక్ష అనుభవించిన కమ్యూనిస్టు ప్రతిఘటన యోధుడు వాల్టర్ ఆడిసియో అతడిపై కాల్పులు జరిపాడు. లక్షల మందిని భయపెట్టి పాలించిన నియంత చివరకు ప్రజల చేతుల్లోనే తన అంతాన్ని చూశాడు.

అదే సమయంలో జర్మనీలో అడాల్ఫ్ హిట్లర్ నిర్మించిన నాజీ సామ్రాజ్యం కూడా కూలిపోతోంది. జాతి ఆధిపత్యం, విద్వేషం, మానవ విభజనను రాజకీయ సిద్ధాంతంగా మార్చి ప్రపంచాన్ని రక్తసిక్తం చేసిన హిట్లర్ చివరకు బెర్లిన్‌లో తన బంకర్‌లో చిక్కుకున్నాడు. సీలో హైట్స్ యుద్ధంలో నాజీ సైన్యానికి చివరి పెద్ద రక్షణ కూలిపోయింది. సోవియట్ ఎర్రసైన్యం బెర్లిన్‌ను చుట్టుముట్టింది. ఒకప్పుడు కోట్లాది మందికి మరణాన్ని పంచిన నియంత చివరకు తనకు తానే మరణాన్ని ఎంచుకున్నాడు. ద్వేషం మీద నిర్మించిన రాజ్యాలకు చివరికి ద్వేషమే సమాధి కడుతుందని చరిత్ర మరోసారి నిరూపించింది.


ఈ రెండు సంఘటనలు ప్రపంచ చరిత్రకు ఒక మహత్తరమైన పాఠాన్ని నేర్పాయి. ఫాసిజాన్ని ఓడించింది మరో ఫాసిస్టు శక్తి కాదు. ఒక జాతి మరొక జాతిపై సాధించిన విజయం కాదు. ఒక మతం ఇంకో మతాన్ని ఓడించిన కథ కాదు. మానవత్వాన్ని కాపాడాలనే సంకల్పంతో ప్రపంచవ్యాప్తంగా ఏకమై నిలిచిన ప్రజల ప్రతిఘటనే ఫాసిజాన్ని ఓడించింది. కార్మికులు, రైతులు, విద్యార్థులు, మహిళలు, రచయితలు, కళాకారులు, మేధావులు, కమ్యూనిస్టులు, సామ్యవాదులు, ప్రజాస్వామ్యవాదులు, స్వేచ్ఛను ప్రేమించిన సాధారణ ప్రజలు-వారి ఐక్యతే ఫాసిజం పతనానికి అసలు కారణం. ఈ సత్యాన్ని మరచిపోవడం అంటే చరిత్రను మరచిపోవడమే.

ఫాసిజం ఎప్పుడూ తాను ఫాసిజమని చెప్పుకుని రాదు. అది దేశభక్తి పేరుతో వస్తుంది. జాతీయ గౌరవం పేరుతో వస్తుంది. మత రక్షణ పేరుతో వస్తుంది. సంస్కృతి పరిరక్షణ పేరుతో వస్తుంది. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను పరస్పరం అనుమానించుకునేలా చేస్తుంది. భిన్నాభిప్రాయాన్ని దేశద్రోహంగా చిత్రీకరిస్తుంది. ప్రశ్నించే గొంతులను శత్రువులుగా ప్రకటిస్తుంది. విద్యార్థులను, కార్మికులను, రైతులను, రచయితలను, జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకుంటుంది. మీడియాను ప్రచార యంత్రాంగంగా మార్చుతుంది. అబద్ధాన్ని పదే పదే చెప్పి నిజంగా నమ్మించే ప్రయత్నం చేస్తుంది. చరిత్రను తిరగరాస్తుంది. రాజ్యాంగ సంస్థలను బలహీనపరుస్తుంది. ప్రజాస్వామ్యాన్ని రూపంలో ఉంచి, ఆత్మను హరిస్తుంది.

చరిత్రలో ఎన్నో సందర్భాల్లో ప్రజలు "ఇక అంతే" అని భావించారు. రెండో ప్రపంచ యుద్ధం ముగిసే సమయానికి యూరప్ మొత్తం శిథిలాల సముద్రంలా కనిపించింది. నగరాలు నేలమట్టమయ్యాయి. లక్షలాది కుటుంబాలు విచ్ఛిన్నమయ్యాయి. కోట్లాది మంది నిరాశ్రయులయ్యారు. అయినప్పటికీ ఆ దేశాలు తిరిగి నిలబడ్డాయి. ఎందుకంటే ప్రజలు ఆశను కోల్పోలేదు. ప్రజాస్వామ్యాన్ని తిరిగి నిర్మించారు. సమానత్వం, శాంతి, సామాజిక న్యాయం వంటి విలువలను మళ్లీ నిలబెట్టడానికి శ్రమించారు. అందుకే చీకటి శాశ్వతం కాదు. ప్రజల సంకల్పమే శాశ్వతం.

ఈ చరిత్ర నేటికీ మనకు మార్గదర్శకం. ప్రజాస్వామ్యంలో యువత పాత్ర అత్యంత కీలకం. ప్రతి గొప్ప సామాజిక మార్పులో యువత ముందుండింది. ప్రశ్నించే యువత ఉన్నంతకాలం ప్రజాస్వామ్యం బతికే ఉంటుంది. విద్య, ఉపాధి, సమానత్వం, రాజ్యాంగ హక్కులు, సామాజిక న్యాయం కోసం పోరాడే ప్రతి యువకుడు, ప్రతి యువతి చరిత్రలో ప్రజాస్వామ్యానికి ఒక కొత్త అధ్యాయం రాస్తున్నారు. వారి స్వరాన్ని అణచివేయడం అంటే భవిష్యత్తును అణచివేయడమే.

నేడు జంతర్ మంతర్‌లో వినిపిస్తున్న స్వరాలు కేవలం ఒక ప్రాంతానికి చెందినవి కావు. అవి రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాపాడాలని కోరుతున్న స్వరాలు. సమాన అవకాశాలు కావాలని అడుగుతున్న స్వరాలు. ప్రజాస్వామ్యాన్ని బలపరచాలని కోరుతున్న స్వరాలు. ఆ స్వరాలను బలవంతంగా మౌనం చేయవచ్చు; కానీ వాటి వెనుక ఉన్న ఆశయాలను చంపలేరు. చరిత్ర ఎన్నిసార్లు నిరూపించినట్లే, ప్రజల న్యాయమైన ఆకాంక్షలు చివరకు మార్గం కనుగొంటాయి. ఒక రోజు వస్తుంది. భయం కంటే ధైర్యం గొప్పదని ప్రజలు మరోసారి నిరూపిస్తారు. విద్వేషం కంటే మానవత్వం గొప్పదని ప్రపంచానికి తెలియజేస్తారు. విభజన కంటే ఐక్యత బలమైనదని చరిత్ర మరోసారి రాస్తుంది. నియంతలు, ప్రచార యంత్రాంగాలు, అణచివేతలు, నిర్బంధాలు అన్నీ తాత్కాలికమే. కానీ ప్రజల స్వేచ్ఛ కోసం జరిగిన పోరాటం శాశ్వతం. మానవ గౌరవం శాశ్వతం. సమానత్వం శాశ్వతం. కాలం మారవచ్చు. పాలకులు మారవచ్చు. ప్రభుత్వాలు మారవచ్చు. కానీ చరిత్ర తీర్పు మారదు. ఫాసిజం ఎంత బలంగా కనిపించినా, అది ప్రజల ఐక్య ప్రతిఘటన ముందు నిలబడలేదు, ఇకముందూ నిలబడదు. ప్రజలే చరిత్ర నిర్మాతలు. ప్రజలే ప్రజాస్వామ్యానికి యజమానులు. ప్రజలే అంతిమ న్యాయమూర్తులు. కాలం సాక్షి... చరిత్ర సాక్షి... ఫాసిజాన్ని ఓడించేది ప్రజలే.



**-మామిండ్ల రమేష్ రాజా,**
రాష్ట్ర కార్యదర్శి, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్
తెలంగాణ,
సెల్ : 78932 30218

# బహుజన విముక్తి స్వరమైన జాషువా కవిత్వం

*(గుర్రం జాషువా 55వ వర్ధంతి ఆగస్టు 24)*

"చెప్పులు కుట్టు వాని సేవకు భరతవాని అప్పు పడ్డది సుమీ"- అనీ పలికిన గుర్రం జాషువా కవిత వాక్యం భారతీయ కులవ్యవస్థలోని సామాజిక, ఆర్థిక వైరుధ్యాలను ఆవిష్కరించాడు. వేల ఏళ్లుగా సబ్బండ శ్రామిక కులాలు దేశ నిర్మాణానికి వెన్నెముకగా నిలిచినా... గౌరవం, సమాన హక్కులు, సామాజిక గుర్తింపు మాత్రం వారికి దక్కలేదని జాషువా ఈ వాక్యంలో స్పష్టం చేశాడు. శ్రామిక దళిత, బహుజనుల పట్ల ఈ దేశం నైతికంగా రుణపడి ఉందనే మహత్తర సామాజిక-ఆర్థిక తత్వాన్ని అత్యంత సరళంగా, అత్యంత పదునైన భాషలో వ్యక్తీకరించాడు. ఇది నేటికి సమకాలీకమైనది, సార్వజనీనమైనది.. ఆయన 1895 సెప్టెంబర్ 28న గుంటూరు జిల్లా, వినుకొండ మండలం, చాట్రగడ్డపాడులో జన్మించారు. దళిత కులంలో పుట్టిన జాషువా బాల్య దశ నుంచే ఎన్నో అవమానాలు, కుల వివక్షను అనుభవించాడు. వీటికి వ్యతిరేకంగా తన కవిత్వాన్ని ఆయుధంగా మలుచుకున్నాడు. ఆయన ఆగస్టు 24,1971 న తుది శ్వాస విడిచాడు. దళిత సాహిత్యానికి పితామహుడైన నవయుగ కవి చక్రవర్తిగా మిగిలాడు.

**జాషువా కవిత్వం మానవ హక్కుల పోరాటం**

చారిత్రకంగా మనిషి ఉన్నతికి కులం గీటురాయిగా మారడంతో సాహిత్యం కూడా ధనికుల, అగ్ర వర్ణాలకి వెట్టి చాకిరి చేసింది. సాహిత్య ప్రక్రియలు కొద్దిమంది గీసిన హద్దుల్లో తిరిగాయి. రచనలకు సైతం అంటరానితనమనే లక్షణాలు కమ్ముకున్నాయి. వీటిపై సామాజిక సమరం సాగించిన కవి గుఱ్ఱం జాషువా. ఆయన కాలంలో అగ్రవర్ణ భావ కవిత్వం, అభ్యుదయ, విప్లవ కవిత్వం ఏరులై పారుతున్న క్రమంలో దళిత కవిత్వం గొంతుకై వినిపించాడు. తనకి ఎదురైన చేదు అనుభవాన్ని, పీడిత వర్గాల సమస్యలను ప్రతిబింబిస్తూ సాహిత్యాన్ని విశ్వదృష్టికి పరిచయం చేశారు. భారతీయ కుల వివక్షతను జాషువా వర్ణించనట్లు ఏ కవి కూడా వర్ణించలేదు. ఆయన కవిత్వంలో మానవ హక్కుల పోరాటం కనబడుతుంది. తన సాహిత్యంలో గబ్బిలం, గాడిద, గుర్రం వంటి ఉపమనాలు ఉపయోగించి దళిత జీవన బాధలను చిత్రించారు. మూఢాచారాలు, అసమానత, అంటరానితనంపై సవాళ్లు విసిరారు. దళిత సాహిత్య రచనలలో ప్రముఖమైన గబ్బిలం కావ్యం ద్వారా దళితుడి బాధను, ఆత్మగౌరవాన్ని చిత్రీకరించారు. దళిత జీవనవైఖరినీ సమగ్ర చిత్రణగా పరిగణిస్తుంది. "ఫిరదౌసి", "అనాథ", "స్వప్నకథ" వంటి సామాజిక కవిత్వాలు రచించారు. "అనాథ" తొలి తెలుగు దళిత మహిళా కావ్యంగా గుర్తింపు పొందింది. ఈ విధంగా జాషువా కవిత్వం పీడిత వర్గాల హక్కుల పోరాటంగా నిలిచింది. సమాజంలో వేల ఏళ్లుగా దోపిడికి గురైన కులాలకు "చెప్పులు కుట్టు వాని సేవకు భరతవాని అప్పు పడ్డది సుమీ" అనే వాక్యం ప్రజా చైతన్య నినాదమైనది. తద్వారా ఏమి ఆశించకుండా చెప్పులు కుట్టే మాదిగలకు అగ్రకుల సమాజం అప్పు పడ్డది అన్నాడు. ఇలా సమస్త సబ్బండ శ్రామిక శూద్ర కులాలకు ఈ దేశం అప్పు పడ్డదని గొప్ప ఆర్థిక సూత్రాన్ని చెప్పాడు. ఈ వాక్యం తెలంగాణ రాష్ట్రంలోనీ బీసీ, ఎస్సీ, ఎస్టీ విముక్తి ఉద్యమ సారథి డాక్టర్ విశారదన్ మహారాజ్ స్థాపించిన "దళిత శక్తి" ఉద్యమ కరపత్రంలోని తొలి వాక్యమైనది. ఆయన చేసిన పదివేల కిలోమీటర్ల "స్వరాజ్య పాదయాత్ర"లో నిగూఢంగా ఉంటూ సబ్బండ వర్గాలలో చైతన్యాన్ని రగిలించింది. ఈ విధంగా జాషువా కవిత్వం బహుజన విముక్తి పోరాటమై, కుల వ్యవస్థపై గర్జనై ఇప్పటికీ మనల్ని నడిపిస్తోంది.

**ప్రపంచానికి పరిచయమైన జాషువా**

అంబేద్కర్ విముక్తి పోరాటం జాషువా కవిత్వంలో కనబడుతుంది. జాషువా విగ్రహ ఆవిష్కరణకు బహుజన రాజ్యాధికార వీరుడు కాన్షీరాం ఆంధ్రప్రదేశ్ లోని వినుకొండకు వచ్చాడు. అప్పుడే జాషువా ధిక్కార స్వరం ప్రపంచానికి పరిచయమై, ఆయనకు విశాల గుర్తింపు లభించింది. ఎప్పుడైనా కేవలం ఊహాజనిత కవిత్వం నుంచి విప్లవం రావడం భ్రమ, క్షేత్రస్థాయి ప్రజా విముక్తి పోరాటం నుంచే వచ్చే కవిత్వం విప్లవానికి తోడవుతుంది. ఈ క్రమంలో జాషువా కవిత్వం కూడా ఆ కోవకే చెందినది. జాషువా తన గురువులు పేదరికం, కులమత భేదం అన్నాడు. ఒకటి నాకు సహనాన్ని నేర్పితే, రెండోది నాలో ఎదిరించే శక్తిని పెంచిందే కాని బానిసగా మార్చలేదు. నేడు సమాజంలో ఎంతో మంది దళిత, వెనకబడిన వర్గాల కవులు, కళాకారులు, రచయితలు ఉన్నప్పటికీ జాషువా లాంటి నికార్సైన ప్రతిఘటన కనబడదు. అగ్రకుల పాలక పక్షాన నిలబడుతూ పబ్బం గడుపుకుంటున్నారు. ద్వీపస్తంభం లేకుండా ప్రయాణిస్తున్నారు. ఇప్పటికీ అగ్రకుల కనుసన్నల్లో నడిచే అభ్యుదయ, విప్లవ కవిత్వంలోనే దళిత విముక్తి ఉందనుకోవడం గమనార్హం. స్వశక్తితో నడిచే అట్టడుగు అణగారిన వర్గాల బానిసత్వ విముక్తి ఉద్యమాలకు తోడుగా రచనలు సాగాలి. అప్పుడే అవి ప్రజాధారణ పొందుతాయి. ఇదే జాషువాకు నిజమైన నివాళి.



**సంపతి రమేష్ మహారాజ్**
సామాజిక విశ్లేషకులు
7988579428

ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

శుక్రవారం
24.07.2026




## విద్యార్థులకు మద్దతుగా దేశవ్యాప్తంగా

# పెల్లుబికుతున్న నిరసనలు

జంతర్‌మంతర్-పార్లమెంటు ర్యాలీ సందర్భంగా యువతపై పోలీసుల కర్కశత్వాన్ని వ్యతిరేకిస్తూ నేడు దేశవ్యాప్త ఆందోళనలకు సీజేపీ పిలుపునిచ్చింది. శాంతియుతంగానే నిరసనలు ఉండాలని కూడా సూచించింది. పేపర్ లీక్ అంశంపై చర్చకు తాము సిద్ధమని కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో కాక్రోచ్ జనతా పార్టీ మరో నిరసన కార్యక్రమానికి సిద్ధం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నిరసన కార్యక్రమానికి కావాల్సిన అనుమతులు పొందేందుకు, ఏర్పాట్లు చేసేందుకు విద్యార్థి సంఘాలు, యూత్ ఆర్గనైజేషన్లు కలిసి పనిచేయాలని సీజేపీ పిలుపునిచ్చింది. నీట్ పేపర్ లీక్ అంశంలో సీజేపీ డిమాండ్స్ గురించి ఈ నిరసనల్లో బహిరంగంగా చదవాలని పేర్కొంది. అటు నీట్ పేపర్ లీక్ అంశంపై ప్రతిపక్షాల నిరసనల నడుమ లోక్‌సభ నేటికి వాయిదా పడింది. రాజ్యసభను కూడా వాయిదా పడింది.



## నేడు దేశవ్యాప్త ఆందోళనలకు కాక్రోచ్ జనతా పార్టీ పిలుపు

శాంతియుతంగానే నిరసనలు తెలపాలని సూచన

### విద్యార్థుల డిమాండ్లకు రాహుల్ గాంధీ సంపూర్ణ మద్దతు

**న్యూఢిల్లీ,జూలై23(జనంసాక్షి):** నీట్ పేపర్ లీక్‌కు కేంద్రం బాధ్యత వహించాలంటూ ఉద్యమిస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) 24న శుక్రవారం దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చింది. ఇటీవలి జంతర్‌మంతర్-పార్లమెంటు ర్యాలీ సందర్భంగా యువతపై పోలీసుల కర్కశత్వాన్ని వ్యతిరేకిస్తూ ఈ నిరసనకు పిలుపునిచ్చినట్టు తెలిపింది. ఈ కార్యక్రమానికి కావాల్సిన అనుమతులు, ఇతర ఏర్పాట్లకు సిద్ధం కావాలని యువతను కోరింది. శాంతియుతంగానే నిరసనలు ఉండాలని కూడా సూచించింది. పేపర్ లీక్ అంశంపై చర్చకు తాము సిద్ధమని కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో కాక్రోచ్ జనతా పార్టీ మరో నిరసన కార్యక్రమానికి సిద్ధం కావడం

మిగతా 4లో..

## చలో పార్లమెంట్ విద్యార్థులపై పోలీసు కాల్పులు?

నౌతన్ టొప్పోకు గన్‌షాట్ ఇంజురీ..!

తుపాకీ గాయం అనుమానంగా మెడికో-లీగల్ సర్టిఫికెట్‌లో నమోదు



**న్యూఢిల్లీ, జూలై 23(జనంసాక్షి):** చలో పార్లమెంట్ నిరస న సందర్భంగా విద్యా ర్థులపై పోలీసులు కా ల్పులు జరిపారన్న ఆ రోపణలు తీవ్ర చర్చ కు దారితీశాయి. జూలై 20న జరిగిన ఆందో ళనలో గాయపడిన వి ద్యార్థిని నౌతన్ టొప్పోకు "గన్‌షాట్ ఇంజురీ (తుపాకీ గాయం అనుమానం)" ఉన్నట్లు ఆమె మెడికో-లీగల్ సర్టిఫికెట్‌లో నమోదైనట్లు ఒక వార్తా సంస్థ వెల్ల డించింది. 32 ఏళ్ల నౌతన్ టొప్పోకు చెవి వద్ద తీవ్ర గాయం కావడంతో వైద్యులు అత్యవసర శస్త్రచికిత్స నిర్వహించగా, ప్రస్తుతం ఆమెకు తదుపరి చికిత్స కొనసాగుతోంది .నిరసనలో పాల్గొన్న అనంతరం ఇంటికి తిరిగి వెళున్న సమయంలో పోలీసులు తమ వైపు రైఫిళ్లు గురిపెట్టారని, అనంతరం జరిగిన కాల్పుల్లో రబ్బర్ బుల్లెట్ నేరుగా తన చెవికి తగిలిందని నౌతన్ టొప్పో ఆరోపించారు. కాల్పు జరిగిన వెంటనే కుడి చెవి వద్ద తీవ్ర మంట, నొప్పి ప్రారంభమైందని ఆమె తెలిపినట్లు వార్తా సంస్థ పేర్కొంది. కాగా, చలో పార్లమెంట్ ఆందోళన సందర్భంగా పోలీసులు పెలెట్ గన్స్ లేదా రబ్బర్ బుల్లెట్లు ఉపయోగించలేదని ఢిల్లీ పోలీసులు ఇప్పటికే స్పష్టం చేశారు. అయితే గాయపడిన విద్యార్థిని మెడికో-లీగల్ సర్టిఫికెట్‌లో "గన్‌షాట్ ఇంజురీ" నమోదు కావడం ఈ ఘటనపై మరిన్ని ప్రశ్నలకు తావిస్తోంది. గన్‌షాట్ ఇంజురీ" అనేది మెడికో-లీగల్ సర్టిఫికెట్‌లో నమోదైన వివరంగా, "పోలీసు కాల్పులు" అనేది నిరసనకారిణి ఆరోపించింది. నీట్ పరీక్షలో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువజన సంఘాలు జూన్ 6 నుంచి నిరసనలు కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. జూలై 20న వేలాది మంది పార్లమెంట్ వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకోవడంతో ఘర్షణలు చోటుచేసుకున్నాయి. "



## పేపర్‌లీక్‌పై విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తాం

యువత భవిష్యత్తుకు హాని చేయాలని చూసేవారిని ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టబోం : ప్రధానిమోదీ

4లో..

## యువత భవిష్యత్తుకు హాని చేసింది మీరే..

- విద్యావ్యవస్థ నిర్వీర్యమవుతుంటే బాధ్యులైన వారిని శిక్షించకుండా రక్షించారు : రాహుల్ గాంధీ
- విద్యార్థుల డిమాండ్లు నెరవేర్చాల్సిందే..
- పార్లమెంట్ ఎదుట మీడియా సమావేశంలో ప్రియాంక

4లో..

## ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే తొలగించండి

- లేకుంటే మీరే తొలగిపోవాల్సి వస్తుంది
- ప్రధాని మోదీకి అభిజిత్ దీప్కే హెచ్చరిక
- ధర్మేంద్ర ప్రధాన్‌కు కేంద్రం ఇంకా ఎందుకు అండగా ఉంటోందని ప్రశ్న

### పార్లమెంటులోనూ ప్రతిష్టంభన

విపక్షాల పట్టుతో నేటికి వాయిదా

4లో..

## డీజీపీ కార్యాలయంలో కానిస్టేబుల్ ఆత్మహత్య

సర్వీస్ తుపాకీతో కాల్చుకున్నట్లు గుర్తింపు

సూసైడ్ నోట్ ఆధారంగా పోలీసుల దర్యాప్తు

**హైదరాబాద్(జనంసాక్షి):** నగరంలో కానిస్టేబుల్ ఆత్మహత్య తీవ్ర కలకలం రేపుతోంది. తెలంగాణ రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో కానిస్టేబుల్ స్వామి తన సర్వీస్ తుపాకీతో కాల్చుకుని బలవన్మరణానికి పాల్పడారు. గురువారం తెల్లవారుజామున 5:30 గంటల ప్రాంతంలో వాష్‌రూమ్‌లో స్వామి ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. స్వామి గ్రేహౌండ్స్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

మిగతా 4లో..

## గ్లోబరీనాతో నాకు సంబంధంలేదు

### ముఖ్యమంత్రి రేవంత్‌కు కేటీఆర్ లీగల్ నోటీసులు



**హైదరాబాద్,జూలై23(జనంసాక్షి):** 2019 ఇంటర్ ఫలితాల్లో కేటీఆర్ బినామీ సంస్థ గ్లోబరీనా అవకతవకలకు పాల్పడిందని సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ముఖ్యమంత్రి హోదాకు తగిన విధంగా ఒక్కసారైనా వ్యవహరించాలని సూచించారు. పేపర్ లీక్ వంటి అత్యంత దురదృష్టకర ఘటనను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తూ తప్పుడు ప్రచారం చేయడం ముఖ్యమంత్రి పదవికే మచ్చ తెచ్చే చర్య అని ఆయన ఆరోపించారు. గ్లోబరీనా సంస్థతో బీఆర్ఎస్‌కు, తన కుటుంబానికి లేదా తనకు ఎలాంటి సంబంధం లేదని కేటీఆర్ మరోసారి స్పష్టం చేశారు. ఈ విషయంలో చేసిన ఆరోపణలపై క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో న్యాయపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపారు. దీనికి సంబంధించి తమ న్యాయ బృందం త్వరలోనే ముఖ్యమంత్రికి లీగల్ నోటీసు పంపనున్నట్లు వెల్లడించారు. అలాగే, ముఖ్యమంత్రి తరచూ తనపై అసభ్యకరమైన, ఆధారరహిత ఆరోపణలు చేస్తున్నప్పటికీ వాటికి తాను ఎక్కువగా స్పందించలేదని కేటీఆర్ పేర్కొన్నారు. తన మౌనం ఆరోపణలను అంగీకరించినట్లు కాదని, నిరాధార విమర్శల స్థాయికి దిగజారి వాదించడం తనకు ఇష్టం లేదని వ్యాఖ్యానించారు. గ్లోబరీనా తన బినామీ సంస్థ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలపై

మిగతా 4లో..

## గ్లోబరీనా కేటీఆర్ బినామీ సంస్థ

- ఆ సంస్థ తప్పిదాల వల్ల 27 మంది బలి
- పేరు మార్చుకుని పరీక్షల కాంట్రాక్ట్ పొందింది

- దీనికి బాధ్యత వహిస్తూ వెంటనే కేటీఆర్ క్షమాపణలు చెప్పాలి
- ధర్మేంద్ర రాజీనామాకు బీఆర్ఎస్ ఎందుకు డిమాండ్ చేయట్లేదు?
- బీఆర్ఎస్, బీజేపీలు రెండూ ఒక్కటే
- సర్ ప్రక్రియలో ఎస్సీఎస్టీ, ఓట్లు తొలగించే కుట్ర
- అందుకే అప్రమత్తంగా ఉండాలి
- ఓటు లేకపోతే పథకాలు పోతాయి
- మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,జూలై 23(జనంసాక్షి):** గ్లోబరీనా ముమ్మాటికీ కేటీఆర్ బినామీ సంస్థ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోమారు ఆరో పించారు. గురువారం మీడియాతో నిర్వహించి చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. గ్లోబరీనా తప్పిదాల వల్ల 27 మంది చనిపోయారని.. ఆ సంస్థ పేరు మార్చుకొని పరీక్షల కాంట్రాక్టు పొందిందని వ్యా ఖ్యానించారు. వీటి ఆధారంగానే నీట్ కుంభకోణం జరిగిందన్నారు. గ్లోబరీనా తప్పిదాలపై కేటీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అమరవీరుల స్తూపం వద్ద కేటీఆర్ ముక్కు నేలకు రాయాలన్నారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విషయంలో బీఆర్ఎస్ ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేత కేటీఆర్, బీజేపీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేటీఆర్ బర్త్ డే పై సీఎం రేవంత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'కేటీఆర్ పుట్టిన రోజు దావత్ ఇస్తాడో అడగాలి. కేటీఆర్ ఇచ్చే దావత్ నేను తీసుకోలేనేమో. ఆ యనవి అన్నీ వేరే పార్టీలు' అంటూ సెటైర్ విసి రారు. హరీశ్ గొప్పవాడైతే



మంత్రి పదవి నుంచి ఎందుకు తీసేశారని ప్రశ్నించారు. అతి తెలివి తేటలతో ఏదిపడితే అది మాట్లాడతానంటే నడవదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు కన్నెపల్లి పంపు హౌజ్ గురించి మాట్లాడు తున్నారని... మేడిగడ్డ గురించి ఎందుకు మాట్లా డడం లేదని ప్రశ్నించారు. మేడిగడ్డ గురించి మాట్లాడితే ప్రజలు చెప్పుతో

మిగతా 4లో..

## యూనిఫామ్‌ల పంపిణీలో అలసత్వం వద్దు

నిర్లక్ష్యంవహిస్తే కఠిన చర్యలు: సీఎం రేవంత్

4లో..

## పేదలకు ఇళ్లు కడితే ఎందుకంత కడుపుమంట?

- మహానగరం నడిబొడ్డున పేదోడికి ఇల్లు ఉండొద్దా?
- పదేళ్లు చేయలేనిది కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంటే... విష ప్రచారమా?
- కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూముల్లో పేదలకు వాటా ఇస్తే తప్పా?
- డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో పేదలను బీఆర్ఎస్ దగా చేసింది : మంత్రి పొంగులేటి

**హైదరాబాద్,జూలై 23 (జనంసాక్షి):** హైదరాబాద్ మహానగరం నడిబొడ్డులో పేదలకు గౌంవ ప్రదమైన సొంతింటిని అందించాలనే ప్రజా ప్రభుత్వ సంకల్పాన్ని చూసి బీఆర్ఎస్ నాయకత్వం తీవ్ర అసహనానికి గురవుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార,పౌరసంబంధాల శాఖ మంత్రి పొం గులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. నిరుపేదలు నివసిస్తున్న ప్రాంతంలోనే వారి సొంతింటి కలను నెరవేర్చడానికి నియోజకవర్గాన్ని యూనిట్ గా తీసుకొని వారు నివసిస్తున్న ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నామని అన్నారు. ఈ ఇళ్ల కోసం స్థానికంగా అందుబాటులో



ఉన్న మీ సేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేసారు. అదేవిధంగా మీసేవ వాట్సాప్ నెంబర్ (8096958096), వెబ్‌సైట్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. గురువారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్లు, దరఖాస్తులు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. సమీక్ష అనంతరం మంత్రి మాట్లాడుతూ పదేళ్ల పాలనలో వారు చేయలేని పనిని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంటే ప్రజలను తప్పుదోవ పట్టించేలా విష ప్రచారాలతో రాజకీయ లబ్దిపొందాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్‌లో పేదల సొంతింటి కలను నెరవేర్చలేక పోయింది. నగరంలోనే పుట్టి పెరిగి అక్కడే జీవిస్తున్న నిరుపేద కుటుంబాలకు నగర నడిబొడ్డులో

మిగతా 4లో..

## యువత గొంతు నొక్కితే బీజేపీ పతనమే

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరిక



**హైదరాబాద్,జూలై 23(జనంసాక్షి):** యువత గొంతు నొక్కితే బీజేపీ రాజకీయ పతనం తప్పదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని భయపెట్టలేరని.. రాజ్యాంగాన్ని అణచలేరన్నారు. విద్యార్థుల ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా నిర్బంధాలు సరికాదని అన్నారు. ఉద్యోగాలు అడిగిన యువతకు లాఠీలు, కేసులే బీజేపీ సమాధానమనమంటూ విమర్శలు గుప్పించారు. ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కే అని చెప్పుకొచ్చారు. విద్యార్థుల స్వరాన్ని అణచివేయడం ప్రజాస్వామ్యానికి ముప్పని వ్యాఖ్యానించారు. యువత భవిష్యత్తుపై కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మంత్రి విమర్శించారు. విద్యార్థుల మధ్య నిలిచిన రాహుల్ గాంధీ నిజమైన ప్రజానాయకుడన్నారు. ప్రజల మధ్య ఉండే నాయకత్వానికే దేశం మద్దతిస్తుందని తెలిపారు. భయపెట్టి ప్రజల స్వరాన్ని శాశ్వతంగా అణచలేరని అన్నారు. విద్యార్థుల కలలను సంకెళ్లతో బంధించలేరని స్పష్టం చేశారు.


మిగతా 4లో..

## హర్మ్యూజ్‌పై పట్టు సాధిస్తాం

- నౌకలు, నావికులను బెదిరించేందుకు ఇరాన్ తీవ్రంగా ప్రయత్నిస్తోంది
- దానికి అడ్డుకట్ట వేసేందుకే అమెరికా దాడులు చేస్తున్నాం : యూఎస్ సెంట్రల్ కమాండ్
- ఎర్రసముద్రంలో చమురు నౌకలపై హూతీల దాడి.. ఇరాన్‌కు ట్రంప్ స్ట్రాంగ్ వార్నింగ్
- హూతీలు దాడులకు పాల్పడినా.. టెహ్రాన్ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరిక

**వాషింగ్టన్(జనంసాక్షి):** వాణిజ్య నౌకలు, నావికులను బెదిరించేందుకు ఇరాన్ తీవ్రంగా ప్రయత్నిస్తోందని, దానికి అడ్డుకట్ట వేసేందుకే అమెరికా దాడులు చేస్తోందని యూఎస్ సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. హర్మ్యూజ్ జలసంధిపై మళ్లీ పట్టు సాధించేందుకు, నౌకల రాకపోకలు సజావుగా సాగేలా చూసేందుకు అమెరికా దళాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయని తెలిపింది. హర్మ్యూజ్‌పై పట్టు సాధిస్తామని ధీమా వ్యక్తం చేసింది. మరోవైపు అమెరికా- ఇరాన్ యుద్ధంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమవుతోంది. చమురు ధరలు పెరిగిపోతున్నాయి. ఈ క్రమంలో హూతీల రూపంలో మరో సమస్య వచ్చిపడింది. ఇరాన్‌కు మద్దతుగా నిలుస్తున్న హూతీలు.. ఎర్ర సముద్రంలో ప్రయాణిస్తున్న సౌదీ అరేబియాకు చెందిన రెండు చమురు నౌకలపై దాడి చేశారు. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు వార్నింగ్ ఇచ్చారు. హూతీలు దాడులకు పాల్పడినా.. టెహ్రాన్ భారీ మూల్యం

మిగతా 4లో..



## అమెరికాపై 9/11 తరహా దాడులు చేస్తాం

ఇరాన్ తీవ్ర హెచ్చరికలు

4లో..

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
24.07.2026



# యువత భవిష్యత్తుకు హాని చేసింది మీరే..

న్యూఢిల్లీ(జనంసాక్షి):మోదీ ప్రకటనపై కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. "మన యువత భవిష్యత్తుకు హాని చేసింది మీరే. మన విద్యావ్యవస్థ నిర్వీర్యం అవుతుంటే చూసి, బాధ్యులైన వారిని రక్షించారు. ఇప్పుడు విద్యార్థులు డిమాండ్లు స్పష్టంగా ఉన్నాయి. 1. ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలి. 2. విద్యార్థులకు క్షమాపణ చెప్పాలి. 3. యువతపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి" అని రాహుల్ ఎక్స్ రాసుకొచ్చారు.కాగా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేస్తామంటూ ప్రధాని చేసిన ప్రకటనపై అటు సీజేపీ కూడా స్పందించింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌ను పునరుద్ఘాటించింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టింది. ఇదిలా ఉండగా.. సీజేపీ ఆందోళనల దృష్ట్యా గురువారం కూడా దిల్లీలో 16 మెట్రో స్టేషన్లను అధికారులు మూసివేశారు.

మోదీ జీ.. విద్యార్థుల్ని ప్రేమగా చూసుకోవడమంటే ఇదేనా?: ప్రియాంక

దిల్లీ: నీట్ పేపర్ లీక్, చలో పార్లమెంట్ నేపథ్యంలో విద్యార్థులపై పోలీసుల దాడి ఘటనలపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు. దేశ యువత ఏ విజయం సాధించినా తన ఖాతాలో వేసుకునే ప్రధాని.. విద్యార్థులపై దాడులకు కూడా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. గురువారం పార్లమెంట్ ఆవరణలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. విద్యార్థులను తాను ఎంతో ప్రేమగా చూసుకుంటానని సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెట్టే ప్రధాని మోదీ.. వారిపై బాష్పవాయువు ప్రయోగించి, లాఠీఛార్జ్ చేయించారని విమర్శించారు."అధికార పక్షానికి చెందిన ఎంపీలు పార్లమెంట్ బయట నిల్చొని ఆందోళన చేయడం ఎప్పుడైనా చూశామా? పార్లమెంట్ సమయాన్ని వృథా చేస్తున్నారు. మనం అసలు ప్రజాస్వామ్యంలోనే జీవిస్తున్నామా? పిల్లలు (విద్యార్థులు) ఆందోళన చేస్తుంటే ఇంటర్నెట్ కట్ చేస్తున్నారు. వాళ్లు ఉగ్రవాదులు కాదు. ఆందోళన చేస్తున్న వారిపై బాష్పవాయువు ప్రయోగించారు. ఇష్టమొచ్చినట్లుగా లాఠీలతో కొట్టారు. ఇదేం ప్రజాస్వామ్యం? క్రీడల్లో పతకాలు సాధిస్తే.. తన వల్లే వచ్చిందని.. మోదీ ఆ క్రెడిట్‌ను తన ఖాతాలో వేసుకుంటారు. అంగారకుడిపైకి వెళ్లినా, రాకెట్లు ప్రయోగించినా వాటినీ తన ఖాతాలోనే వేసుకుంటారు. ఆయన అధికారంలో ఉన్నప్పుడు దాదాపు 152 పేపర్ లీకేజీలు జరిగాయి. వాటికి బాధ్యులెవరు? ప్రస్తుతం విద్యార్థులపై జరుగుతున్న దాడులకు బాధ్యులెవరు? విజయాలను తన ఖాతాలో వేసుకుంటున్న మోదీ.. వీటికి కూడా బాధ్యత వహించాలి" అని ప్రియాంక గాంధీ డిమాండ్ చేశారు.

# వెంటనే ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించండి

న్యూఢిల్లీ,జూలై23(జనంసాక్షి): కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలని ప్రధాని మోదీని కాక్రోచ్ జనతా పార్టీ ప్రెసిడెంట్ అభిజీత్ దీప్కే గురువారం మరోసారి కోరారు. కేంద్రం స్పందించని పక్షంలో ఈ రాజీనామాల పర్వం ప్రధాని మోదీ వరకూ చేరుతుందని వ్యాఖ్యానించారు. 'మోదీ జీ.. మిమ్మల్ని మరోసారి అభ్యర్థిస్తున్నా.. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను ఆమోదించండి. లేకపోతే ఇది ఆయన రాజీనామాకే పరిమితం కాదు. మీ రాజీనామా వరకూ వస్తుంది' అని అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్‌కు కేంద్రం ఇంకా ఎందుకు అండగా ఉంటోందని అభిజీత్ దీప్కే ప్రశ్నించారు. 'దేశంలోని కోట్ల మంది విద్యార్థుల కంటే ఒక విఫల, అసమర్థ మంత్రి ఎక్కువ కాదు కదా? ఒక వేళ మంత్రే ముఖ్యమని భావిస్తే దేశంలో మీకెవరూ ఓటు వేయబోరన్న విషయాన్ని మర్చిపోవద్దు' అని అన్నారు. నీట్ పేపర్ లీక్‌పై చర్చకు కేంద్రం మరోసారి ఆహ్వానించగా సీజేపీ తిరస్కరించిన విషయం తెలిసిందే. ఎలాంటి చర్చైనా జంతర్‌మంతర్ వద్ద లేదా మరో తటస్థ వేదికపై జరగాలని సీజేపీ స్పష్టం చేసింది. ఇక ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామన్న ప్రధాని ప్రకటనపై కూడా సీజేపీ ప్రతినిధి స్పందించారు. ఇలాంటి ప్రకటనలతో ఏ ప్రయోజనం ఉండదని అన్నారు. మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా మినహా తాము మరొకటి ఆశించట్లేదని స్పష్టం చేశారు.

# అమెరికాపై 9/11 తరహా దాడులు

టెహ్రాన్(జనంసాక్షి):పశ్చిమాసియాలో పరిస్థితులు మరింతగా దిగజారాయి. అమెరికా-ఇరాన్ పరస్పర దాడులు, ప్రకటనలతో ఘర్షణలు తీవ్రరూపం దాల్చాయి. హర్మూజ్ జలసంధిలో ఇరాన్ ఇకనుంచి ఏదైనా నౌకపై దాడి చేసినప్పుడల్లా ఆ దేశంలోని ఓ వంతెన లేదా విద్యుత్ కేంద్రంపై బాంబులేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు చేసిన సంగతి తెలిసిందే. వాటికి ఐఆర్‌జీసీ నుంచి తీవ్ర స్పందన వచ్చింది. అమెరికాపై 9/11 తరహా దాడి చేస్తామని బెదిరించింది. ఘర్షణలు ఇలాగే కొనసాగితే ఆ దేశం జాతీయ సంతాప దినాలు చేసుకోవాల్సి వస్తుందని హెచ్చరికలు చేసింది. ఈ మేరకు ఇరాన్ ప్రభుత్వ అనుబంధ మీడియా సంస్థ తస్నిమ్ పేర్కొంది. వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై ఉగ్రవాదుల దాడి అమెరికా చరిత్రలో అత్యంత విషాదకర ఘటనగా మిగిలిపోయింది. సెప్టెంబరు 11, 2001న 4 విమానాలను అల్‌ఖైదా ఉగ్రవాదులు హైజాక్ చేసిన సంగతి తెలిసిందే. 19 మంది ఉగ్రవాదులు నాలుగు జట్లుగా విడిపోయి 'ట్విన్ టవర్స్'గా పిలుచుకునే ప్రపంచ వాణిజ్య సంస్థ భవంతులపై దాడులకు పాల్పడ్డారు. ఈ మారణహోమంలో మొత్తం 2,996 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 25 వేల మంది పౌరులు క్షతగాత్రులయ్యారు. అప్పుడు అమెరికా జాతీయ సంతాప దినాలు ప్రకటించింది. ఆ విషయాన్ని ప్రస్తావిస్తూనే ఇరాన్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

మేం చమురు అమ్మకపోతే.. ఇంకెవరు అమ్ముకోలేరు: ఇరాన్

అమెరికా బలగాలు హర్మూజ్‌కు దూరంగా ఉంటేనే ఆ జలసంధి భద్రంగా ఉంటుందని ఇరాన్ (ఎతీజీని) స్పీకర్ మహమ్మద్ ఘాలిబఫ్ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. తాము చమురు అమ్మకపోతే.. ఇంకెవరూ అమ్మలేరని వ్యాఖ్యానించారు. హర్మూజ్‌లో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులు చేయడంతో పశ్చిమాసియాలో మరోసారి మొదలైన ఘర్షణలు.. 12 రోజులుగా కొనసాగుతున్నాయి. టెహ్రాన్ సైనిక సామర్థ్యాన్ని దెబ్బతీసేలా దాడులు చేశామని యూఎస్ సెంట్రల్ కమాండ్ తాజాగా ప్రకటించింది.

సౌదీ చమురు ట్యాంకర్లపై దాడి చేశాం: హూతీలు

ఎర్ర సముద్రానికి గేట్‌వే వంటి బాబ్ ఎల్-మాండెబ్ జలసంధిని మూసివేస్తున్నట్లు యెమెన్‌లోని హూతీ తిరుగుబాటుదారులు (ఊనీబీబిస్త్రతి) ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. సౌదీ అరేబియా నౌకల రాకపోకలను అడ్డుకుంటామని వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే సౌదీకి చెందిన రెండు చమురు ట్యాంకర్లపై దాడులు చేశామని తాజాగా ప్రకటించారు.

# యువత గొంతు నొక్కితే బీజేపీ పతనమే

యువత ఆశయాలను జైళ్ల గోడల మధ్య నిర్బంధించలేరన్నారు. రాజ్యాంగాన్ని ఎవరూ ఓడించలేరని.. రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్ చారిత్రక బాధ్యత అని వెల్లడించారు. 'యువత విద్వేషం కాదు... విశ్వాసం కోరుకుంటోంది. అహంకారం కాదు... జవాబుదారీతనం కోరుకుంటోంది. ప్రచారం కాదు... పారదర్శక పాలననే యువత కోరుకుంటోంది' అంటూ వ్యాఖ్యానించారు. 2029 ఎన్నికలు రాజ్యాంగ పరిరక్షణకు కీలకమని ఉత్తమ్ వెల్లడించారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ ప్రత్యామ్నాయం అందిస్తోందన్నారు. తెలంగాణలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన అందిస్తోందని తెలిపారు. ప్రజల గొంతు వినే ప్రభుత్వాలే చరిత్రలో నిలుస్తాయన్నారు. 'భారత్‌ను భయంతో కాదు.. ప్రజాస్వామ్యం, రాజ్యాంగంతో నడపాలి' అని మంత్రి పిలుపునిచ్చారు.

# విద్యార్థులకు మద్దతుగా దేశవ్యాప్తంగా పెల్లుబికుతున్న నిరసనలు

ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నిరసన కార్యక్రమానికి కావాల్సిన అనుమతులు పొందేందుకు, ఏర్పాట్లు చేసేందుకు విద్యార్థి సంఘాలు, యూత్ ఆర్గనైజేషన్లు కలిసి పనిచేయాలని సీజేపీ పిలుపునిచ్చింది. నీట్ పేపర్ లీక్ అంశంలో సీజేపీ డిమాండ్స్ గురించి ఈ నిరసనల్లో బహిరంగంగా చదవాలని పేర్కొంది. బాధితులకు సంఘీభావంగా ఇంక్విలాబ్ జిందాబాద్, భారత్ మాతాకీ జై వంటి నినాదాలు చేయాలని కూడా సూచించింది. నిరసనల్లో కేవలం సానుకూల నినాదాలను మాత్రమే చేయాలని చెప్పింది. ఎలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయొద్దని పేర్కొంది. నిరసనకు అనుమతి ఉన్న ప్రాంతాలకే పరిమితం కావాలని, ట్రాఫిక్‌కు ఆటంకాలు లేకుండా చూసుకోవాలని సూచించింది. రెచ్చగొట్టే చర్యలకు స్పందించవద్దని కూడా పేర్కొంది. ఇక నీట్ ఉదంతంపై విచారణ కోసం కేంద్రం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసేందుకు సిద్ధమైన విషయం తెలిసిందే. ఇదిలావుంటే సీజేపీ ఆందోళనల నేపథ్యంలో న్యూదిల్లీ ట్రేడర్స్ అసోసియేషన్ (ఎన్‌డీటీఏ) కీలక నిర్ణయం తీసుకుంది. ఆందోళనల తీవ్రత అధికంగా ఉన్న కన్నాట్ ప్లేస్ ప్రాంతంలో గురువారం సాయంత్రం 6:30కే దుకాణాలు, కార్యాలయాలు మూసివేయాలని ఆదేశాలు జారీ చేసింది. అందుకు యజమానులు సహకరించాలని కోరింది. ఎన్‌డీటీఏ ఆదేశాలను ఆమ్‌ఆద్మీపార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఎక్స్‌లో పోస్టు చేశారు. సాయంత్రం 6:30 గంటలకే దుకాణాలు మూసేయమనడం, జంతర్‌మంతర్ వద్ద పోలీసులను మోహరించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై కేంద్రం మరోసారి బలప్రయోగం చేయాలని చూస్తోందని ఆరోపించారు.నీట్ పేపర్ లీకేజీలో బాధ్యులపై చర్యలు తీసుకోవడంతోపాటు విద్యావ్యవస్థలో సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా విద్యార్థులు చేపట్టిన ఆందోళనలకు మద్దతుగా నిలవాలని విపక్ష కూటమి నిర్ణయించింది. రాహుల్ గాంధీ నివాసంలో భేటీ అయి చర్చించిన కూటమి నేతలు.. విద్యార్థుల డిమాండ్లకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం గాంధీ స్మృతి కేంద్రం వద్దకు చేరుకొని కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. నీట్ పేపర్ లీక్ కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు నివాళులు అర్పించారు.అంతకుముందు.. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు రాహుల్, ప్రియాంక సహా విపక్ష నేతలు బస్సుల్లో బయలుదేరగా వారిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో రాహుల్ నివాసం వద్ద కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ (ఖీజీష్ట్రబీశ్రీ ఉజీనిటష్త్రతి) మీడియాతో మాట్లాడుతూ.. విద్యార్థులు ఒంటరి వారు కాదని, వాళ్లకు అండగా ఉంటామని ప్రకటించారు. దిల్లీలో సీజేపీ కార్యకర్తలు, విద్యార్థులు ఆందోళన చేస్తున్న జంతర్‌మంతర్ వద్ద ఆంక్షలు కొనసాగుతున్నాయి. ఈ అర్ధరాత్రి వరకు అక్కడ ఒకటిన్నర కి.మీ పరిధిలో ఇంటర్నెట్ సేవలు నిలివేస్తున్నట్లు కేంద్ర హోంశాఖ ప్రకటించింది. జులై 17 నుంచి ఇప్పటివరకు ఇలా ఐదు సార్లు ఆదేశాలు జారీ చేయడం గమనార్హం.

## పేదలకు ఇళ్లు కడితే ఎందుకంత కడుపుమంట?

సొంతింటిని సమకూర్చవలసిన బాధ్యతను విస్మరించి, వారిని నగరానికి దూరంగా నెట్టివేసింది. ఉద్యోగాలు, ఉపాధి, పిల్లల చదువులు, వైద్య సౌకర్యాలకు దూరంగా 30?40 కిలోమీటర్ల దూరంలో కనీస వసతులు కల్పించకుండా అరకొరగా ఇళ్లను నిర్మించి అదే పేదల సంక్షేమమని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రజా ప్రభుత్వం పేదోడు కూడా హైదరాబాద్ నడిబొడ్డులోనే గౌరవంగా జీవించాలనే భావనతో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రభుత్వ భూములను ప్రజల సంక్షేమం కోసం వినియోగిస్తూ పేదలకు శాశ్వత భరోసా కల్పించే చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంటే దానిపైనా బీఆర్‌ఎస్ విషప్రచారం చేస్తోంది.పేదోడు హైదరాబాద్‌లో ఉండకూడదా? నగరంలో అత్యంత విలువైన ప్రభుత్వ భూములలో పేదలకు ఇళ్లు నిర్మించకూడదా? ప్రభుత్వ భూములు కొద్దిమంది కోసం మాత్రమేనా? పేదల కోసం వినియోగిస్తే ఎందుకింత కడుపుమంటని అన్నారు. పేదోడిపై తుపాకి పెట్టి రాజకీయాలు చేయాలనుకోవడం అత్యంత దుర్మార్గం. బీఆర్‌ఎస్ చేస్తున్న విష ప్రచారాలను, కపట నాటకాలను హైదరాబాద్ మహానగర ప్రజలు గమనించాలి, పేదల సంక్షేమాన్ని అడ్డుకునే రాజకీయాలను తిప్పికొట్టాలన్నారు. హైదరాబాద్‌లో సొంత ఇల్లు లేని మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటు ధరలో నాణ్యమైన గృహాలను అందించడమే లక్ష్యం. గతంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇందిరమ్మ టవర్స్ గా మార్చి విక్రయిస్తారన్న ప్రచారం పూర్తిగా అవాస్తవం. ప్రభుత్వం ప్రకటించిన మార్గదర్శకాల ప్రకారమే ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం జరుగుతుందన్నారు.

## షరతులు పెట్టకండి.. రాజకీయాలు చేయకండి

**పేపర్ లీక్‌పై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది**

**విపక్షాలకు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వినతి**

న్యూఢిల్లీ(జనంసాక్షి):నీట్ పేపర్ లీక్‌పై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు పునరుద్ఘాటించారు. "మీరు ఎలాంటి షరతులు పెట్టొద్దని కోరుతున్నాను. రాజకీయాలు చేయొద్దు. ఈరోజే చర్చ ప్రారంభించొచ్చు. మీరు షరతులు పెడుతున్నారంటే.. మీ ఉద్దేశాలు సరిగా లేవని అర్థం" అని ప్రతిపక్షాలను ఉద్దేశించి మంత్రి వ్యాఖ్యలు చేశారు. నీట్ పేపర్ లీక్ చలో పార్లమెంట్ ఆందోళనల్లో పాల్గొన్న వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకునేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. నిరసనల్లో పాల్గొన్న వారిని గుర్తించి, వారి పాస్‌పోర్టులు కూడా రద్దు చేయాలని దిల్లీ పోలీసులు నిర్ణయించినట్లు సమాచారం. ఈ మేరకు పోలీసు వర్గాలు వెల్లడించాయి. దీనిపై ఇప్పటికే కార్యాచరణ కూడా ప్రారంభమైనట్లు తెలుస్తోంది.నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో కాక్రోచ్ జనతాపార్టీ (సీజేపీ) చేపట్టిన చలో పార్లమెంట్ సోమవారం ఉద్రిక్తంగా మారిన సంగతి తెలిసిందే. పార్లమెంట్ పరిసరాల్లో ఏర్పాటు చేసిన బారికేడ్లను ధ్వంసం చేసి, విద్యార్థులు, సీజేపీ నేతలు నిరసనలు చేపట్టారు. పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు బాష్పవాయు గోళాలు ప్రయోగించడంతోపాటు, లాఠీ ఛార్జ్ చేశారు. ఈ క్రమంలో పలువురు ఆందోళనకారులు, పోలీసులకు కూడా గాయాలయ్యాయి.ఆందోళనపై పోలీసుల తీరును నిరసిస్తూ శుక్రవారం దేశవ్యాప్తంగా శాంతియుత నిరసనలు చేపడుతున్నట్లు సీజేపీ ప్రకటించింది. ఈ నిరసనకు మద్దతివ్వాలని విద్యార్థి సంఘాలను కోరింది. ఈ క్రమంలో విద్యా సంస్థలు మూతపడనున్నాయి.

## పేపర్‌లీక్‌పై విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తాం

న్యూఢిల్లీ(జనంసాక్షి):నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ దిల్లీలోని జంతరమంతర్ వద్ద మొదలైన నిరసనలు దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నాయి. కాక్రోచ్ జనతా పార్టీ మొదలుపెట్టిన ఈ ఆందోళనలకు విపక్షాలు కూడా తోడయ్యాయి. ఈ లీక్ అంశంపైనే పార్లమెంట్‌లో వాయిదాలపర్వం కొనసాగుతోంది. ఈ పరిణామాల వేళ ప్రధాని నరేంద్రమోదీ గురువారం కీలక ప్రకటన చేశారు. పరీక్ష పత్రాల లీకేజీ బాధ్యులకు త్వరితగతిన కఠినశిక్ష పడేలా చూసేందుకు ప్రభుత్వం ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేస్తుందని ప్రకటించారు.యువత భవిష్యత్తుకు హాని చేయాలని చూసేవారిని ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టబోమని, వారి సంక్షేమమే తమ ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యమని వెల్లడించారు. "విద్యార్థుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు మా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఇది కొనసాగింపు. పేపర్ లీక్ బాధ్యులకు శిక్ష పడేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ఇందుకోసం అధికారులు అవసరమైన చర్యలు తీసుకుంటారు" అని ఎక్స్ వేదికగా మోదీ వెల్లడించారు.

## ధర్మేంద్ర రాజీనామా చేయాల్సిందే..

న్యూఢిల్లీ,జూలై23(జనంసాక్షి): పార్లమెంటులో ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. గురువారం ప్రారంభమైన రెండు నిముషాలకే ఉభయసభలు తొలుత 12గంటలకు వాయిదా పడ్డాయి. అనంతరం సమావేశమైనా సభలు సాగలేదు. ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేస్తేనే చర్చకు అంగీకరిస్తామని రాజ్యసభలో మల్లికార్జున ఖర్గే తెగేసి చెప్పారు. నీట్ పేపర్ లీక్ అంశంపై ప్రతిపక్షాల నిరసనల నడుమ లోక్‌సభ నేటికి వాయిదా పడింది. రాజ్యసభను కూడా మధ్యాహ్నం మూడు గంటల వరకూ వాయిదా పడింది. నీట్ పేపర్ లీక్ ఉదంతానికి ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని లోక్‌సభ ప్రారంభం కాగానే ప్రతిపక్షాలు డిమాండ్ చేయడం ప్రారంభించాయి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని పట్టుబట్టాయి. ఈ క్రమంలో సభ పలుమార్లు వాయిదా పడింది. పేపర్ లీక్ జరిగినట్టు ప్రభుత్వం అంగీకరిస్తే వెంటనే విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ డిమాండ్ చేశారు.రూల్ 267 కింద చర్చ చేపట్టాలని కోరుతుంటే ప్రభుత్వం అంగీకరించట్లేదని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీని కేంద్రం అవమానించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తరువాతే తాము ఏ చర్చకైనా సిద్ధమని స్పష్టం చేశారు. ప్రతిపక్షాల తీరుపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మండిపడ్డారు. నీట్‌పై చర్చ నుంచి తప్పించుకోవాలని ప్రతిపక్షాలు చూస్తున్నాయని ఆరోపించారు. చర్చ ముందు షరతులు పెట్టడం భావ్యం కాదని అన్నారు. ఈ అంశంపై తన వాదన వినిపించే హక్కు ప్రభుత్వానికి కూడా ఉంటుందని అన్నారు. ఇదిలావుంటే పార్లమెంట్ వెలుపల విపక్షాలు, బిజెపిలు పరస్పర ఆందోళనలకు దిగారు. నిరసలనతో హోరెత్తించారు. కాంగ్రెస్ ఇండియా కూటమి ఒకవైపు, ఎన్‌డిఎ నేతలు మరో వైపు నిలబడి నినాదాలు చేశారు.

## గ్లోబరీనాతో నాకు సంబంధంలేదు

ఇప్పటికే పరువు నష్టం నోటీసులు పంపానని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గురువారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన ముఖ్యమంత్రి.. ఒక్కసారి కూడా ప్రధాని నరేంద్ర మోదీ పేరును ప్రస్తావించలేదని విమర్శించారు. లోక్‌భవన్ ముందు ధర్నా చేయాల్సింది పోయి కొడంగల్‌లో ధర్నా చేయడం రాజకీయ నాటకం మాత్రమే అని విమర్శించారు. 'గ్లోబరీనా నిజంగానే నా బినామీ సంస్థ అయితే, అదే సంస్థతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఒప్పందాలు చేసుకుంది? మీ ప్రభుత్వమే ఆ సంస్థతో ఒప్పందాలు చేసుకుని, ఇప్పుడు అది నా బినామీ సంస్థ అని చెప్పడం ఎంతవరకు సమంజసం?' అని కేటీఆర్ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి పగలు కాంగ్రెస్‌తో.. రాత్రి బీజేపీతో ఉంటారంటూ దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్‌కు ఒక మూట ఇస్తే, బీజేపీకి రెండు మూటలు పంపుతున్నారని ఆరోపించారు. నేను సీఐడీ విచారణకు సిద్ధం.. రేవంత్ రెడ్డి కుటుంబ అవినీతి అంశంలో సిట్, సీఐడీ విచారణకు సిద్ధమా' అంటే మాజీ మంత్రి సవాల్ విసిరారు. మోదీ పేరును ప్రస్తావించడానికి కూడా సీఎం భయపడుతున్నారన్నారు. ఓ వైపు పాత కేసుల భయం, మరోవైపు అమృత్ పథకం, ఇతర కాంట్రాక్టుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వంతో రాజీ రాజకీయాలు చేస్తున్నారన్నారు. గ్లోబరీనా సంస్థపై రేవంత్ రెడ్డి చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమన్నారు. రుజువు చేయాలని.. లేదంటే క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు

## డీజీపీ కార్యాలయంలో కానిస్టేబుల్ ఆత్మహత్య

ఘటనా స్థలిలో కానిస్టేబుల్ రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 'ఏదైనా తప్పు చేసి ఉంటే నేను మాత్రమే చేశాను. నా భార్య, పిల్లలు ఏ తప్పూ చేయలేదు. నా భార్య, పిల్లల్ని ఏమీ అనొద్దు. వాళ్లు మంచివాళ్లు. నేను చనిపోయిన తర్వాత ఎవరైనా నా భార్యను పిల్లల్ని వేధించినా, హింసించినా దెయ్యమై వదిలిపెట్టను. ఎందుకంటే వాళ్లు అంటే నాకు చాలా ఇష్టం. అమ్మని, అక్కని జాగ్రత్తగా చూసుకో' అంటూ కొడుకుకు సూచిస్తూ డైరీలో స్వామి సూసైడ్ నోట్ రాశారు.



కానిస్టేబుల్ బలవన్మరణంపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. స్వామి ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. కానిస్టేబుల్ మృతదేహాన్ని డీజీపీ కార్యాలయం నుంచి ఉస్మానియా మార్చురీకి తరలించారు. క్లూస్ టీం, ఫోరెన్సిక్ అధికారులు అక్కడకు చేరుకుని ఆధారాలను సేకరించే పనిలో ఉన్నారు. కానిస్టేబుల్ స్వామి రాసిన సూసైడ్ నోట్‌పై అధికారులు దర్యాప్తు చేపట్టారు. అయితే స్వామి సూసైడ్‌కు బెట్టింగ్ కారణమని ఉన్నతాధికారులు అనుమానిస్తున్నారు. విషయం తెలిసిన వెంటనే స్వామి కుటుంబసభ్యులు డీజీపీ కార్యాలయానికి చేరుకున్నారు. కానిస్టేబుల్ మృతితో భార్య, పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# గ్లోబరీనా కేటీఆర్ బినామీ సంస్థ

కొడతారని మండిపడ్డారు. మేడిగడ్డ కట్టింది, కూల్చింది బీఆర్‌ఎస్ వాళ్లే అని వ్యాఖ్యానించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ అయిపోయే వరకూ ఎమ్మెల్యేలను గ్రామాల్లోనే ఉండమని చెప్పానని ముఖ్యమంత్రి అన్నారు. సర్ నాయకులకు సంబంధించింది కాదని, ప్రజలకు సంబంధించిందని స్పష్టం చేశారు. 'తెలిసీ తెలియక నాకు రెండు ఓట్లు ఉన్నాయని అంటున్నారు. కలెక్టర్ అనుమతి తీసుకొని నా గ్రామంలో ఉన్న ఓటును కొడంగల్‌కు మార్చుకున్నాను. గతంలో కొడంగల్ ప్రాంతం కర్ణాటకలోని జిల్లాలో ఉండేది. భాషా ప్రయుక్త రాష్ట్రాలు చేసినప్పుడు కొడంగల్ పాలమూరులోకి వచ్చిందని చెప్పారు. బీజేపీ కుట్రపూరితంగా ఓట్లను తొలగించే అవకాశముందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. గ్రామీణ ప్రాంతంలో అమాయకుల ఓట్లు పోయే అవకాశముందన్నారు. సర్ ఉద్దేశం ప్రక్షాళన అని.. కుట్ర పూరితంగా సర్‌ను వాడుతున్నారని ఆరోపించారు. సర్ పట్ల జాగ్రత్తగా ఉండాల్సిందే అని చెప్పుకొచ్చారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఓట్లు పోతే.. కాంగ్రెస్ ఓట్లు పోయినట్టే అని అన్నారు. అవగాహన లేకపోవడం, సరైన సమయంలో స్పందించకపోవడం వల్ల ఓట్లు పోయే అవకాశముందన్నారు. 'ఓటుహక్కు లేకపోతే పథకాలు పోతాయి.. ఓటుహక్కు లేకపోతే ఆధార్ పోతుంది. ఓటుహక్కు లేకపోతే గుర్తింపే ఉండదు... ఓటుహక్కు లేకపోతే సంక్షేమం రాదు' అని అన్నారు.

బీజేపీలో అంతర్గత కలహాలు ఉన్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. బీజేపీ నాయకులకు ఒకరంటే ఒకరికి పడదన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఓట్లు ఎక్కడుంటాయో బీజేపీకి తెలుసని వెల్లడించారు. చిన్నచిన్న కారణాలతో ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లకు 5 లక్షలు ఇవ్వాలని డిసైడ్ అయిందని చెప్పారు. బీఆర్‌ఎస్ నేతలు.. బ్రోకర్లకు అమ్ముకొని దళారీ వ్యవస్థ తెచ్చారని మండిపడ్డారు. 'మేం ఏం చేస్తున్నామో అదే చెప్తున్నాం' అని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 70 శాతం ఎస్ఐఆర్ పూర్తయిందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రక్షాళన పేరుతో ఓట్లు తొలగించే అవకాశం ఉందని.. అలా జరగకుండా ఉండేందుకు బీఎల్‌వోలను పెట్టామన్నారు. ఓట్లు లేకుంటే ప్రభుత్వ పథకాలు ఎలా వస్తాయని సీఎం ప్రశ్నించారు. గతంలో జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉన్న ఆంధ్ర ఓట్లన్నీ తొలగించారు. కాంగ్రెస్ పార్టీ కోర్టుకు వెళితే.. జీహెచ్‌ఎంసీ కమిషనర్‌పై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. హైడ్రా బాగా పనిచేస్తోంది.. చాలా ఆస్తులు స్వాధీనం చేసుకుంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారు. ఆ ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతికి పాల్పడినందుకే హరీశ్‌రావుకు కొన్నాళ్లు మంత్రి పదవి ఇవ్వకుండా కేసీఆర్ పక్కన పెట్టారు. గత ప్రభుత్వంలో ఇంటర్ పేపర్ల మూల్యాంకనంలో జరిగిన తప్పిదాలతో 27 మంది విద్యార్థులు బలయ్యారు. గ్లోబరీనా సంస్థ విషయంలో కేటీఆర్ నిజాయతీ నిరూపించుకోవాలన్నారు. విద్యార్థుల మృతికి కారణమైన ఆయన క్షమాపణ చెప్పాలి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు బీఆర్‌ఎస్ ఎందుకు డిమాండ్ చేయలేదని అన్నారు. పేదలకు ఇచ్చే ఇళ్లను బీఆర్‌ఎస్ నేతలు దళారులకు అమ్ముకున్నారు. జన్వాడ ఫాంహౌస్ భూములపై కేటీఆర్ విచారణ కోరాలి. మేం అధికారంలోకి వచ్చాకే ఇందిరాపార్కు వద్ద ధర్నా చౌక్‌ను తిరిగి ఓపెన్ చేశాం. నాడు వాళ్లు మూసిన ధర్నా చౌక్‌లోనే కేటీఆర్ ధర్నా చేస్తామంటున్నారని రేవంత్ వ్యాఖ్యానించారు.

## తెలంగాణ శాసనసభకు ఆధునిక హంగులు

**హైదరాబాద్,జూలై23(జనంసాక్షి):** తెలంగాణ శాసనసభ భవనంలో కొనసాగుతున్న మరమ్మతు పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం పరిశీలించారు. ప్రజాస్వామ్యానికి ప్రతీకగా నిలిచిన శాసనసభ ప్రాంగణాన్ని మరింత మెరుగైన మౌలిక సదుపాయాలతో తీర్చిదిద్దే లక్ష్యంతో చేపట్టిన పనుల పురోగతిని ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అద్దంకి దయాకర్, బల్మూర్ వెంకట్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, జైవీర్ రెడ్డి తదితరులు ముఖ్యమంత్రితో కలిసి మరమ్మతు పనులను పరిశీలించారు. పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని, నిర్దేశించిన గడువులోగా అన్ని పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. శాసనసభకు వచ్చే ప్రజాప్రతినిధులు, అధికారులు, సందర్శకులకు మెరుగైన వసతులు కల్పించేలా అన్ని ఏర్పాట్లు ఉండాలని ఆదేశించారు. సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజాస్వామ్యానికి ప్రతీక అయిన తెలంగాణ శాసనసభ ప్రాంగణాన్ని మరింత మెరుగైన మౌలిక సదుపాయాలతో తీర్చిదిద్దేందుకు చేపట్టిన పనులు వేగంగా, నాణ్యతతో పూర్తయ్యేలా అధికారులను ఆదేశించామని తెలిపారు. శాసనసభ భవనం ఆధునిక అవసరాలకు అనుగుణంగా ఉండేలా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని ఆయన పేర్కొన్నారు.

## యూనిఫామ్‌ల పంపిణీలో అలసత్వం వద్దు

**నిర్లక్ష్యంవహిస్తే కఠిన చర్యలు: సీఎం రేవంత్**

హైదరాబాద్(జనంసాక్షి):ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే యూనిఫామ్‌ల నాణ్యతలో రాజీపడబోమని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. పంపిణీలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థుల యూనిఫామ్‌లపై అధికారులతో సీఎం సమీక్షించారు. "విద్యార్థుల యూనిఫామ్‌లు త్వరగా సరఫరా చేసేలా సంస్థలపై ఒత్తిడి తేవాలి. ఆగస్ట్ 15 నాటికి విద్యార్థులకు వాటిని అందించాలి. ఆ తర్వాత ప్రతి విద్యార్థి నుంచి అభిప్రాయాన్ని సేకరించాలి. ఆ అభిప్రాయాల ఆధారంగా వచ్చే ఏడాది యూనిఫామ్‌లు పంపిణీ చేయాలి. గత ప్రభుత్వ హయాంలో ఈ విషయంలో అడ్డగోలుగా వ్యవహరించారు. పేద పిల్లల కోసం పనిచేస్తున్నామన్న దృష్టితో అధికారులు పనిచేయాలి. వచ్చే ఏడాది జూన్ 2 నాటికే విద్యార్థులకు యూనిఫామ్‌లు అందేలా కార్యాచరణ రూపొందించాలి" అని రేవంత్ ఆదేశించారు.

## భగ్గుమన్న చమురు ధరలు..

**మళ్లీ 100 డాలర్ల దిశగా క్రూడ్**

వాషింగ్టన్(జనంసాక్షి):పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు నానాటికీ తీవ్రమవుతుండటంతో అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు మళ్లీ ఆకాశన్నంటుతున్నాయి. బ్రెంట్ క్రూడ్ ఆరు వారాల గరిష్ఠానికి చేరింది. గురువారం ఉదయం బ్యారెల్ ధర (హ్రితిశ్రీ ఖతీతిఇవబ) 1.5శాతానికి పైగా పెరిగి 95 డాలర్లు దాటి ట్రేడ్ అవుతోంది. ఇక, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియెట్ క్రూడ్ బ్యారెల్ ధర 88 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఈ ఒక్క నెలలో బ్రెంట్ క్రూడ్ ధర ఇప్పటివరకు దాదాపు 30శాతం పెరగడం గమనార్హం. ఉద్రిక్తతలు ఇలాగే కొనసాగితే చమురు మంటలు మరింత పెరుగుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.అమెరికా-ఇరాన్ పరస్పర దాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఇప్పట్లో తగ్గేలా కన్పించట్లేదు. ఈ పరిణామాలతో హర్మూజ్‌లో నౌకల రవాణా మళ్లీ నెమ్మదించింది. మరోవైపు, ఎర్ర సముద్రంలో సౌదీ అరేబియాకు చెందిన రెండు చమురు ట్యాకర్లపై హూతీలు దాడులు చేశారు. దీంతో అంతర్జాతీయంగా చమురు సరఫరాకు అంతరాయం వాటిల్లుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.ఈ చమురు మంటలు, అంతర్జాతీయ పరిణామాలతో దేశీయంగా స్టాక్ మార్కెట్లు గురువారం కూడా నష్టాల్లో కొనసాగుతున్నాయి. ఉదయం 9.40 గంటల సమయంలో సెన్సెక్స్ 300 పాయింట్లు తగ్గి 76,454 వద్ద ట్రేడ్ అవుతోంది. నిఫ్టీ 83 పాయింట్ల నష్టంతో 23,913 వద్ద కొనసాగుతోంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 5 పైసలు పెరిగి 96.48గా ట్రేడ్ అవుతోంది.

## హర్మూజ్‌పై పట్టు సాధిస్తాం

చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. సైనిక చర్య చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. "వాణిజ్య నౌకలపై దాడి చేసినందుకు గానూ ఏడాది క్రితం హూతీలకు అమెరికా గట్టిగా బుద్ధి చెప్పింది. అప్పటి నుంచి వారు నియంత్రణలోనే ఉన్నారు. దురదృష్టవశాత్తు ఇప్పుడు మళ్లీ దాడులు మొదలుపెట్టారు. నిన్న రాత్రి రెండు సౌదీ అరేబియా నౌకలపై కాల్పులు జరిపారు. మరోసారి ఇదే తరహా ఘటనలు పునరావృతమైతే.. అందుకు ఇరాన్ బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఎందుకంటే హూతీలు ఇరాన్ ప్రతినిధులే" అని ట్రంప్ పేర్కొన్నారు. ఈ నెల 12న అమెరికా బలగాలు ఇరాన్‌పై దాడి చేసినందుకు ప్రతీకారంగా చమురు నౌకలను దెబ్బతీసినట్లు హూతీలు ప్రకటించిన సంగతి తెలిసిందే.

## పంతులమ్మగా మారిన కలెక్టర్ కె.హరిత



కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జులై 23(జనంసాక్షి ): జిల్లా కలెక్టర్ కె. హరిత గురువారం ఆసిఫాబాద్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీ సందర్భంగా కలెక్టర్ కాసేపు పంతులమ్మగా మారి విద్యార్థులకు స్వయంగా పాఠాలు బోధించారు. విద్యార్థులతో ఆప్యాయంగా మమేకమైన కలెక్టర్, వారితో పలు ప్రశ్నలు అడిగించి అభ్యాస సామర్థ్యాలను పరిశీలించారు. ఈ క్రమంలో ఓ విద్యార్థినిని తొమ్మిదో ఎక్కం చెప్పమనగా, ఆ చిన్నారి గడగడా చదివి వినిపించడంతో కలెక్టర్ ఎంతో సంతోషించి, ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. సరైన సమాధానాలు చెప్పిన విద్యార్థులకు చాక్లెట్లు అందిస్తూ వారిలో మరింత ఉత్సాహాన్ని నింపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మౌలిక సదుపాయాలు, పరిశుభ్రత,పాఠశాల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్, విద్యార్థుల ఆరోగ్య దృష్ట్యా పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. తాగునీటి సౌకర్యం, తరగతుల నిర్వహణను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత, పాఠశాల వంటశాలను తనిఖీ చేసి, నిర్దేశిత మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారాన్ని అందించాలని వంట నిర్వాహకులకు స్పష్టమైన సూచనలు చేశారు. ఉపాధ్యాయులకు ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రాథమిక విద్యా నైపుణ్యాలు మెరుగుపడేలా ఉపాధ్యాయులు మరింత శ్రద్ధతో బోధించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం తగిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

## సైబర్ మోసాల నియంత్రణకు ప్రజల్లో అవగాహనే కీలకం

- డీజీపీ సీవీ ఆనంద్



వనపర్తి,బ్యూరో జూలై 23 (జనంసాక్షి) : రాష్ట్రంలో పెరుగుతున్న సైబర్ నేరాలను సమర్థవంతంగా అరికట్టేందుకు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్,పేర్కొన్నారు. రాష్ట్రంలోని పోలీసు కమిషనర్లు, జిల్లా ఎస్పీలు, క్షేత్రస్థాయి అధికారులతో గురువారం నిర్వహించిన దృశ్య సమీక్షా సమావేశంలో ఆయన సైబర్ నేరాల నియంత్రణపై కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో పెట్టుబడుల పేరుతో మోసాలు, డిజిటల్ అరెస్ట్, ట్రేడింగ్ యాప్‌లు, పార్ట్‌టైమ్ ఉద్యోగాల మోసాలు, ఆన్‌లైన్ లోన్ యాప్‌లు, సోషల్ మీడియా, ఫేక్ వెబ్‌సైట్లు, క్యూఆర్ కోడ్‌లు, ఓటీపీలు, యూపీఐ, క్రెడిట్ కార్డు మోసాలు వంటి కొత్త తరహా సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి పోలీసు అధికారి అప్రమత్తంగా వ్యవహరించాలని డీజీపీ సూచించారు. సైబర్ మోసానికి గురైన బాధితులు వెంటనే 1930 హెల్ప్‌లైన్ లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ఎం సి ఆర్ పి ద్వారా ఫిర్యాదు చేస్తే, మోసపోయిన నగదును సంబంధిత బ్యాంకు ఖాతాల్లో త్వరగా ఫ్రీజ్ చేసి బాధితులకు తిరిగి అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి నిమిషం విలువైనదని, తక్షణ స్పందనతో బాధితుల డబ్బును కాపాడే అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. ప్రతి సైబర్ కేసును అత్యంత ప్రాధాన్యతతో దర్యాప్తు చేసి, నిందితుల బ్యాంకు ఖాతాలు, మొబైల్ నంబర్లు, డిజిటల్ లావాదేవీలు, ఐపీ అడ్రస్‌లు వంటి సాంకేతిక ఆధారాలను విశ్లేషించి నిందితులను గుర్తించాలని సూచించారు. ప్రజలు అపరిచిత వ్యక్తులకు ఓటీపీలు, పాస్‌వర్డులు, బ్యాంకు వివరాలు, యూపీఐ పిన్‌లు ఇవ్వవద్దని, అనుమానాస్పద లింకులు, యాప్‌లు, పెట్టుబడి ఆఫర్లు, డిజిటల్ అరెస్ట్ పేరుతో వచ్చే కాల్స్‌ను నమ్మవద్దని హెచ్చరించారు. ఈ సమావేశంలో వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయం నుంచి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, పాల్గొని జిల్లాలో నమోదైన సైబర్ నేరాల వివరాలను డీజీపీకి వివరించారు. సమావేశంలో డీసీఆర్‌బీ డీఎస్పీ బాలాజీ నాయక్, సైబర్ క్రైమ్ సీఐ శ్రీను నాయక్, ఎస్సై రవి ప్రకాష్, స్పెషల్ బ్రాంచ్ అధికారులు, డీసీఆర్‌బీ సిబ్బంది, ఐటీ కోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంబులెన్స్ ఏర్పాటు చేయాలని శవ పాడేతో వినూత్న నిరసన!



కుబీర్, జులై 23, (జనంసాక్షి): మారుమూల సరిహద్దు ప్రాంతమైన కుబీర్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెంటనే అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం మండల కేంద్రంలోని వివేకానంద చౌరస్తాలో శవ పాడేతో వినూత్న నిరసన చేపట్టారు. తెలంగాణ ఉద్యమ కారుడు కొత్తూరు శంకర్ శవ పాడే ముందు బైఠాయించి, బోరున విలపిస్తూ ప్రభుత్వ నిర్లక్ష్యంపై తన నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ... నిర్మల్ జిల్లాలోనే అతిపెద్ద మండలాల్లో ఒకటైన కుబీర్‌లో అంబులెన్స్ లేకపోవడం ఇక్కడి గిరిజనులు, పేద ప్రజల పట్ల పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. గతంలో కుబీర్ మండలానికి కేటాయించిన అంబులెన్స్ వాహనం వేరే ప్రాంతానికి తరలిపోవడంతో, ఇక్కడి ప్రజల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో లేదా రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు 108 కి ఫోన్ చేస్తే పక్క మండలాల నుండి రావడానికి గంటకు పైగా సమయం పడుతోందని, ఈ లోపు రోగుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని వాపోయారు. వైద్యం కోసం దాదాపు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న బైంసా ఆసుపత్రికి వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, మారుమూల గిరిజన గ్రామాల్లో ప్రైవేటు వాహనాలు కూడా సకాలంలో దొరకడం లేదని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి కుబీర్ మండలానికి ప్రత్యేకంగా అంబులెన్స్ వాహనాన్ని కేటాయించి, ఈ ప్రాంత ప్రజల ప్రాణాలను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ వినూత్న నిరసన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## యూకేలో కేటీఆర్ జన్మదిన వేడుకలు

లెస్టర్ పట్టణంలో రక్తదానం, లండన్‌లో సేవా కార్యక్రమాలు




లండన్ (జనంసాక్షి) : మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కే.తారక రామారావు (కేటీఆర్) గారి 50వ జన్మదినాన్ని పురస్కరించుకుని యూకే వ్యాప్తంగా ఎన్నారై బీఆర్ఎస్ యూకే ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాల, జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు ఎన్నారై బీఆర్ఎస్ యూకే అధ్యక్షుడు నవీన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఇలాంటి పుట్టినరోజులను మరెన్నో జరుపుకోవాలని, తెలంగాణ ప్రజలకు సమర్థ నాయకత్వం అందిస్తూ మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. భగవంతుడు వారికి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, ప్రజా సేవలో మరింత శక్తి, విజయాలను ప్రసాదించాలని కోరుకుంటూ, యూకేలోని ఎన్నారైల తరఫున కేటీఆర్ గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్నారై బీఆర్ఎస్ యూకే లెస్టర్ పట్టణ ఇంచార్జ్ సాకేత్ రావు కాచవరపు ఆధ్వర్యంలో, మాజీ అధ్యక్షుడు అశోక్ గౌడ్ దూసరి ముఖ్య అతిథిగా పాల్గొని, “గిఫ్ట్ ఏ స్మైల్” కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు ఉపాధ్యక్షుడు రవి రేతినేని తెలిపారు. అదేవిధంగా లండన్‌లో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు, ఎన్నారై బీఆర్ఎస్ యూకే కార్యవర్గం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కేటీఆర్ గారి 50వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారమని ఉపాధ్యక్షుడు హరి గౌడ్ నవపేట్ తెలిపారు. సేవా కార్యక్రమాలకు ఎల్లప్పుడూ ప్రాధాన్యతనిచ్చే కేటీఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో రానున్న రోజుల్లో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలను చేపడతామని ఉపాధ్యక్షుడు సత్య చిలుముల తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ గారి జన్మదినాన్ని సేవా కార్యక్రమాలు, వేడుకల ద్వారా విజయవంతంగా నిర్వహించిన యూకే వ్యాప్తంగా ఉన్న పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, సభ్యులందరికీ ఎన్నారై బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై బీఆర్ఎస్ యూకే అధ్యక్షులు నవీన్ రెడ్డి, ఉపాధ్యక్షులు హరి గౌడ్ నవాపేట్, సత్యమూర్తి చిలుముల, రవి రేటినేని, సతీష్ రెడ్డి గొట్టిముక్కుల, మాజీ అధ్యక్షుడు అశోక్ గౌడ్ దూసరి, జనరల్ సెక్రటరీ రత్నాకర్ కడుదుల, కార్యదర్శి - ఐటీ, మీడియా ఓ పీఆర్ రవి ప్రదీప్ పులుసు, అడ్వైసరీ బోర్డు వైస్ చైర్మన్ శ్రీకాంత్ జెల్ల ఓ గణేష్ కుప్పాల, అడ్వైజరీ బోర్డు సభ్యులు ప్రవీణ్ కుమార్ వీర, గణేష్ పాస్తం, కోశాధికారి సురేష్ బుడగం, సెక్రటరీ మల్లా రెడ్డి, లండన్ ఇంచార్జ్ సత్యపాల్ రెడ్డి పింగలి, కార్యదర్శి - యూత్ వింగ్ ప్రశాంత్ మామిడాల, మెంబర్షిప్ కో ఆర్డినేటర్: అంజన్ రావు, యూత్ వింగ్ సెక్రటరీ పవన్ కుమార్ గౌడ్, నర్సింగ రావు, యూత్ వింగ్ కో ఆర్డినేటర్ అమరేశ్వరి బోయిని, మీడియా కో ఆర్డినేటర్ సాయి కిరణ్ రావు పేరాల, జనార్ధన్ దమ్మక్కపల్లి, హరికృష్ణ మామిళ్ల, అబ్దుల్ కుదుస్, లెస్టర్ ఇంచార్జ్ సాకేత్ కాచవరపు టాక్ సంస్థ సభ్యులు పవిత్ర రెడ్డి, సుప్రజ పులుసు, క్రాంతి రేటినేని వున్నారు.

## విద్యార్థులతో కాంగ్రెస్, ఆప్‌లు రాజకీయం

పార్లమెంట్‌లో చర్చకు ప్రభుత్వం సిద్ధం

బిజెపి ఎంపి లక్ష్మణ్ వెల్లడి

న్యూఢిల్లీ, జూలై23 (జనంసాక్షి) : పార్లమెంట్‌లో నీట్ ప్రశ్నాపత్రం లీక్ సహా అన్ని అంశాలపై చర్చించేందుకు కేంద్రప్రభుత్వం సిద్ధంగా ఉందని బీజేపీ రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్ స్పష్టం చేశారు. గురువారం న్యూఢిల్లీలో ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ సజావుగా జరగనివ్వకుండా ప్రజాధనాన్ని దుర్వినియోగం అయ్యేలా వ్యవహరిస్తున్నారంటూ ఎంపీ రాహుల్‌గాంధీతోపాటు కాంగ్రెస్ పార్టీపై ఆయన మండిపడ్డారు. నీట్ పేపర్ లీక్ కేసులో ఇప్పటికే 17 మందిని అరెస్ట్ చేశారని గుర్తు చేశారు. విద్యార్థుల జీవితంతో చెలగాటం ఆడిన వారిని ఎవరిని ఉపేక్షించమని ఎంపీ లక్ష్మణ్ పేర్కొన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా నిందితులను కఠినంగా శిక్షిస్తామని అన్నారు. పేపర్ లీకు తరహా ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని కేంద్రం స్పష్టం చేసినా.. రాద్ధాంతం చేస్తున్నారంటూ ప్రతిపక్ష పార్టీలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పూర్తి బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారంటూ లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై నిప్పులు చెరిగారు. విద్యార్థులతో కాంగ్రెస్, ఆప్‌లు రాజకీయం చేస్తున్నాయని ఎంపీ లక్ష్మణ్ ఆరోపించారు.

## కాంగ్రెస్‌ది చిత్తశుద్ధి లేని పోరాటం

- ప్రధాని నివాసం ముందు ధర్నా ఓ నాటకం
- సోనమ్ వాంగ్‌చుక్ భార్య విమర్శలు

న్యూఢిల్లీ, జూలై23 (జనంసాక్షి) : న్యూఢిల్లీలోని ప్రధాని నివాసం ముందు ఈనెల 21న నీట్ పేపర్ లీక్ అంశంపై కాంగ్రెస్ నిరసన కార్యక్రమం చేపట్టడాన్ని సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ భార్య గీతాంజలి విమర్శించారు. కాంగ్రెస్ నిరసనల్లో చిత్తశుద్ధి లోపించిందని అన్నారు. జంతర్‌మంతర్ వద్ద విద్యార్థులు నిరసనకు దిగినప్పుడే కాంగ్రెస్ కూడా వచ్చి నిరసనల్లో పాలుపంచుకుని ఉండాల్సిందని వ్యాఖ్యానించారు. పేపర్ లీక్ ఉదంతంపై సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ జంతర్‌మంతర్ వద్ద తొలుత ఆమరణ దీక్ష ప్రారంభించిన విషయం తెలిసిందే. ఆ తరువాత పోలీసులు ఆయనను ఆసుపత్రికి తరలించడంతో ప్రస్తుతం అక్కడే దీక్షను కొనసాగిస్తున్నారు. నిరసనల్లో రాజకీయ పార్టీలు కూడా రంగ ప్రవేశం చేయడంపై వాంగ్‌చుక్ భార్య పలు కీలక వ్యాఖ్యలు చేశారు. వాంగ్‌చుక్ పేరుప్రఖ్యాతులను తమకు అనుకూలంగా వాడుకునేందుకు రాజకీయ పక్షాలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. అయితే, ప్రజలను మభ్యపెట్టడం ఇక సాధ్యం కాదని అన్నారు. చిత్తశుద్ధి లేని వారిని యువతే పంపించేస్తారని అన్నారు. కాక్రోచ్ జనతా పార్టీ సారథ్యంలో నిరసనలు రాజకీయ పక్షాలకు గట్టి సందేశం పంపించాయని ఆమె అన్నారు. తమ దృష్టిలో పార్లమెంటే అత్యున్నత వ్యవస్థ అని, తమకు ఇక ప్రతిపక్షం, పాలకపక్షం లేదని వ్యాఖ్యానించారు. పార్లమెంటే ఈ అంశంపై దృష్టి సారించాలని కోరుతున్నామని అన్నారు. రాజకీయ లక్ష్యాలు లేని వారు తమతో కలిసి రావచ్చని అన్నారు. నిజాయతీ, స్వచ్ఛత పునాదిగా ఈ ఉద్యమం ఆరంభమైందని గీతాంజలి చెప్పారు. సొంత ఎజెండాలతో వచ్చే వారు తమంతట తామే పక్కకు తప్పుకోవాల్సి వస్తుందని అన్నారు. పార్లమెంటు వరకూ విద్యార్థులు చేపట్టిన మార్చ్‌ను కేంద్రం అడ్డుకోవడాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ, పార్టీ ఇతర నేతలు జులై 21న ప్రధాని నివాసం ముందు నిరసనకు దిగిన విషయం తెలిసిందే.

## దేశ సమస్యలపై ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి

- ఎప్పటికప్పుడు స్పందించడం అలవర్చుకోవాలి
- దేశం కోసం సోనం వాంగ్‌చుక్ పోరాటం అభినందనీయం
- ఎక్స్ వేదికగా నటి మంచు లక్ష్మి పోస్ట్




హైదరాబాద్, జులై 23 (జనంసాక్షి) : దేశంలో జరుగుతున్న సామాజిక, ప్రజా సమస్యలపై ప్రతి పౌరుడు బాధ్యతగా స్పందించాలని ప్రముఖ నటి, నిర్మాత మంచు లక్ష్మి పిలుపునిచ్చారు. మనకెందుకులే అనే నిర్లక్ష్య ధోరణిని విడిచిపెట్టి, సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై ప్రతి ఒక్కరూ తమ స్వరం వినిపించాలని ఆమె కోరారు. తాజాగా రాజ్యాంగ హక్కుల కోసం ఆందోళన చేస్తున్న ప్రముఖ పర్యావరణవేత్త, సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్కు మద్దతుగా మంచు లక్ష్మి సోషల్ మీడియాలో ఓ వీడియోను విడుదల చేశారు. ఆ వీడియోలో దేశంలో జరుగుతున్న పరిణామాలపై తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ, ప్రజల్లో సామాజిక బాధ్యత పెరగాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. దేశంలో కీలకమైన సమస్యలు ఎదురవుతున్నప్పుడు చాలామంది వాటిని తమకు సంబంధం లేని విషయాలుగా భావించి మౌనం పాటిస్తున్నారని అన్నారు. కానీ అలాంటి వైఖరి ప్రజాస్వామ్యానికి మంచిది కాదని ఆమె అభిప్రాయ పడ్డారు. ప్రతి ఒక్కరూ ప్రత్యక్షంగా ఉద్యమాల్లో పాల్గొనాల్సిన అవసరం లేకపోయినా, కనీసం సమస్యలపై మాట్లాడటం, చర్చించడం, సోషల్ మీడియా ద్వారా స్పందించడం కూడా ఒక బాధ్యతాయుతమైన పౌరుడి కర్తవ్యమని పేర్కొన్నారు. సోనమ్ వాంగ్‌చుక్ వంటి వ్యక్తులు ప్రజల హక్కుల కోసం చేస్తున్న పోరాటానికి న్యాయం జరగాలని తాను కోరుకుంటున్నానని మంచు లక్ష్మి తెలిపారు. ఆయన ఆశయాలను తాను గౌరవిస్తున్నానని, సమాజ ప్రయోజనాల కోసం పోరాడే వ్యక్తులకు ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. అలాగే రాజకీయాలపై విమర్శలు చేయడం కంటే, దేశ భవిష్యత్తు, రాబోయే తరాల సంక్షేమం కోసం బాధ్యతతో స్పందించడం ముఖ్యమని ఆమె పేర్కొన్నారు. దేశంలో జరుగుతున్న పరిణామాలను చూస్తూ నిశ్శబ్దంగా ఉండటం తనను బాధిస్తోందని, సమస్యల పరిష్కారం కోసం ప్రజలంతా చొరవ చూపాలని ఆమె విజ్ఞప్తి చేశారు. మంచు లక్ష్మి విడుదల చేసిన ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆమె సందేశానికి పలువురు నెటిజన్లు మద్దతు తెలుపుతూ, ప్రజా సమస్యలపై అవగాహన పెంచే ప్రయత్నాలను అభినందిస్తున్నారు. సమాజంలో జరుగుతున్న అంశాలపై స్పందించడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఆమె చేసిన పిలుపు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

## ఇంటింటికీ చెట్టును ప్రారంభించిన సర్పంచ్

నిజామాబాద్, జూలై 23 (జనంసాక్షి) : నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో పచ్చదనం పెంపు లక్ష్యంగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో 'ఇంటింటికీ చెట్టు' కార్యక్రమాన్ని సర్పంచ్ విజయకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలి మొక్కను స్వయంగా నాటి, ప్రతి ఇంటి వద్ద ఒక చెట్టును పెంచే బాధ్యత తీసుకోవాలని గ్రామస్తులకు పిలుపునిచ్చారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని కొత్తపల్లిని హరిత గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. నేరేడు, వేప, మామిడి, చింత, రావి వంటి నీడనిచ్చే, ఔషధ గుణాలున్న మొక్కలను గ్రామస్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి కుటుంబం ఒక మొక్కను దత్తత తీసుకుని సంరక్షించాలని సూచించారు. గ్రామంలోని పార్కులు, రహదారుల వెంట, ప్రభుత్వ స్థలాల్లో కూడా విస్తృతంగా మొక్కలు నాటి వాటికి రక్షణ కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అక్రమాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు

- సూర్యాపేటలో విజిలెన్స్,పౌర సరఫరాల శాఖ అధికారుల దాడులు



సూర్యాపేట (జనంసాక్షి): నల్గొండ జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, సూర్యాపేట జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారుల సంయుక్త బృందం ఈ నెల 20న సూర్యాపేట మండలం బాలెంల గ్రామంలోని వజ్ర రైస్ కార్పొరేషన్, వజ్ర వికాస్ రైస్ మార్ట్ రైస్ మిల్లులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా వజ్ర వికాస్ రైస్ మార్ట్ నుంచి ముదిగొండలోని సత్యసాయి రైస్ కార్పొరేషన్ పేరుతో భారత ఆహార సంస్థ కు సరఫరా చేయాల్సిన బియ్యాన్ని లారీలలో లోడ్ చేస్తుండగా అధికారులు గుర్తించి వెంటనే నిలిపివేశారు.అనంతరం సంబంధిత లారీలు, బియ్యం నిల్వలు, సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, లారీలతో పాటు బియ్యాన్ని సీజ్ చేశారు.అనంతరం ఇరు రైస్ మిల్లులలో భౌతిక ధృవీకరణ నిర్వహించగా, రికార్డుల ప్రకారం నిల్వ ఉండవలసిన ధాన్యంతో పోల్చితే గణనీయమైన ధాన్యం కొరత ఉన్నట్లు గుర్తించారు. పరిశీలనలో మొత్తం 29187.888 మెట్రిక్ టన్నుల ధాన్యం కొరత నమోదైనట్లు అధికారులు నిర్ధారించారు. ప్రాథమిక అంచనా ప్రకారం ఈ కొరత విలువ సుమారు రూ.69 కోట్లుగా అంచనా వేశారు.ఈ నేపథ్యంలో జిల్లా పౌర సరఫరాల అధికారి సమక్షంలో పంచనామా నిర్వహించి, మిల్లులలో లభ్యమైన ధాన్యం, బియ్యం నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. రైస్ మిల్లులపై రికవరీ చర్యలు చేపట్టారు. స్వాధీనం చేసుకున్న ధాన్యాన్ని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇతర అనుమతించబడిన రైస్ మిల్లులకు తరలించేందుకు జిల్లా మేనేజర్, తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థకు ఆదేశాలు జారీ చేశారు.ప్రభుత్వ ధాన్యం, బియ్యం నిల్వలు, కస్టమ్ మిల్లింగ్ ప్రక్రియలు, ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన అంశాలలో అక్రమాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని జిల్లా పౌర సరఫరాల శాఖ స్పష్టం చేసింది.

## కాళేశ్వరం అవినీతికి అండగా రేవంత్ చర్యలు

- కెసిఆర్‌ను కాపాడుతున్నది సిఎం రేవంతే
- 30 నెలలుగా చర్యలు తీసుకోక పోవడంపై అనుమానాలు
- నిజామాబాద్ బిజెపి ఎంపీ ధర్మపురి అర్వింద్ విమర్శలు



న్యూఢిల్లీ, జూలై 23 (జనంసాక్షి) : కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై ఈ 30 నెలలుగా సీఎం రేవంత్ రెడ్డి ఏం చేశారని నిజామాబాద్ బిజెపి ఎంపీ ధర్మపురి అర్వింద్ సందేహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం సీబీఐ విచారణకు ఎందుకు ఇవ్వలేదని తెలంగాణ సీఎంను ఈ సందర్భంగా ఆయన సూటిగా ప్రశ్నించారు. గురువారం న్యూఢిల్లీలో బీజేపీ ఎంపీ మాట్లాడుతూ.. రూ.30 వేల కోట్ల విలువైన పనులు జరిగిన తర్వాత ఎన్డీఎస్ఏ దగ్గరకు వచ్చారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో రూ. లక్ష కోట్లు నీళ్లలో పోయాయని కేంద్ర జలశక్తి మంత్రి పార్లమెంట్‌లో చెప్పారని గుర్తు చేశారు. రూ. లక్ష కోట్లు ముంచిన కేసీఆర్‌ను రేవంత్ రెడ్డి కాపాడుతున్నాడని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్, కేటీఆర్ దోచుకున్న పైసలను ప్రస్తుతం వారి నుంచి సీఎం రేవంత్ దోచుకుంటున్నారా? అని అనుమానం వ్యక్తం చేశారు. కేసీఆర్ కుటుంబం వద్ద సీఎం రేవంత్ రెడ్డి ఎంత తీసుకున్నాడు.. ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి ఎంత ఇచ్చాడని ఎంపీ ధర్మపురి అర్వింద్ ప్రశ్నించారు. తెలంగాణలో సాగు, తాగు, థర్మల్ పవర్ ప్లాంట్లకు నీరు అందడం లేదని అరవింద్ ఆవేదన వ్యక్తం చేశారు.తెలంగాణ ప్రజల సంపద లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును ఏం చేద్దామను కుంటున్నారని ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అవినీతి చేసినవారు, ప్రస్తుతం కాపాడే వ్యక్తి బాగానే ఉన్నారని వ్యంగ్యంగా అన్నారు. కానీ మధ్యలో రైతులను ఎందుకు ఇబ్బంది పెడుతున్నారని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. 2023లోనే కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చిందని వివరించారు. 2019లోనే మూడు బ్యారేజీల వద్ద పనులు ప్రారంభించిన వెంటనే పగుళ్లు వచ్చాయని పేర్కొందని తెలిపారు. 2023, అక్టోబర్‌లో మేడిగడ్డ బ్యారేజీ వద్ద పిల్లర్లు ఇసుక కారణంగా కుంగిపోయాయని ఎన్డీఎస్ఏ వివరించిందని అన్నారు. డీపీఆర్ అనుమతులు లేకుండానే కాళేశ్వరం నిర్మించారని విమర్శించారు. ఈ బ్యారేజీలను ముందస్తు ప్రణాళిక ప్రకారం కాకుండా వేరే చోట నిర్మించారని ఆరోపించారు. కాంట్రాక్టర్లకు కమిషన్లు ఇవ్వాలనే ఆతృతతో ఆగం ఆగంగా నిర్మించారని తెలిపారు. డిజైన్లు ఎందుకు మార్చారు.. అందుకు సంబంధించిన ÷ళ్లు అడిగితే జవాబు ఇవ్వలేదని బీజేపీ ఎంపీ మండిపడ్డారు. అన్నారం, సుందిళ్ల కూడా మేడిగడ్డ మాదిరిగానే ఉన్నాయని అన్నారు. మూడు బ్యారేజీలను పూర్తిగా పరిశీలించి, అవసరమైన చోట తిరిగి రిపేర్లు చేయాలని ఎన్డీఎస్ఏ సూచించిందని వివరించారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

- ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలి
- జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ కుమార్



**నాగర్‌కర్నూల్, జూలై 23 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించడంతో పాటు విద్యార్థుల సంఖ్యను పెంచేలా ఉపాధ్యాయుల ప్రధాన బాధ్యత అని, విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించేలా బోధన సాగించాలని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) రమేష్ కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అందుకు అనుగుణంగా ప్రతి ఉపాధ్యాయుడు అంకితభావంతో పనిచేయాలని ఆయన అన్నారు. గురువారం నాడు డీఈఓ రమేష్ కుమార్ నాగర్‌కర్నూల్ జిల్లాలోని తెల్కపల్లి, లింగాల మండలాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించి విద్యా బోధన, పాఠశాల నిర్వహణ, విద్యార్థుల అభ్యాసన స్థాయిలు, హాజరు, మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు నిర్వహిస్తున్న తరగతులను ప్రత్యక్షంగా వీక్షించి, విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించారు. తెల్కపల్లి మండలంలోని గౌరెడ్డిపల్లి ఎంపీపీఎస్‌తో పాటు లింగాల మండలంలోని మక్దూంపూర్ ఎంపీపీఎస్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) లింగాల, అప్పాయిపల్లి ఎంపీయూపీఎస్ తదితర పాఠశాలలను ఆయన సందర్శించారు. ప్రతి పాఠశాలలో తరగతి గదులను పరిశీలించి బోధనా విధానాలపై ఉపాధ్యాయులకు అవసరమైన సూచనలు చేశారు. విద్యార్థులు పాఠ్యాంశాలను కేవలం చదవడం మాత్రమే కాకుండా అర్థం చేసుకొని ఆచరణలో వినియోగించే స్థాయికి చేరేలా బోధన ఉండాలని సూచించారు. పిల్లల్లో చదువుపై ఆసక్తి పెంచేందుకు వినూత్న బోధనా పద్ధతులను అవలంబించాలని, ప్రతి విద్యార్థి అభ్యాసన స్థాయిని నిరంతరం అంచనా వేస్తూ వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడంతో పాటు పాఠశాలల్లో పరిశుభ్రత, క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఆదేశించారు. లింగాల కేజీబీవీని సందర్శించిన డీఈఓ అక్కడి తరగతి బోధన, విద్యార్థినులకు కల్పిస్తున్న వసతి సదుపాయాలు, వంటశాల, భోజనశాల, తాగునీటి సౌకర్యం, పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి ఆహార నాణ్యతను స్వయంగా పరీక్షించారు. విద్యార్థినులతో మమేకమై వారి విద్యాభ్యాసం, వసతి, భోజనం, ఇతర సౌకర్యాలపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థినులకు సూచించారు. లింగాల మండలంలోని అప్పాయిపల్లి ఎంపీయూపీఎస్‌లో విద్యార్థుల నమోదు (ఎన్‌రోల్‌మెంట్) పెంపుతో పాటు నాణ్యమైన బోధన ద్వారా విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను మెరుగుపరుస్తున్న ఉపాధ్యాయులను డీఈఓ ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తితో ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో విశ్వాసాన్ని పెంపొందించేలా నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపై ఉందని అన్నారు. ఈ ఆకస్మిక తనిఖీల ద్వారా పాఠశాలల పనితీరును నిరంతరం సమీక్షిస్తూ అవసరమైన మార్పులు చేపడతామని డీఈఓ తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని, విద్యా ప్రమాణాల పెంపుదలలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. ఈ పాఠశాలల తనిఖీలలో జిల్లా విద్యాశాఖ కార్యాలయ సూపరింటెండెంట్ సుజాత, ఏఎంఓ కిరణ్ కుమార్, తదితరులు డీఈఓ వెంట పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోవాలి




**శివ్వంపేట, జూలై 23 (జనంసాక్షి) :** విద్యార్థులు బాగా చదువుకుంటూ ఉన్నతమైన లక్ష్యాన్ని ఎంచుకొని ఆ దిశగా రాణించాలని విద్యుత్ శాఖ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్, దాత కొవ్వూరి సాయి ప్రసాద్ రెడ్డి అన్నారు. హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో గురువారం శివ్వంపేట మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల పాఠశాలలో చదువుకుంటున్న 10వ తరగతి విద్యార్థినీ, విద్యార్థులు 40 మందికి ఒక్కొక్క విద్యార్థికి 7 నోటుపుస్తకాలను చొప్పున ధాత సాయి ప్రసాద్ రెడ్డి తన చేతుల మీదుగా పిల్లలందరికీ నోటు పుస్తకాలను అందజేశారు. అనంతరం హార్ట్ టు హెల్ప్ ట్రస్ట్ చైర్మన్ మూడే రవి నాయక్ మాట్లాడుతూ సాయి ప్రసాద్ రెడ్డి మారుమూల గ్రామీణ ప్రాంతంలో ఉన్నటు వంటి విద్యార్థులకు నోటుపుస్తకాలు పంపిణీ చేస్తున్నందుకు ఉపాధ్యాయ బృందం అలాగే విద్యార్థి తల్లిదండ్రులు తరపున దాతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తునన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారాయణ గౌడ్, సుబ్బారెడ్డి, రాజేందర్ రెడ్డి, సత్యనారాయణ సంధ్యారాణి లతో పాటు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి




**కల్వకుర్తి, జూలై 23 (జనంసాక్షి) :** కల్వకుర్తి నియోజకవర్గంలోని యంగంపల్లి, జిల్లెల, మార్చర్ల గ్రామాల్లో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేసి, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు.గురువారం కల్వకుర్తిమండలంలోని గ్రామాలలో కొనసాగుతున్న ప్రత్యేక సవరణ ప్రక్రియను మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యంతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి,బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్ఓ)లకు పలు సూచనలు చేశారు. మరో పది రోజుల్లో ఓటరు జాబితా డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని, అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదు,పేర్ల సవరణ, చిరునామా మార్పులు తదితర దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించి, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు.ఓటరు జాబితా ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని,ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ ఓటరు వివరాలను పరిశీలించి, అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు,మాజీ ఎంపీపీలు,మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు,మాజీ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణలో నిఘా నేత్రాల పాత్ర కీలకం



**నాగర్‌కర్నూల్, జూలై 23 (జనంసాక్షి) :** నాగర్ కర్నూల్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి తో కలిసి జిల్లా ఎస్పీ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, నేరాల నియంత్రణలో, నేరస్థులను త్వరితగతిన గుర్తించడంలో సీసీ కెమెరాల (నిఘా నేత్రాలు) పాత్ర అత్యంత కీలకమైనదని, పట్టణంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు ఈ సీసీ కెమెరాలు ఎంతగానో ఉపకరిస్తాయని పేర్కొన్నారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా నిఘా వ్యవస్థను జిల్లావ్యాప్తంగా మరింత బలోపేతం చేస్తున్నట్లు వెల్లడించారు. నిఘా నేత్రాల ఏర్పాటుకు సహకరించి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్సీ కి, సహకరించిన ఎమ్మెల్యే కి మరియు సహకరించిన అసోసియేషన్ల వారికి నాగర్ కర్నూల్ డిఎస్పి బుర్రి శ్రీనివాస్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన వారు 1.మీజ ఫండ్ 05 లక్షలు 2. మెగా కంపెనీ 3 లక్షల 50 వేలు 3. ఫర్టిలైజర్స్ అసోసియేషన్ 50 వేలు 4.డాక్టర్స్ అసోసియేషన్ 02 లక్షల 40 వేలు 5.క్లాత్ మర్చంట్ అసోసియేషన్ 50 వేలు 6 గోల్డ్ స్మిత అసోసియేషన్ 08 కెమెరాలు, పెట్టిన సీసీ కెమెరాలు యొక్క వివరాలు బిజినేపల్లి 32, కుమ్మెర 06, నాగర్ కర్నూల్ టౌన్ 25, తిమ్మాజిపేట 17, ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్, సర్కిల్ ఇన్స్పెక్టర్ అశోక్ రెడ్డి, నాగర్ కర్నూల్ సర్కిల్ లో ఉన్న ఎస్ఐలు అందరితోపాటు స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, ప్రతినిధులు మరియు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ప్రతిభకు ప్రోత్సాహమే నిజమైన పెట్టుబడి

- ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి



**నాగర్ కర్నూల్, జూలై 23 (జనంసాక్షి) :** నాగర్‌కర్నూల్ పట్టణంలోని సిఎన్ఆర్ హై స్కూల్లో 10వ తరగతి వార్షిక పరీక్షల్లో అత్యధిక మార్కులతో 1, 2, 3 ర్యాంకులు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి చేతుల మీదుగా ల్యాప్‌టాప్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం సమాజ బాధ్యత అని, నేటి విద్యార్థులే రేపటి భారతదేశ నిర్మాణ శిల్పులని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, కష్టపడి చదివే తత్వంతో ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు, పాఠశాలకు, నాగర్‌కర్నూల్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్, వైస్ చైర్మన్ బాదం రమేష్ ,టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కా రాజు, కౌన్సిలర్ నిజాం, పద్మమ్మ, ఖాజాఖాన్, కాంగ్రెస్ నాయకులు, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బీఎల్ఓలపై సీఎం వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్



**ధన్వాడ, జూలై 23 (జనం సాక్షి) :** బీఎల్ఓలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నారాయణపేట జిల్లా ధన్వాడ మండలంలో గురువారం బీఎల్ఓలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం ఎమ్మార్వో సింధుజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు నరహరి మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియలో బీఎల్ఓలు కష్టపడి పనిచేసి ఓటరు జాబితా ప్రక్షాళనను విజయవంతంగా పూర్తి చేశారని అన్నారు. పని చేసిన ఉద్యోగులను ప్రోత్సహించాల్సింది పోయి విమర్శించడం సరికాదన్నారు. సీఎం వ్యాఖ్యలను వెనక్కి తీసుకునే వరకు, ఎస్ఐఆర్ డ్యూటీలు పూర్తయ్యే వరకు నల్ల బ్యాడ్జీలతో నిరసన కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ వెల్ఫేర్ సంఘం నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి



**మహబూబ్‌నగర్ రూరల్, జూలై 23 (జనం సాక్షి) :** మహబూబ్ నగర్‌లి ఢిల్లీ జనత్, మంతర్ లో విద్యార్థి నిరుద్యోగులు శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థి నాయకులపై లాఠీచార్జ్ చేయడం వ్యతిరేకిస్తూ నేడు మహబూబ్ నగర్ పట్టణ కేంద్రంలో వేలాదిమంది విద్యార్థి నిరుద్యోగులతో విద్యార్థి యువజన సంఘాలు భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం విద్యార్థి నిరుద్యోగుల పట్ల నిరంకుశ పాలన వహిస్తుందని అన్నారు. చీఔ సంస్థ దాదాపు 8వ సారి తప్పు చేసిన ఏమాత్రం బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని తెలిపారు. తక్షణమే ఎన్ టి కీయూ సంస్థను రద్దు చేసి. కేంద్ర విద్యా శాఖ మంత్రిగా ఉన్న ధర్మేంద్ర ప్రధాన్ ను సస్పెండ్ చేయాలని అన్నారు. నీట్ లేకేజి కారణంగా చనిపోయిన విద్యార్థి కుటుంబానికి రెండు కోట్ల ఎక్స్గ్రేషియా ఇవ్వాలని వారు అన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని నమ్మించి నిరుద్యోగులను మోసం చేశారని అన్నారు. తక్షణమే విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను సస్పెండ్ చేయకపోతే విద్యార్థి నిరుద్యోగులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ ఐ వై ఎఫ్ జిల్లా కార్యదర్శి రాము, డి వై ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్, ఎఐ× జిల్లా కార్యదర్శి భరత్, ఏఐఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, పి డి ఎస్ యు జిల్లా కార్యదర్శి సీతారామ్,విద్యార్థి నాయకులు, రాజు నందు, ఈశ్వర్,రాజశేఖర్, శివ జీశాంత్,మారుతి, మహేష్ పాల్గొన్నారు.

## కేజీబీవీ రాజోలి పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



**గద్వాల నడిగడ్డ, జూలై 23 (జనం సాక్షి) :** విద్యార్థులకు మంచి విద్యతో పాటు వారు ఆరోగ్యకరంగా ఉండేందుకు పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. గురువారం రాజోలిలోని కేజీబీవీ పాఠశాలను అయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న విద్యా, వసతి,భోజన సౌకర్యాలను పరిశీలించారు. తరగతి గదులు,వసతి గృహాలు,వంటశాల, భోజనశాల, పరిశుభ్రత,తాగునీటి సౌకర్యం తదితర అంశాలను సమీక్షించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించాలని,ఆహార నాణ్యత,పరిశుభ్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యూనిఫామ్ ,బెడ్ షీట్స్ అందజేశారు.ఈ తనిఖీలో పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బాలికలు తప్పనిసరిగా హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకోవాలి



**తెల్కపల్లి, జూలై 23 (జనం సాక్షి) :** సర్వైకల్ క్యాన్సర్ నివారణకు 14 ఏళ్లు నిండిన బాలికలందరూ హెచ్‌పీవీ వ్యాక్సిన్ తప్పనిసరిగా తీసుకోవాలని ఆర్బీఎస్కే వైద్యాధికారి డాక్టర్ అక్బర్ సూచించారు. గురువారం తెల్కపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థినులకు హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 14 సంవత్సరాల వయసులో హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా శరీరంలో బలమైన రోగనిరోధక శక్తి ఏర్పడి, హ్యూమన్ పాపిల్లోమా వైరస్ (హెచ్.పి.వి) నుంచి రక్షణ లభిస్తుందని తెలిపారు. సర్వైకల్ క్యాన్సర్‌ను నివారించేందుకు భారత ప్రభుత్వం ఈ వ్యాక్సిన్‌ను ఉచితంగా అందిస్తున్నందున ప్రతి అర్హత కలిగిన బాలిక ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్ సురక్షితమైనది, సమర్థవంతమైనదని, క్యాన్సర్ నివారణలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సందీప్ రెడ్డి, ఏఎన్ఎంలు కవిత, శాంత పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- జిల్లా జనరల్ హాస్పిటల్‌ను ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్



**గద్వాల నడిగడ్డ, జూలై 23 (జనం సాక్షి) :** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ డాక్టర్లను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఐసీయూ,ఇతర వార్డులను సందర్శించి రోగులతో మాట్లాడారు. రోగుల ఆరోగ్య సమస్యలను తెలుసుకొని వారికి అందుతున్న వైద్య సేవలపై వాకబు చేశారు. గద్వాల ఆసుపత్రికి మంజూరైన వివిధ వైద్య,ఇతర సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్న వాటిని పూర్తిస్థాయిలో భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇచ్చి నిబంధనల ప్రకారం ముందుకెళ్లాలన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పరిసరాలను పరిశీలించగా పొదలు పెరగడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. వినియోగించని పాత మంచాలు,ఇతర వైద్య సామాగ్రిని ఎక్కడపడితే అక్కడ పడేయడం సరికాదని ఇలాంటి స్క్రాప్ ను వేలంపాట నిర్వహించి విక్రయించాలన్నారు. ఎగ్జామినేషన్ ట్రీట్మెంట్ విభాగంలో మానిటర్ యంత్రం పనిచేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఆపరేషన్ థియేటర్లో చేయాల్సిన వివిధ పనులపై తగు సూచనలు చేశారు. ఆసుపత్రిలో పలు మరమ్మత్తులు, విద్యుత్, ఇతర పనులకై రూ.50 లక్షల నిధులను కేటాయించినప్పటికీ సకాలంలో పనులు ప్రారంభించకపోవడంపై సంబంధిత అధికారులపై మండిపడ్డారు. ఆసుపత్రి పైన అంతస్తులో ఉన్న 50 మంచాల జనరల్ వార్డుకు వెళ్లేందుకు ఉన్న ర్యాంపుకు పైకప్పును యుద్ధ ప్రాతిపదికన నిర్మించాలనీ గుత్తేదారును ఆదేశించారు. రోగుల సహాయకులు వేచి ఉండేందుకు ఆసుపత్రి ఆవరణలో షెడ్ నిర్మాణం చేపట్టాలన్నారు. వివిధ పనులకై ఇదివరకు కేటాయించిన నిధులు సరిపోకుంటే అదనపు నిధులను మంజూరు చేస్తామని, ఆసుపత్రిలో ఎలాంటి సమస్యలు లేకుండా రోగులకు పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఆసుపత్రి పర్యవేక్షకుల చాంబర్ లో కలెక్టర్ వైద్యాధికారులతో సమావేశమై మాట్లాడారు. ఈ సందర్భంగా వైద్యులు, ఇతర సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్లు, వివిధ రికార్డులను తనిఖీ చేశారు. చాలా రోజులుగా విధులకు హాజరుకాని వైద్యులను సరెండర్ చేయాలన్నారు. ఏజెన్సీ ద్వారా అవుట్సోర్సింగ్ విధానంలో సెక్యూరిటీ, శానిటేషన్ కోసం పెద్ద ఎత్తున సిబ్బందిని నియమించారని, వారి సేవలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని పర్యవేక్షకురాలు ఝాన్సీ లక్ష్మికి సూచించారు. నిబంధనల ప్రకారం అదనపు సిబ్బందిని నియమించాలని ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. అలాగే ఆసుపత్రి ఆవరణలో దివ్యాంగుల సదరం శిబిరం నిర్వహణకు నూతనంగా నిర్మించిన భవనాన్ని, రేడియోలజీ, మైత్రి ట్రాన్స్ క్లినిక్, తదితర విభాగాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఆసుపత్రి సమీపంలో నిరుపయోగంగా ఉన్న వివిధ వైద్య సిబ్బంది క్వార్టర్స్ ను సద్వినియోగం చేసుకునేందుకు ప్రణాళికలు రూపొందించాలని పేర్కొన్నారు. ఆసుపత్రికి విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం ఉండకుండా వైద్యాధికారులు విద్యుత్ శాఖ అధికారులను సమన్వయం చేసుకుంటూ తగు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, పంచాయతీరాజ్ శాఖ ఈఈ ప్రభాకర్, వైద్యశాఖ ఏఈ రహీం, వైద్యాధికారులు, తదితరులున్నారు.

## బాసర నుంచి త్రయంబకేశ్వర్ వరకు 99 లక్షల మొక్కలు

- 24న కేటీఆర్ జన్మదిన వేడుకల్లో భాగంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్ మెగా హరిత కార్యక్రమం
- జిల్లా గ్రీన్ ఇండియా ఛాలెంజ్ అధ్యక్షుడు రాథోడ్ అశోక్



**దిలావర్పూర్ , జులై 23, (జనం సాక్షి):** నిర్మల్ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి ప్రాంగణంలోని గోదావరి నది ఒడ్డు నుంచి త్రయంబకేశ్వర్ వరకు 99 లక్షల మొక్కలు నాటే భారీ హరిత కార్యక్రమానికి అంతా సిద్ధమైంది. ఈ నెల 24న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకల సందర్భంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్ వ్యవస్థాపకుడు, రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్ కుమార్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రీన్ ఇండియా ఛాలెంజ్ అధ్యక్షుడు రాథోడ్ అశోక్ తెలిపారు. గోదావరి నదికి ఇరువైపులా ఈ మొక్కలను నాటి కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని ఆయన వివరించారు. రానున్న ఐదేళ్లలో 100 కోట్ల మొక్కలు నాటాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. బాసర నుంచి త్రయంబకేశ్వర్ వరకు హరితహారాన్ని విస్తరించడం ద్వారా గోదావరి పరివాహక ప్రాంతంలో పచ్చదనం పెంచడమే లక్ష్యమని, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్ పని చేస్తుందని అన్నారు. ఈ మెగా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాథోడ్ అశోక్ తెలిపారు. జిల్లాలోని గ్రీన్ ఇండియా ఛాలెంజ్ నాయకులు, కార్యకర్తలు, మండల అధ్యక్షులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లపై సీపీ ప్రత్యేక నజర్

- సమన్వయంతో చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు





**వరంగల్ బ్యూరో, జూలై 23 (జనం సాక్షి) :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్లపై వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా గురువారం సంబంధిత పోలీసు అధికారులు, నేషనల్ హైవే అథారిటీ, రోడ్డు రవాణా శాఖ, ఎక్సైజ్ శాఖ అధికారులతో కలిసి జాతీయ రహదారి--163పై హనుమకొండ-హైదరాబాద్ ప్రధాన రహదారి మార్గంలో ప్రమాదాలకు గురవుతున్న 10కి పైగా బ్లాక్ స్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గుర్తించిన బ్లాక్ స్పాట్ల వద్ద రోడ్డు ప్రమాదాలు సంభవించడానికి గల కారణాలను పోలీస్ కమిషనర్ అధికారులతో కలిసి సమగ్రంగా పరిశీలించారు. ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో విస్తృతంగా చర్చించి, సంబంధిత శాఖలకు పలు కీలక సూచనలు చేశారు. ప్రధానంగా జాతీయ రహదారి నుంచి గ్రామాలకు వెళ్లే అనుసంధాన రహదారులు, డివైడర్ ఓపెనింగ్‌లు ఉన్న ప్రాంతాల్లో రాత్రి వేళల్లో వాహనదారులకు స్పష్టంగా కనిపించే విధంగా తగిన లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్ల వద్ద వాహనదారులను అప్రమత్తం చేసే హెచ్చరిక బోర్డులు, దిశా నిర్దేశక సూచికలు, రిఫ్లెక్టివ్ సైన్ బోర్డులను అధిక సంఖ్యలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు.జాతీయ రహదారి వెంట ఉన్న మద్యం దుకాణాల వద్ద వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా పార్కింగ్‌ను క్రమబద్ధీకరించేలా సంబంధిత వ్యాపారులు చర్యలు తీసుకునే విధంగా ఎక్సైజ్ శాఖ అధికారులు చొరవ చూపాలని సూచించారు.పరిశీలన సందర్భంగా పోలీస్ కమిషనర్ స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కరుణాపురం వద్ద పాదచారుల వంతెన (ఫుట్ ఓవర్ బ్రిడ్జ్) నిర్మించాలని స్థానికులు కోరగా, అవసరమైన ప్రదేశాల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని జాతీయ రహదారి అధికారులకు సూచించారు.అనంతరం జాతీయ రహదారి-163పై ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన బాధితులను అత్యవసరంగా ఆసుపత్రికి తరలించేందుకు ఏర్పాటు చేసిన అంబులెన్స్‌ను పరిశీలించి, అందులో అందుబాటులో ఉన్న అత్యవసర వైద్య సౌకర్యాలపై ఆరా తీశారు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ సిబ్బంది స్పందన, సేవల నిర్వహణ తీరును అడిగి తెలుసుకుని, మరింత సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్, ట్రాఫిక్ అదనపు డీసీపీ రాయల ప్రభాకర్ రావు, ఘనపూర్ ఏసీపీ భీంశర్మ, ఎన్. హెచ్.ఏ.ఐ పీడీ భరద్వాజ్ ,మేనేజర్ లింగయ్య, ఇన్‌స్పెక్టర్లు వేణు, చేరాలు, ఎస్ఐలు నవీన్ కుమార్, శ్రవణ్ కుమార్, ఆర్ఎస్ఐ నవీన్ తో పాటు రోడ్డు రవాణా శాఖ, ఎక్సైజ్ శాఖ, జాతీయ రహదారి అథారిటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దేశాన్ని ఆస్థిరపరిచేందుకు కాంగ్రెస్ కుట్ర

- బీజేపీ నేత రావుల రాంనాథ్



**నిర్మల్ టౌన్, జూలై 23, (జనంసాక్షి) :** భారత దేశాన్ని ఆస్థిరపరచేందుకు కాంగ్రెస్ పార్టీ కుట్ర చేస్తోందని నిర్మల్ బీజేపీ నేత రావుల రాంనాథ్ మండిపడ్డారు. గురువారం నిర్మల్ పట్టణంలోని ఆదర్శ నగర్ కాలనీ కార్యకర్తల సమావేశం అనంతరం అయన మీడియాతో మాట్లాడారు.నీట్ పరీక్షల ముసుగులో కాంగ్రెస్ మరియు ఇతర ప్రతిపక్షాలు చేస్తున్న రాజకీయాలను అందరూ గమనిస్తున్నారని పేర్కొన్నారు. నీట్ ను అడ్డుపెట్టుకొని కమ్యూనిస్టులు, దేశ వ్యతిరేక శక్తులు దేశాన్ని విడగొట్టాలని కుట్రలు చేస్తున్నారన్నారు. ఆర్టికల్ 370 ని మళ్లీ తీసుకురావాలని, ఆర్ఎస్ఎస్ ను బ్యాన్ చేయాలని మాట్లాడుతున్నారని,అసలు సనాతన ధర్మానికి, ఆర్ఎస్ఎస్ కు మరియు నీట్ పరీక్షలకు సంబంధం ఏంటిని ఆయన ప్రశ్నించారు. ఇది నవ భారతం, మోదీ గారి భారతం..ఇలాంటి విచ్ఛిన్నకర శక్తుల కుట్రలకు బీజేపీ ఏమాత్రం భయపడదని హితువు పలికారు మోదీ గారిని బలహీనపరుస్తామనే పగటి కలలు కనడం రాహుల్ గాంధీ గారు ఇకనైనా మానుకోవాలి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఆకుల కార్తీక్, నిర్మల్ మున్సిపాలిటీ కౌన్సిలర్లు సుధం అరవింద్, గంజి రాజు, ధర్మాజీగారి ఈశ్వర్, విఠల్, సూరజ్, సీనియర్ నాయకులు పోడెల్లి గణేష్, జాప ప్రసాద్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పీవీ విజ్ఞాన కేంద్రం పనులను పరిశీలించిన కలెక్టర్

- పనులను మరింత వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం



**హనుమకొండ ప్రతినిధి / భీమదేవరపల్లి, జులై 23.(జనంసాక్షి) :** హనుమకొండ జిల్లాలోని భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో నిర్మిస్తున్న పీవీ విజ్ఞాన కేంద్రం పనులను హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి గురువారం పరిశీలించారు.మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహారావు స్వగ్రామంలో నిర్మిస్తున్న పీవీ విజ్ఞాన కేంద్రం పనులు తుది దశకు చేరడంతో క్షేత్ర స్థాయిలో జిల్లా కలెక్టర్ అభివృద్ధి పనులను పరిశీలించారు. విజ్ఞాన కేంద్రంలోని ఆర్ట్ గ్యాలరీ, ఆడిటోరియం, ప్రాంగణంలో నాటిని మొక్కలు, నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ లైట్లు, తాగునీటి సౌకర్యాలు, నిర్వహణను కలెక్టర్ స్వయంగా పరిశీలించి వాటికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తుది దశకు చేరుకున్న పీవీ విజ్ఞాన కేంద్రం అభివృద్ధి పనులను మరింత వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కేంద్రం నిర్వహణ మెరుగ్గా ఉండాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సృజన, కుడా సీపీవో అజిత్ రెడ్డి, డీఈ రఘు, జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ, తహసీల్దార్ రాజేష్, ఎంపీడీవో వీరేశం, ఇతర అధికారులతో పాటు స్థానికులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, జూలై 23 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మంచిర్యాల జిల్లాలోని హాజీపూర్ మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి భోజనశాల, అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తూ విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, ఈ క్రమంలో పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలతో కూడిన ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. ఉపాధ్యాయులు విధుల పట్ల సమయపాలన పాటించాలని, వర్షాకాలం దృష్ట్యా విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించే విధంగా కృషి చేయాలని తెలిపారు. మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తహసిల్దార్ పుష్పలత తో కలిసి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహణను పరిశీలించారు. ప్రజల నుండి సేకరించిన ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియలో జాగ్రత్త వహించాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా స్పష్టంగా వివరాలు నమోదు చేయాలని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరి వివరాలు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రక్రియ వేగవంతానికి బూత్ స్థాయి ఏజెంట్లు, వాలంటీర్లు, యువత సహకారం తీసుకోవాలని తెలిపారు. భూభారతి, సాదా బైనమా, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి మండలంలోని గ్రామపంచాయతీల పనితీరు, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. గ్రామాలలో పారిశుద్ధ్య నిర్వహణ నిరంతరం చేపట్టాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతం చేసి నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వ్యక్తిగత గృహ మరుగుదొడ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేసే వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, త్రాగునీటి సరఫరా లో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జలసిరి కార్యక్రమం లో భాగంగా చేపట్టిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, ప్రతిరోజు పనుల పురోగతిని పర్యవేక్షించాలని సూచిం చారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం ప్రదర్శించ కుండా ప్రతి పనిని బాధ్యతా యుతంగా నిర్వహించాలని తెలిపారు. గ్రామపంచాయతీలలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలలో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా సమన్వయంతో పని చేయాలని తెలిపారు.

## భూగర్భ జలాల పెంపుదలకు 'జలసిరి' ఫామ్ పాండ్లు దోహదం

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా
- కుబీర్ మండలం డోడర్నలో ఫామ్ పాండ్ నిర్మాణానికి శంకుస్థాపన
- రైతు దంపతులు సంతోష్, సాగరలకు అభినందనలు
- తెలంగాణ జలసిరి గోడ ప్రతుల ఆవిష్కరణ



**కుబీర్, జులై 23, (జనంసాక్షి):** భూగర్భ జలాల సంరక్షణకు, పెంపుదలకు 'జలసిరి' పంట కుంట నిర్మాణాలు ఎంతగానో దోహదం చేస్తాయని నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. గురువారం ఆయన కుబీర్ మండలం డోడర్న గ్రామంలో తెలంగాణ జలసిరి కార్యక్రమంలో భాగంగా పంట కుంట (ఫార్మ్ పాండ్) నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రామానికి చెందిన రైతు దంపతులు గోరేకర్ సంతోష్, సాగరలకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో కలెక్టర్ భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫార్మ్ పాండ్ నిర్మాణానికి ముందుకు వచ్చిన రైతు దంపతులను కలెక్టర్ శాలువాతో సన్మానించి, వారి వ్యవసాయ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి రైతు బాధ్యతగా తమ వ్యవసాయ క్షేత్రాల్లో ఫామ్ పాండ్ లను ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ నిర్మాణాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేస్తుందని తెలిపారు. ప్రస్తుతం ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా ఉన్నాయని, ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో పంటలను కాపాడుకోవడానికి ఈ నీటి నిల్వ నిర్మాణాలు అత్యవసర సమయాల్లో పంటకు నీరు అందిస్తాయని వివరించారు. రైతులు పెద్ద ఎత్తున ఈ పంట కుంటల నిర్మాణానికి ముందుకు రావాలని కోరారు. తర్వాత తెలంగాణ జలసిరి కార్యక్రమానికి సంబంధించిన గోడ ప్రతులను కలెక్టర్, అధికారులు, రైతులు కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డిఆర్డిఓ విజయలక్ష్మి, తహశీల్దార్ శ్రీదేవి, ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఓ హరిలాల్, సర్పంచ్ జాదవ్ సావిత్రి, ఇతర అధికారులు, గ్రామీణ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఫుడ్ ప్రాసెసింగ్ రంగ అభివృద్ధి, ఉపాధి అవకాశాలపై ప్రశ్నలు

- పార్లమెంట్‌లో ఎంపీ కావ్య



**కాజీపేట, జూలై 23(జనం సాక్షి) :** వరంగల్ జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగ అభివృద్ధి, ఉపాధి అవకాశాల సృష్టిపై వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య న్యూ ఢిల్లీ లో పార్లమెంట్ లో ప్రశ్నించారు. జిల్లాలో కేంద్ర పథకాల అమలు, వాటి ఫలితాలపై కేంద్ర ప్రభుత్వాన్ని వివరాలు కోరారు. ఈ మేరకు వరంగల్ ఎంపీ అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. గత మూడేళ్లలో ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్ఎమ్ఈ) పథకం కింద వరంగల్ జిల్లాలో 147 ప్రాజెక్టులు మంజూరయ్యాయని కేంద్రం వెల్లడించింది. ప్రస్తుతం 171 యూనిట్లు కార్యకలాపాలు నిర్వహిస్తుండగా, వీటి ద్వారా రూ. 18.91 కోట్ల పెట్టుబడులు సమకూరాయి. రూ. 4.15 కోట్ల సబ్సిడీ మంజూరై 549 మందికి ఉపాధి లభించినట్లు తెలిపింది. ఈ అంశంపై స్పందించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, వ్యవసాయాధారిత జిల్లాగా ఉన్న వరంగల్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ రంగ విస్తరణ రైతులు, యువతకు ఎంతో ప్రయోజనకరమని పేర్కొన్నారు. పంట అనంతర నష్టాల నివారణ, వ్యవసాయ ఉత్పత్తులకు విలువ, గ్రామీణ ఉపాధి పెంపు లక్ష్యాలతో కేంద్ర పథకాలను మరింత సమర్థంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వరంగల్ జిల్లాలో మరిన్ని ప్రాసెసింగ్ యూనిట్లు, నిల్వ కేంద్రాలు, విలువ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటుకు కేంద్రం ప్రత్యేక దృష్టి సారించాలని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య కోరారు. వరంగల్ రైతాంగానికి మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలని ఈ సందర్భంగా కోరారు.

## రేషన్ కార్డుదారులందరికీ ఈ-కేవైసీ తప్పనిసరి

- రేషన్ సరఫరాలో అంతరాయం కలగకుండా ఉండటానికి వెంటనే ఈ- కేవైసీ పూర్తి చేయండి
- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ వాసుదేవరావు



**ములుగు ప్రతినిధి, జులై 23(జనంసాక్షి) :** ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జాతీయ ఆహార భద్రతా చట్టం (ఎన్ఎఫ్ఎస్ఏ) మరియు రాష్ట్ర ఆహార భద్రతా కార్డుల (ఎస్ఎఫ్ఎస్సీ) కింద నమోదైన లబ్ధిదారులందరికీ ఈ-కేవైసీ (ఈ -కేవైసీ) సరిచూడటం తప్పనిసరి చేసినట్టు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు. రేషన్ కార్డులో పేరు నమోదైన ప్రతి ఒక్కరూ తమ బయోమెట్రిక్ ప్రామాణీకరణను (ఆధార్ ఇ-కేవైసీ) పూర్తి చేయాలని, లబ్ధిదారులు ఈ -కేవైసి ప్రక్రియను పూర్తి చేయడానికి తమ సమీపంలోని చౌక ధరల దుకాణాన్ని (రేషన్ షాప్) సందర్శించాలని, ఏ విధమైన రుసుము చెల్లించవలసిన అవసరం లేదని, లబ్ధిదారులు తమ అసలు రేషన్ కార్డు, ఆధార్ కార్డును రేషన్ షాపుకి తీసుకెళ్ళాలని, కార్డులో ఉన్న ప్రతి కుటుంబ సభ్యుడు ఇ-పాస్ యంత్రంపై వ్యక్తిగతంగా తమ వేలిముద్రలను వేయాలని సూచించారు. నిర్దేశిత గడువు అనగా తేది. 31.07.2026 లోపు లబ్ధిదారులు ఈ-కేవైసీ పూర్తి చేయకపోతే, వారి యూనిట్ తొలగించబడుతుందని, ఆ వ్యక్తికి పంపిణీ చేసిన రాయితీ సరకుల సరఫరా నిలిపివేయబడుతుందని తెలిపారు. ప్రతి నెల ఇచ్చే ఉచిత/రాయితీ రేషన్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ఉండటానికి పౌర సరఫరాల శాఖకు సహకరించి, గడువు ముగిసేలోపు వెంటనే తమ రేషన్ షాపును సందర్శించి ఈ-కేవైసీ ప్రామాణీకరణను పూర్తి చేయాలని జిల్లా యంత్రాంగం లబ్ధిదారులందరికీ తెలియజేశారు.

## మహాగాం పాఠశాలలో విద్యార్థుల పెరుగుదలపై డీఈవో ప్రశంసలు



**భైంసా, జూలై 23 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లా భైంసా మండలం మహాగాం ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాధికారి దర్శన్ భోజన్న గురువారం సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల నమోదు గణనీయంగా పెరగడంపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, ప్రధానోపాధ్యాయుడు ఎన్. కృష్ణను అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న బేస్‌లైన్ పరీక్షలను పరిశీలించి విద్యార్థుల అభ్యాస స్థాయిని అంచనా వేశారు. విద్యా ప్రమాణాల మెరుగుదలకు ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన న్యూట్రిషన్ గార్డెన్‌ను సందర్శించి ప్రశంసించారు. గార్డెన్‌లో మొక్క నాటి పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కుభీర్ మండల విద్యాధికారి విజయ్ కుమార్, మహాగాం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ఎన్. కనకరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్. కృష్ణ, ఉపాధ్యాయులు హరీష్, రాగిణి, అభిషేక్, శ్రీలతతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



## కేటీఆర్‌కు ఘన స్వాగతం

**స్టేషన్ ఘన్‌పూర్, జూలై 23 (జనంసాక్షి) :** హన్మకొండ జిల్లా మడికొండ లో పోచంపల్లి ఫౌండే షన్ ద్వారా కుట్టు మిషన్ పంపిణి కార్యక్రమంకు వెళ్తున్న క్రమంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కు స్టేషన్ ఘన్పూర్ డివిజ న్ కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర తొలి ఉప ముఖ్య మంత్రి, మాజీఎమ్మెల్యే డాక్టర్ తాటికొండరాజయ్య తో పాటు బిఆర్ఎస్ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేటీఆర్ ను శాలువాతో సన్మానించి మందస్తు జన్మదిన శు భా కాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మాచర్ల గణేష్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు కనకం గణేష్, నాయకులు ఆకుల కుమార్, మనోజ్ రెడ్డి, మాలోతు రమేష్ నాయక్, తాటికొండ సురేష్ కుమార్, చల్ల చందర్ రెడ్డి, చల్లా రమ్య రఘు రెడ్డి, బంగ్లా శ్రీనివాస్, మారప ల్లి ప్రసాద్,ఆకారపు అశోక్,గుండె మల్లేష్, పావని, జ్యోతి రెడ్డి, బత్తుల రాజన్ బాబు, రాజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్ అభివృద్ధిపై దృష్టి పెట్టండి

- ఆప్ నేత సయ్యద్ హైదర్




**నిర్మల్ బ్యూరో, జూలై 23 (జనంసాక్షి) :** ప్రతిపక్షాలపై విమర్శలు మానేసి నిర్మల్ అభివృద్ధి, స్థానిక సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని ఆమ్ ఆద్మీ పార్టీ (తెలంగాణ) రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సయ్యద్ హైదర్ డిమాండ్ చేశారు. ఢిల్లీలో ప్రశ్నాపత్రాల లీకేజీలకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులపై ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. నిర్మల్ పట్టణంలోని వైఎస్సార్ కాలనీ, మహాలక్ష్మి వాడల్లో డ్రైనేజీ, సీసీ రోడ్ల వంటి మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో సీటీ స్కాన్ సౌకర్యం లేక పేదలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. జిల్లాకు కొత్త పరిశ్రమలు తీసుకువచ్చి స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోకపోతే బాధితులతో కలిసి మున్సిపాలిటీ, కలెక్టరేట్ ముట్టడికి దిగుతామని హెచ్చరించారు.

## అడవి పంది దాడిలో పశువుల కాపరికి తీవ్ర గాయాలు

**ముధోల్, జూలై 23 (జనం సాక్షి)**మండలంలోని కారేగాం గ్రామంలో అడవి పంది దాడిలో పశువుల కాపరికి తీవ్ర గాయాలయ్యాయి.గురువారం మధ్యాహ్నాం కారేగాం గ్రామానికి చెందిన కోనెల ఎర్రన్న రోజు మాదిరిగా పశువులను పొలంలోకి మేతకు తీసుకెళ్లాడు. పంట పొలంలో పశువులను మేపుతుండగా వెనుక నుండి వచ్చిన అడవి పంది ఒక్కసారిగా ఎర్రన్నపై దాడి చేసింది.ఈ దాడిలో ఎర్రన్నకు వీపుపై మరియు కుడి తొడకు రెండు వైపులా తీవ్ర గాయాలు అయ్యాయి. అరుపులు విన్న స్థానిక రైతులు వెంటనే అక్కడికి చేరుకుని పందిని తరిమికొట్టారు. సమాచారం అందుకున్న వెంటనే 108 అంబులెన్స్ సిబ్బంది భీమ్ రావు, శేఖర్ ఘటనా స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గాయపడిన ఎర్రన్నను బైంసా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో అడవి పందుల సంచారం పెరగడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
24 జూలై 2026

# అక్రమ గంజాయి రవాణా సరఫరాదారుల అరెస్ట్

**• రూ. 11.55 లక్షల విలువైన 23.100 కేజీల గంజాయి స్వాధీనం**

**కల్లూరు, జూలై 23 (జనం సాక్షి) :** కల్లూరు పట్టణ శివారులో అక్రమంగా గంజాయి విక్రయాలు జరుపుతున్న ఐదుగురు సభ్యుల ముఠాను కల్లూరు పోలీసులు చాకచక్యంగా పట్టుకుని, వారి వద్ద నుండి రూ. 11.55, లక్షల విలువైన 23.100 కేజీల ఎండు గంజాయి స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు ఏసిపి వసుంధర యాదవ్ తెలిపారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో గంజాయి అక్రమ సరఫరాదారుల వివరాలు వెల్లడించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్ఐడి హరిత, తమ సిబ్బంది తో కలిసి బుధవారం పట్టణంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, ఉదయం సుమారు 11:00 గంటల సమయంలో కల్లూరు శివారు కాశ్మీర శివాలయం ఖాళీ ప్రాంగణంలో ఆటో బైక్‌లపై కొందరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసు వాహనాన్ని చూసి వారు పారిపోవడానికి ప్రయత్నించగా, పోలీస్ సిబ్బంది వారిని వెంబడించి ఐదుగురిని పట్టుకున్నారు. మరో ఇద్దరు వ్యక్తులు తమ ద్విచక్ర వాహనాలు వదిలేసి పారిపోయారు. పట్టుబడిన వారి ఆటోలో తనిఖీ చేయగా 12 ప్యాకెట్లలో ఎండు గంజాయి లభ్యమైంది. వెంటనే కల్లూరు తహశీల్దార్ వారి ద్వారా జిపిఓ లు నరసింహారావు, రామకృష్ణ లను పిలిపించి, చట్టబద్ధంగా పంచనామా నిర్వహించి గంజాయిని ఒక ఆటో రిక్షా, రెండు



ద్విచక్ర వాహనాలు, 5 మొబైల్ ఫోన్లు రూ. 5,వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు వసుందరా యాదవ్ తెలిపారు. అరెస్టయిన నిందితుల వివరాలు పాల్వంచకు చెందిన ఆటో డ్రైవర్ మ హమ్మద్ అన్వర్, కల్లూరు కు చెందిన ఆటో డ్రైవర్ షేక్ ముజాహిద్ పాషా, పాల్వంచకు చెందిన కార్ డ్రైవర్ మహమ్మద్ వజీర్ ఖాన్, హైదరాబాద్ కు చెందిన దేవరం రాకేష్, సికింద్రాబాద్కు చెందిన మహమ్మద్ ఆదిల్,లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. పరారైలో ఉన్న ఒరిస్సా మల్కా నగిరికి చెందిన రాజు, కార్తీక్ ల కోసం పోలీసులు గాలిస్తున్నట్లు తెలిపారు. అరెస్ట్ అయిన వారిని విచారణ చేయగా నేర ప్రవృత్తిగా చేస్తూ మహమ్మద్ అన్వర్ గతంలో ఒరిస్సాలోని మల్కనగిరి జిల్లా ఎం వి -72 గ్రామానికి చెందిన రాజు, కార్తీక్ ల వద్ద కేజీ రూ. 3,000/- చొప్పున గంజాయి కొనుగోలు చేసి పాల్వంచ, కొత్తగూడెంలో విక్రయించేవాడు. గతంలో జైలుకు వెళ్లి వచ్చిన తర్వాత, హైదరాబాద్‌కు చెందిన (ఏ4) రాకేష్‌కు కేజీ రూ. 12,000/- చొప్పున హోల్‌సేల్‌గా విక్రయించడం ప్రారంభించాడు. పోలీసు నిఘా పెరగడంతో తన బావ అయిన( ఎ -2) ముజాహిద్ పాషా బాబాయి(ఎ-3)వజీర్ ఖాన్‌లను ఈ వ్యాపారంలో భాగస్వాములుగా చేర్చుకున్నాడు. ఒరిస్సా నుండి ఆటోలో తెచ్చిన గంజాయిని కల్లూరులోని ముజాహిద్ పాషా ఇంట్లో నిల్వ చేసి, హైదరాబాద్ నుండి వచ్చిన రాకేష్ (ఎ -4) అతని స్నేహితుడు ఆదిల్ (ఎ -5) లకు విక్రయించేందుకు కల్లూరు శివాలయం వద్ద పంపిణీ చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా పెద్దమొత్తంలో అక్రమ గంజాయి రవాణా, అమ్మకం, కలిగి ఉన్నటువంటి నిందితులను అరెస్ట్ చేయడంలో ప్రతిభ చూపిన సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తులింగయ్య, కల్లూరుఎస్ఐ డి . హరిత, , హెడ్ కానిస్టేబుల్ నరసింహారావు, కానిస్టేబుల్లు రంగారావు, రఫీ, విజయకాంత్, డ్రైవరు ఏ . ప్రసాద్ లను ఏసీపీ అభినందించారు. తదుపరి గంజాయి ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, రవాణా, నిల్వ లేదా వినియోగం చేయడం చట్టరీత్యా నేరమని, అటువంటి చర్యలకు పాల్పడే వారిపై కఠినంగ చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గంజాయి సమాచారం అందించిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయని వారికి తగిన పారితోషికం అందిస్తామని ఏసిపి తెలిపారు.

## తాగునీటి ఎద్దడి లేకుండా పటిష్ట కార్యాచరణ

**• డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**



**ఖమ్మం కార్పొరేషన్, జూలై 23 (జనం సాక్షి) :** రాష్ట్రంలో నెలకొన్న 'ఎల్ నినో' తీవ్ర వాతావరణ పరిస్థితుల వల్ల ఖమ్మం జిల్లా ప్రజలు తాగునీటి ఎద్దడి ఎదుర్కొకుండా పటిష్ట కార్యాచరణ చేపట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఈ దిశగా ప్రజా ప్రభుత్వం అత్యంత కీలకమైన అడుగు వేసింది. జిల్లావాసులకు ఎలాంటి తాగు నీటి ఇబ్బందులు రాకుండా చూడాలని గత సమీక్షా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఆయన ఆదేశాల మేరకు యంత్రాంగం వేగంగా స్పందించి చర్యలు చేపట్టింది.
వేగంగా నీటి తరలింపు భద్రాచలం వద్ద ఉన్న దుమ్ముగూడెం నుంచి రాజీవ్ కాలువ ద్వారా గోదావరి వెనుక జలాలను నాగార్జునసాగర్ మెయిన్ బ్రాంచ్ కెనాల్ ద్వారా నేరుగా వైరా చెరువుకు తరలిస్తున్నారు. గురువారం నాడు ఎన్ఎస్పీ మెయిన్ బ్రాంచ్ కాలువకు వేగంగా వస్తున్న గోదావరి జలాలను డిప్యూటీ సీఎం స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నీటి ప్రవాహాన్ని, తరలింపు ప్రక్రియను సమీక్షించిన ఆయన అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. జిల్లాలోని అన్ని ప్రధాన చెరువులను ఈ గోదావరి జలాలతో త్వరితగతిన నింపాలని ఆదేశించారు.
లినీటి ఎద్దడికి తావులేకుండా జాగ్రత్తలులి ఎల్ నినో ప్రభావం ఎంత ఉన్నప్పటికీ, జిల్లాలో ఏ ఒక్క గ్రామంలోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**ప్రజలకు ఊరట**

ఎల్‌నినో ముప్పు పొంచి ఉన్న వేళ, సాగర్ మెయిన్ బ్రాంచ్ ద్వారా గోదావరి జలాలు వైరా చెరువుకు చేరుతుండటంతో ఖమ్మం జిల్లా ప్రజలకు పెద్ద ఊరట లభించినట్లయింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, ఇర్రిగేషన్ సిఇ శ్రీనివాస రెడ్డి, ఎన్పిడిసిఎల్ ఎస్ఇ శ్రీనివాస చారి, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతికతతో నేర నియంత్రణపై దృష్టి



**సంగారెడ్డి బ్యూరో, జూలై 23 (జనం సాక్షి) :** వార్షిక తనిఖీలలో భాగంగా మల్టీ జోన్ - 2 ఐజీ షానవాజ్ ఖాసిం, ఐపీఎస్. సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయం, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని వివిధ విభాగాల పనితీరును సమీక్షించిన ఆయన, నేరాల నియంత్రణలో ఆధునిక సాంకేతికతను సమర్థంగా వినియోగించాలని అధికారులను ఆదేశించారు. అధిక నేరాలు జరిగే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేయాలని, సైబర్ నేరాల బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాల ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్ పోలీసులు ప్రమాదాల సమయంలో వెంటనే స్పందించాలని ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయం, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసిన ఐజీ, ఉత్తమ పనితీరు కనబరిచిన సిబ్బందిని అభినందించి రివార్డులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, డీటీసీ అదనపు ఎస్పీ శ్రీనివాస్ రావు, సంగారెడ్డి డీఎస్పీ సత్యయ్య గౌడ్, పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్, నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్ రెడ్డి, జహీరాబాద్ డీఎస్పీ సైదా నాయక్, డీసీఆర్బీ డీఎస్పీ సురేందర్ రెడ్డి, సైబర్ సెల్ డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి, ఏఆర్ డీఎస్పీ నరేందర్, వివిధ పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో రోడ్డు భద్రతకు కేంద్రం పెద్దపీట

**• నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో బ్లాక్ స్పాట్ల నివారణకు రూ.1,023 కోట్లు**

**• లోక్ సభలో ఎంపీ అర్వింద్**

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జూలై 23 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు కేంద్ర ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపడుతోందని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్ తెలిపారు. రోడ్డు ప్రమాదాల బ్లాక్ స్పాట్ల నివారణ, రహదారి భద్రతా చర్యలకు సంబంధించి తాను లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ ఇచ్చిన సమాధానంలో కీలక వివరాలు వెల్లడయ్యాయని ఆయన తెలిపారు. తెలంగాణలో గత కొన్నేళ్లలో ప్రమాదాల ఆధారంగా మొత్తం 1,513 యాక్సిడెంట్ బ్లాక్ స్పాట్లు గుర్తించగా, వాటిలో 1,308 బ్లాక్ స్పాట్లకు సంబంధించిన శాశ్వత నివారణ చర్యలు పూర్తయ్యాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించిందని ఎంపీ అర్వింద్ తెలిపారు. మరో 205 బ్లాక్ స్పాట్లలో శాశ్వత నివారణ చర్యలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని చెప్పారు.

**నిజామాబాద్, జగిత్యాల జిల్లాలకు ప్రత్యేక ప్రాధాన్యత**



నిజామాబాద్ జిల్లాలో మొత్తం 78 ప్రమాదకర బ్లాక్ స్పాట్లు గుర్తించగా, వాటిలో 75 ప్రాంతాల్లో నివారణ చర్యలు పూర్తయ్యాయని, మరో 3 ప్రాంతాల్లో చర్యలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని, అదేవిధంగా జగిత్యాల జిల్లాలో మొత్తం 107 ప్రమాదకర బ్లాక్ స్పాట్లు గుర్తించగా, అందులో 99 ప్రాంతాల్లో నివారణ చర్యలు పూర్తయ్యాయని, మరో 8 ప్రాంతాల్లో పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించిందని ఎంపీ తెలిపారు. నిజామాబాద్ పార్లమెంట్ ప్రజల భద్రతకు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు ఇది నిదర్శనమన్నారు. నిజామాబాద్ జిల్లాలో జాతీయ రహదారులపై రోడ్డు భద్రతను మరింత మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని కేంద్రాన్ని కోరుతున్నామని, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి తన వంతు కృషి కొనసాగుతుందని అర్వింద్ తెలిపారు.

**నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో రోడ్డు భద్రతకు కట్టుబడి ఉన్నాం**

నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన రహదారులు, సురక్షితమైన ప్రయాణం అందించడమే తన ప్రధాన లక్ష్యమని ఎంపీ అర్వింద్ అన్నారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి, అక్కడ శాశ్వత పరిష్కారాలు చూపించేందుకు కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం చేస్తామని తెలిపారు. నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో జాతీయ రహదారుల అభివృద్ధి, బ్లాక్ స్పాట్ల నివారణ, వంతెనలు, బైపాస్‌లు, ఇతర రోడ్డు భద్రతా మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సుమారు రూ. 1,023 కోట్లు కేటాయించిందని ఎంపీ అర్వింద్ తెలిపారు. ప్రజల ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా రోడ్డు భద్రతా పనులను మరింత వేగవంతం చేయడానికి కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

## గోదావరి పుష్కరాల్లోపే భద్రాద్రి రామాలయ అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం

**• దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు**

**భద్రాచలం, జూలై 23 (జనంసాక్షి) :** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ అభివృద్ధి, విస్తరణ పనులను గోదావరి పుష్కరాల నాటికే పూర్తి చేసేలా ప్రణాళిక బద్ధంగా పని చేస్తున్నామని రాష్ట్ర దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు వెల్లడించారు. గురువారం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న ఆలయ అభివృద్ధి, విస్తరణ పనులను హనుమంతరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో కొనసాగుతున్న వివిధ నిర్మాణాలు, అభివృద్ధి పనుల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూడడంతో పాటు, నిర్ణీత గడువులో పూర్తి చేసేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పనులు నిర్వహించాలని, ఆలయ ఆధ్యాత్మిక వైభవానికి తగిన విధంగా విస్తరణ పనులను పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు సూచనలు చేశారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ డిసెంబర్‌లో స్వామి వారి ఉత్తరద్వార దర్శనం ఉన్నందున ఉత్తరంవైపు పనులు రాబోయే మూడు నెలల్లో యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయనున్నామని, ఇందుకు సంబంధించి పనులను విభజించి చేపట్టడంతో పాటు డిజైన్‌లో సైతం స్వల్ప మార్పులు చేసామన్నారు. అలాగే ఇప్పుడు చేపట్టే పనులు వందేళ్ల కాలం నిలిచేలా నాణ్యత ప్రమాణాలతో నిర్మాణ పనులు కొనసాగిస్తామని, ఎక్కువ మంది సిబ్బందిని నియమించి నిరంతరం పనులు సాగేలా చూస్తామన్నారు.



అలాగే అభివృద్ధి పనులపై వారానికి ఒకసారి దేవస్థానం ఈవో నివేదిక ఇస్తారని, 15 రోజులకు ఒకసారి రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి స్థాయిలో సమీక్ష, నెలకోసారి మంత్రులస్థాయిలో సమీక్ష నిర్వహించి పనుల పురోగతిని, చేపట్టాల్సిన లక్ష్యాలను నిర్దేశిస్తూ ముందుకు వెళ్తామన్నారు. అదేవిధంగా భద్రాచలంలో అభివృద్ధి పనులు జరిగే ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి హైదరాబాద్ కమీషనరేట్ నుంచి పర్యవేక్షణ చేస్తూ కాంట్రాక్టర్, ఆర్.అండ్.బి. అధికారులతో సమీక్షిస్తామన్నారు. భద్రాచలంలో చేపట్టే పనులు మిగతా ఆలయాల్లో చేపట్టే పనుల మాదిరిగా కాకుండా డిసెంబర్లో ముక్కోటి, ఏప్రిల్‌లో శ్రీరామనవమి, జూన్‌లో గోదావరి పుష్కరాలు ఉన్నందున పనులన్నీ సకాలంలో దైవ నిర్ణయం మేరకు పూర్తి చేయడం జరుగుతుందని వివరించారు. ఆయన వెంట దేవస్థానం ఈవో దామోదరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవీందర్, దేవస్థావం అర్చకులు, ఇంజనీరింగ్ శాఖ అధికారులు, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదవాలి

**• కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**సూర్యాపేట ప్రతినిధి, జూలై 23 (జనంసాక్షి) :** సూర్యాపేట మండల పరిధిలోని ఇమాంపేట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ, నాణ్యమైన విద్య అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులు ఉన్నత ఆశయాలతో చదివి తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని అన్నారు. తనిఖీలో భాగంగా ముందుగా కిచెన్ రూమ్, డైనింగ్ హాల్, వెజిటబుల్ రూమ్, బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు నిల్వ చేసే గదులను పరిశీలించారు. సరుకుల నిల్వ విధానం, పరిశుభ్రత, నిర్వహణ తీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కూరగాయలను, సరుకులను నాణ్యత దెబ్బతినకుండా వెలుతురు తగిలే విధంగా ఎత్తైన ప్రదేశంలో భద్రపరచాలని, గుడ్లను ఎక్కువ కాలం నిల్వ చేయకుండా అవసరానికి అనుగుణంగా స్టాక్ పెట్టుకోవాలని సూచించారు. వంటశాల, భోజనశాల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. అనంతరం పదవ తరగతి గది పరిశీలించిన జిల్లా కలెక్టర్, విద్యార్థులకు కొద్దిసేపు హిందీ పాఠాన్ని బోధించారు. విద్యార్థులతో మమేకమై పాఠ్యాంశాలపై అవగాహన కల్పిస్తూ, చదువుపై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. కంప్యూటర్ ల్యాబ్, ప్లేగ్రౌండ్‌ను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు



విద్యతో పాటు క్రీడలు, కంప్యూటర్ పరిజ్ఞానంలో కూడా అభివృద్ధి సాధించేలా ప్రోత్సహించాలని సూచించారు. ప్లేగ్రౌండ్‌ను విస్తరించాలని విద్యార్థులు కోరగా, కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. విద్యార్థులతో కలెక్టర్ స్వయంగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనం నాణ్యత సంతృప్తికరంగా ఉందని తెలిపారు. మెస్ కమిటీలు రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని, ప్రతిరోజు స్టాక్ వివరాలను నమోదు చేయాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం డైట్, కాస్మొటిక్ చార్జీలను పెంచిన నేపథ్యంలో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. ఏమైనా మైనర్ రిపేర్లు ఉంటే 15 రోజులలో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్.పద్మ, వైస్ ప్రిన్సిపాల్, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## కల్లూరులో మండల కార్యాలయాల సముదాయం నిర్మాణానికి ప్రణాళికలు

**• జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**కల్లూరు, జూలై 23 (జనం సాక్షి) :** ప్రజలకు అందుబాటులో ఒకే ప్రాంగణంలో అన్ని ప్రభుత్వ శాఖలు, సకల సౌకర్యాలతో మండల కార్యాలయాల సముదాయ భవన నిర్మాణానికి ప్రణాళిక తయారు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. కల్లూరు సబ్ కలెక్టర్ కార్యాలయం నందు అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ లతో కలిసి నూతనంగా నిర్మించనున్న సమీకృత మండల కార్యాలయ సముదాయ నిర్మాణం పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. సమీకృత మండల కార్యాలయ సముదాయ భవనాల నిర్మాణ మ్యాప్ లను పరిశీలించి ఆర్ అండ్ బీ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ కల్లూరు మండల స్థాయిలో ప్రజల సౌకర్యార్థం అన్ని కార్యాలయాలు ఒకే చోట అన్ని వసతులతో ఉండే విధంగా నిర్మించాలని, దీనికి తగిన విధంగా ప్రణాళికలు, భవనాలు, కావాలసిన వసతుల డిజైన్ తయారు చేయాలని అన్నారు. మండల స్థాయిలో రెవెన్యూ, పంచాయతీరాజ్, వ్యవసాయ, ఉద్యానవన, విద్యుత్, విద్యాశాఖ, శిశు సంక్షేమం, రిజిస్ట్రేషన్, రోడ్లు భవనాలు, నీటిపారుదల, మిషన్ భగీరథ తదితర శాఖల కార్యాలయాలు ఒకేప్రాంగణంలోపనిచేయనున్నాయి. దీంతో ప్రజలు ఒక పని



కోసం పలుచోట్ల తిరగాల్సిన అవసరం లేకుండా అన్ని ప్రభుత్వ సేవలను ఒకేచోట పొందే అవకాశం కలుగుతుందన్నారు. అంతస్తుల వారీగా కార్యాలయాల ఏర్పాటు చేసి విశాలమైన కాన్ఫరెన్స్ హాల్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, విశాలమైన సమావేశ మందిరాలు, ఆధునిక కార్యాలయ గదులు, ఆధునిక సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని శాఖలు ఒకే ప్రాంగణంలో పనిచేయడం వల్ల ప్రభుత్వ అధికారుల మధ్య సమన్వయం మెరుగుపడి, ఫైళ్ల పరిష్కారం వేగవంతం కానుందని కలెక్టర్ తెలిపారు. సమీకృత మండల కార్యాలయ సముదాయం నిర్మాణం పూర్తయిన అనంతరం మండల ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ కానున్నాయి. ప్రజల సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు పారదర్శకమైన, సమర్థవంతమైన పరిపాలన అందుబాటులోకి వస్తుంది. ప్రభుత్వ సేవల నాణ్యతను పెంచుతూ, ప్రజాకేంద్రిత పరిపాలనకు ఈ ప్రాజెక్టు ఆదర్శంగా నిలవనుందని ధీమా వ్యక్తం చేశారు. మండల కార్యాలయం నిర్మించిన తర్వాత నిర్వహణ కూడా సక్రమంగా జరిగేలా ప్రణాళిక తయారు చేసుకోవాలని సూచించారు. అంతర్గంగా రోడ్డు వేసేలా ప్లాన్ చేసుకోవాలని అన్నారు. ఫైర్ సేఫ్టీ సూచనలు పాటిస్తూ నిర్మాణాలు జరగాలని అన్నారు. మండల కార్యాలయ సముదాయం అవసరమైన విద్యుత్ సోలార్ ప్యానెల్ ఏర్పాటు సమకూర్చుకునేలా ప్లాన్ లో భాగస్వామ్యం చేయాలని అన్నారు. సమీకృత మండల కార్యాలయ సముదాయం వద్ద అవసరమైన పార్కింగ్ సౌకర్యం ఉండేలా చూడాలని కలెక్టర్ సూచించారు. మిషన్ భగీరథ గ్రిడ్ ద్వారా త్రాగు నీటి సరఫరా కనెక్షన్ తీసుకోవాలని అన్నారు. ప్రతి ఫ్లోర్ లో ప్రజల వెయిటింగ్ ఏరియా ఉండాలని, అక్కడ త్రాగు నీటి ట్యాప్ ఉండాలని అన్నారు. కార్యాలయాల్లో ఫైల్స్ పెట్టేందుకు స్టోరేజ్ అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ ఎస్ఇ యుగేందర్ రావు, హౌసింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, డిఇ భగవాన్, ఏఇ కోటేశ్వరరావు, పిఆర్ డిఈ రాంబాబు, తాసిల్దార్, బ్రహ్మేశ్వర రావు, ఇన్చార్జి సబ్ రిజిస్టర్ రాజేష్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణ ఫ్లై ఓవర్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి



**సూర్యాపేట ప్రతినిధి, జూలై 23 (జనంసాక్షి) :** సూర్యాపేట జిల్లా కేంద్రంలో జాతీయ రహదారి 65కు సంబంధించి జరుగుతున్న రోడ్డు విస్తరణ, ఫ్లై ఓవర్ నిర్మాణ పనులను గురువారం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ సంయుక్తంగా పరిశీలించారు. జాతీయ రహదారుల అథారిటీ అధికారులతో కలిసి వారు క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని నిశితంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారి విస్తరణ పనులను నిర్దేశిత గడువులోగా, అత్యంత వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన, సౌకర్యవంతమైన రవాణా వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రయాణికుల రక్షణే ధ్యేయంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రమాదాల నివారణకు అవసరమైన చోట్ల సైన్ బోర్డులు, రక్షణ కంచెలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాతీయ రహదారుల అథారిటీ అధికారులు, జిల్లా అధికారులు, మరియు పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## నాలుగో రోజూ నష్టాల్లోనే..

**ముంబయి,జనంసాక్షి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాలతో ముగిశాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, క్రూడా యిల్ ధరలు పెరగడం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ముఖ్యంగా ఫార్మా, ఐటీ, బ్యాంకింగ్ స్టాక్స్ అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. దీంతో వరుసగా నాలుగో రోజూ మార్కెట్ సూచీలు నష్టాల బాటపట్టాయి. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.3 లక్షల కోట్లు క్షీణించి రూ.477 లక్షల కోట్లకు చేరింది. ఉదయం సెన్సెక్స్ 76,515.10 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,755.05) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా సూచీ నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 76,151.98 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి సెన్సెక్స్ 363.66 పాయింట్లు కోల్పోయి 76,391.39 వద్ద ముగిసింది. నిఫ్టీ 126.65 పాయింట్లు పతనమై 23,869.60 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 96.57గా ఉంది. సెన్సెక్స్ 30లో ఆదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్, ఇండిగో, యాక్సిస్ బ్యాంక్, రిలయన్స్, టాటాస్టీల్ షేర్లు ప్రధానంగా నష్టాలను చవిచూశాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, టీసీఎస్, ఎటర్నల్, హెచ్‌సీఎల్, బజాజ్ ఫిన్‌సర్వ్, కోటక్ బ్యాంక్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్‌క్రూడ్ 97.95 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్సు 4,088.87 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



### ఇన్ఫోసిస్ తదుపరి సీఈఓగా
## ఆశిష్ కుమార్ దాస్

**న్యూఢిల్లీ:** దేశంలోనే రెండో అతిపెద్ద ఐటీ సేవల సంస్థ అయిన ఇన్ఫోసిస్ నాయకత్వంలో కీలక మార్పు చోటుచేసుకుంది. ఇన్ఫోసిస్ కొత్త సీఈఓగా ఆశిష్ కుమార్ దాస్‌ను నియమిస్తూ బోర్డు నిర్ణయం తీసుకుంది. 2027 ఏప్రిల్ 1 నుంచి ఈ నియామకం అమల్లోకి రానుంది. ప్రస్తుతం కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, మేనేజింగ్ డైరెక్టర్‌గా కొనసాగుతున్న సలీల్ పరేఖ్ అప్పటి వరకు బాధ్యతల్లో కొనసాగుతారు. కంపెనీ చరిత్రలో సుదీర్ఘకాల నాన్ ఫౌండర్ సీఈవోగా వ్యవహరించిన వ్యక్తిగా సలీల్ నిలవనున్నారు. 2018లో ఇన్ఫోసిస్‌లో చేరిన సలీల్ పరేఖ్ ప్రస్తుత ఐదేళ్ల టర్మ్ 2027 మార్చి 31తో ముగియనుంది. "ఐటీ ఇండస్ట్రీ గణనీయమైన మార్పులు దశలోకి ప్రవేశిస్తోంది. ఈ క్రమంలో కంపెనీని నడిపించే సామర్థ్యంతో పాటు, ఇన్ఫోసిస్‌ను నిలబెట్టిన విలువలు, వినియోగదారుల విశ్వాసాన్ని కాపాడే నమ్మకమైన వ్యక్తి తదుపరి సీఈఓగా ఉండాలని బోర్డు భావించింది. ఇందులో భాగంగా తదుపరి సీఈఓగా సంస్థలోని నాయకుడైన ఆశిష్ కుమార్ దాస్‌ను నియమించడం పట్ల బోర్డు ఆనందంగా ఉంది" అని ఇన్ఫోసిస్ బోర్డు ఛైర్మన్ నందన్ నీలేకని ప్రకటించారు. 9 ఏళ్ల పాటు కంపెనీకి సేవలందించిన సలీల్ పరేఖ్‌కు బోర్డు తరఫున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.



### ఏఐ ఎఫెక్ట్..
**అమెజాన్, ఉబర్‌లో లేఆఫ్‌లు**




డెస్క్: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కారణంగా టెక్నాలజీ కంపెనీల్లో ఉద్యోగుల తొలగింపు కొనసాగుతూనే ఉంది. తాజాగా అమెరికాకు చెందిన ప్రముఖ కంపెనీలైన అమెజాన్, ఉబర్ ఉద్యోగులకు లేఆఫ్‌లు ప్రకటించాయి. ఉబర్‌లో 10 శాతం మందిని తొలగిస్తున్నట్లు కంపెనీ పేర్కొనగా.. ఎంతమందిని తొలగిస్తున్నదీ అమెజాన్ వెల్లడించలేదు. అమెజాన్ కొన్ని నెలల క్రితమే వివిధ విభాగాల్లో సుమారు 16 వేల మంది ఉద్యోగులను తొలగించింది. ఈ సారి ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ విభాగంలో లేఆఫ్‌లు ప్రకటించింది. తర్వాతి తరం ఏఐ సిస్టమ్స్‌ను డెవలప్ చేయడం ఈ విభాగం బాధ్యత. వనరులను సమర్థంగా వినియోగించుకోవడం, వినియోగదారులకు మంచి విలువను అందించడంలో భాగంగా ఈ లేఆఫ్‌లు చేపడుతున్నట్లు అమెజాన్ పేర్కొంది. ఏఐ మోడళ్లపై పెద్దమొత్తంలో నిధులు గుమ్మరిస్తున్న వేళ అమెజాన్ ఈ ప్రకటన చేయడం గమనార్హం. మరోవైపు ప్రముఖ రైడ్-హెయిలింగ్ సంస్థ ఉబర్ టెక్నాలజీస్.. తన కస్టమర్ సర్వీస్ విభాగంలో 10 శాతం ఉద్యోగులను తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఈ సేవల్లో ప్రక్రియను సులభతరం చేయడం, సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యంగా ఈ లేఆఫ్‌లు చేపడుతున్నట్లు పేర్కొంది. తొలగించిన ఉద్యోగుల స్థానంలో కస్టమర్లతో ఏఐ సంప్రదింపులు జరపనుంది. ఒకప్పుడు కస్టమర్ సర్వీస్ విభాగం పూర్తిగా మనుషులతో నడిచేది. జనరేటివ్ ఏఐ అందుబాటులోకి వచ్చాక ఈ విభాగంలో ఉద్యోగాలు చాలా వరకు ఏఐతో భర్తీ అయ్యాయి.

### ఐఫోన్ ధరలకు రెక్కలు..

**న్యూఢిల్లీ:** యాపిల్ ఐఫోన్ కొందామని చూస్తున్నవారికి చేదువార్త ఐఫోన్ 17పై ధరలు పెంచేందుకు యాపిల్ సిద్ధమవుతున్నట్లు సమాచారం. మెమొరీ చిప్‌ల ధరల పెరుగుదల వల్ల ఐప్యాడ్స్, మ్యాక్స్, మ్యాక్‌బుక్స్ ధరలను ఇటీవలే భారీగా పెంచింది. ఐఫోన్ ధరల పెంపు మాత్రం చేపట్టలేదు. ఆగస్టు తొలి వారం నుంచి ఐఫోన్ 17 ధరలు భారీగా పెరగనున్నాయని సమాచారం. ఈ మేరకు టిప్‌స్టర్ అభిషేక్ యాదవ్ ఎక్స్‌లో పోస్టు చేశారు. ధరల పెంపు గురించి ఇప్పటికే ఐప్లానెట్ డీలర్లకు యాపిల్ సమాచారం ఇచ్చిందని పేర్కొన్నారు. యాపిల్ ఐఫోన్ 17 ప్రస్తుతం ప్రారంభ ధర రూ.82,990 ఉండగా.. ఆగస్టు తొలివారంలో రూ.94,990కు చేరనుందని సమాచారం. అంటే ఏకంగా రూ.12 వేలు పెరగనుందని అభిషేక్ పేర్కొన్నారు.


### శాంసంగ్ జడ్ ఫోల్డ్ 8 ఫోన్లు..
### ధరలు ఎలా ఉన్నాయంటే..



**లండన్:** శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ తన గెలాక్సీ జడ్ సిరీస్‌లో 3 కొత్త ఫోన్లను విడుదల చేసింది. ఆండ్రాయిడ్ 17 ఓఎస్‌తో, మరింత పల్చటి, తేలికపాటి, పెద్ద డిస్‌ప్లేతో జడ్ ఫోల్డ్ 8 అల్ట్రా, జడ్ ఫోల్డ్ 8, జడ్ ఫ్లిప్ 8 స్మార్ట్‌ఫోన్లను ఆవిష్కరించింది. జెమినై ఏఐ ఇంటలిజెన్స్ ఫీచర్లతో ఈ ఫోన్లను తీసుకొచ్చింది. జడ్ ఫ్లిప్8ను కదులుతూ ఉన్న సమయంలోనూ త్వరిత ఇంటరాక్షన్స్, సెల్ఫ్ ఎక్స్‌ప్రెషన్ కోసం డిజైన్ చేశారు. ఏఐ ఆధారిత ఫ్లెక్స్‌విండో ఇందుకు వీలు కల్పిస్తుంది. 7 నుంచి మన విపణిలో లభ్యం: శాంసంగ్ జడ్8 సిరీస్ ఫోన్లు, మన మార్కెట్లో ఆగస్టు 7 నుంచి లభ్యమవుతాయి. బుధవారం నుంచే మొదలయ్యే ప్రీఆర్డరులో అప్‌గ్రేడ్ ఆఫర్ కింద రూ.10,000 వరకు, రూ.9,000 బ్యాంక్/యూపీఐ క్యాష్ బ్యాక్ ఆఫర్ పొందొచ్చు. డౌన్ పేమెంట్ లేకుండా 30 నెలల నో కాస్ట్ ఈఎమ్ఐ సదుపాయాన్నీ వినియోగించుకోవచ్చు.

### వాట్సప్ కొత్త ఫీచర్లు
**చాట్‌లోనే పీడీఎఫ్ ఎడిట్.. ఐప్యాడ్‌లో నేరుగా లాగిన్**

ప్రముఖ మెసేజింగ్ ఫ్లాట్‌ఫామ్ వాట్సప్ సరికొత్త ఫీచర్లను తీసుకొచ్చింది. వాట్సప్‌లోనే పీడీఎఫ్ ఎడిట్, మ్యూజిక్ ప్లాట్‌ఫామ్స్‌ను నేరుగా స్టేటస్, ఐప్యాడ్‌లోనూ వాట్సప్‌ను వినియోగించుకునేలా కొత్త సదుపాయాలు తీసుకొచ్చింది. వినియోగదారుల అవసరాలకు తగ్గట్టు యాప్‌ను తీర్చిదిద్దడంలో భాగంగా మెటా ఈ కొత్త ఫీచర్లను లాంచ్ చేసింది. వాట్సప్ తీసుకొచ్చిన ఫీచర్లలో ముఖ్యమైనది పీడీఎఫ్ ఎడిట్. ఇప్పటి వరకు వాట్సప్‌లో ఏదైనా డాక్యుమెంట్ వస్తే దాన్ని డౌన్‌లోడ్ చేసుకుని, థర్డ్‌పార్టీ యాప్ ద్వారా తెరవాల్సి వచ్చేది. ఇటీవల వాట్సప్‌లోనే ఓపెన్ అయ్యే సదుపాయాన్ని తీసుకొచ్చింది. తాజాగా అడోబ్‌తో కలిసి ఎడిట్ ఫీచర్‌నూ జోడించింది. దీనివల్ల థర్డ్ పార్టీ యాప్స్ వాడాల్సిన అవసరం లేకుండా వెబ్/డెస్క్‌టాప్ వినియోగదారులు పీడీఎఫ్‌ను ఎడిట్ చేసుకోవచ్చు. ఐప్యాడ్ యూజర్లకు వాట్సప్‌ను మెటా మరింత చేరువ చేసింది. ఇంతకుముందు ప్రైమరీ డివైజ్‌గా స్మార్ట్‌ఫోన్ ఉండేది. ఐప్యాడ్‌లో వాట్సప్‌కు లింక్ చేసుకునే ఆప్షన్ మాత్రమే ఇచ్చారు. ఇకపై ఐప్యాడ్‌ను వాట్సప్ ప్రైమరీ డివైజ్‌గా వినియోగించుకోవచ్చు. అంటే నేరుగా ఐప్యాడ్‌లోనే వాట్సప్‌ను లాగిన్ అవ్వొచ్చన్నమాట. అకౌంట్ కూడా క్రియేట్ చేయొచ్చు. యాపిల్ మ్యూజిక్, స్పాటిఫై వంటి మ్యూజిక్ ప్లాట్‌ఫాంలో మనకు నచ్చిన పాటలను ఇకపై వాట్సప్ స్టేటస్‌లో షేర్ చేయొచ్చు. కార్‌ప్లే, ఆండ్రాయిడ్ ఆటోప్లే వినియోగదారులు కూడా ఇకపై వాట్సప్‌ను నేరుగా సెట్ చేసుకోవచ్చు. స్మార్ట్‌ఫోన్ అవసరం లేకుండానే మెసేజ్‌లు చేయడం, కాల్స్ మాట్లాడటం, కాల్ హిస్టరీ చూడటం వంటి సదుపాయాలను వినియోగించుకోవచ్చు. ఈ కొత్త ఫీచర్లను ఇప్పటికే రోల్ అవుట్ చేసినట్లు మెటా తన బ్లాగ్ పోస్టులో పేర్కొంది. దశలవారీగా యూజర్లందరికీ అందుబాటులోకి రానున్నాయి.




### గుడ్ల ధరలు


| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**
హైదరాబాద్

| ₹ 1,54,928 | ₹ 1,69,014 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 2,45,000

## గూగుల్‌కు భారీ జరిమానా




**న్యూఢిల్లీ:** అమెరికా టెక్ దిగ్గజం గూగుల్‌కు యూరోపియన్ యూనియన్ భారీ జరిమానా విధించింది పోటీదారులను అణచివేయడానికి తన ఆధిపత్యాన్ని దుర్వినియోగం చేస్తోందని ఈయూ యాంటీ ట్రస్ట్ రెగ్యులేటర్ పేర్కొంది. గూగుల్‌కు 890 మిలియన్ యూరోల (1 బిలియన్ డాలర్ల) జరిమానా విధించింది. భారత కరెన్సీలో సుమారు రూ.9,655 కోట్లు చెల్లించాలని ఆదేశించింది. ప్రత్యర్థులకు నష్టం కలిగించేలా గూగుల్ తన ప్లేస్టోర్, సెర్చ్ ఇంజిన్‌లను ఉపయోగించుకుని వినియోగదారులను తమ ఉత్పత్తుల వైపు మళ్లిస్తున్నట్లు ఈయూ కమిషన్ పేర్కొంది. సెర్చ్ ఇంజిన్‌లో తన సొంత షాపింగ్, హోటల్స్, ట్రాన్స్‌పోర్ట్, స్పోర్ట్స్ వంటి సేవలు ఎక్కువ దర్శనమిచ్చేలా గూగుల్ ప్రయత్నిస్తోందంటూ ఆరోపించింది. ఇందుకు గానూ డిజిటల్ మార్కెటింగ్ చట్టం కింద 460 మిలియన్ యూరోల ఫైన్ విధించింది. పోటీదారులు అందించే చౌకైన సబ్‌స్క్రిప్షన్ డీల్స్ వైపు యూజర్లు మళ్లకుండా థర్డ్ పార్టీ యాప్ డెవలపర్లను నియంత్రిస్తోందని పేర్కొంటూ మరో 430 మిలియన్ యూరోల జరిమానా విధించింది. ఈయూ విధించిన జరిమానాపై గూగుల్ స్పందించింది. నియంత్రణ అనేది ఉత్పత్తులను మెరుగుపరచాలి గానీ, వాటిని మరింత దిగజార్చకూడదని పేర్కొంది. నిబంధనల్లో భాగంగా యూరోపియన్లు ఇష్టపడే హోటల్స్, విమానాలు, రెస్టారెంట్స్ వివరాలను కూడా రియల్ టైం సెర్చ్ నుంచి తొలగిస్తున్నామని తెలిపారు. రెండు దశాబ్దాల్లో యూరోపియన్ యూనియన్ గూగుల్‌పై 10.38 బిలియన్ యూరోలకు పైగా జరిమానాలు విధించడం గమనార్హం.

## నెతన్యాహును అరెస్టు చేయండి
**అమెరికా సర్కారుకు మమ్దానీ విజ్ఞప్తి**



**న్యూయార్క్:** ప్రపంచ యుద్ధనేరాల అత్యున్నత కోర్టు (ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు) ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు వ్యతిరేకంగా వెలువరించిన అరెస్టు వారంట్‌ను అమలు చేయాలని న్యూయార్క్ నగర మేయర్ జోహ్రాన్ మమ్దానీ అమెరికా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అరెస్టు వారంట్ అమలుచేయడం తమ పరిధిలో లేని విషయమని ఆయన ఒక వీడియో సందేశంలో పేర్కొన్నారు. ఇజ్రాయెల్ ప్రధానిని ఒక యుద్ధ నేరస్థుడిగా మమ్దానీ అభివర్ణించారు. "వారంట్‌ను అమలు చేసి నెతన్యాహును అరెస్టు చేసేందుకు కావాల్సిన స్వతంత్ర అధికారం మాకు లేదన్నది సుస్పష్టం" అని మమ్దానీ తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. అయితే ఆ అధికారం అమెరికా సమాఖ్య ప్రభుత్వానికి ఉందని, అంతర్జాతీయ నేరాల న్యాయస్థానంలో సభ్యత్వం పొంది ప్రభుత్వం నెతన్యాహుపై జారీ అయిన వారంట్‌ను అమలు చేయాలని ఆయన కోరారు.

## క్రాష్ టెస్టులో మారుతీ బ్రెజ్జాకు 5 స్టార్ రేటింగ్



ప్రముఖ కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ ఇండియా త్వరలో లాంచ్ చేయనున్న బ్రెజ్జా భద్రత విషయంలో మెరుగైన రేటింగ్ పొందింది. భారత్ ఎన్‌క్యాప్ క్రాష్ టెస్టులో 5 స్టార్ రేటింగ్ సాధించిందని కంపెనీ తెలిపింది. అడల్ట్, చైల్డ్ ఆక్యుపెంట్ ప్రొటెక్షన్ రెండింట్లోనూ మెరుగైన రేటింగ్ సాధించిందని పేర్కొంది. ఈ మేరకు కంపెనీ గురువారం ఓ ప్రకటన విడుదల చేఇంది. జులై 24న భారత మార్కెట్‌లోకి కొత్త వెర్షన్ బ్రెజ్జా కాంపాక్ట్ ఎస్‌యూవీ ఎంట్రీ ఇవ్వనుంది. బ్రెజ్జా 5 స్టార్ రేటింగ్ పొందడం తమ వాహనాలపై వినియోగదారులకు ఉన్న నమ్మకాన్ని మరింత పెంచుతుందని మారుతీ సుజుకీ ఇండియా లిమిటెడ్ ఎండీ అండ్ సీఈఓ హిసాషి టకేయుచి పేర్కొన్నారు. తమ ఉత్పత్తుల్లో భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. మారుతీ సుజుకీకి చెందిన డిజైర్, విక్టోరిస్, ఇన్‌విక్టో, ఇ-విటారా ఇప్పటికే 5 స్టార్ రేటింగ్ పొందాయి. తాజాగా బ్రెజ్జా వాటి సరసన చేరింది. కాంపాక్ట్ ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో 2016 నుంచి ఎక్కువగా అమ్ముడవుతున్న మోడళ్లలో మారుతీ సుజుకీ బ్రెజ్జా ఒకటిగా నిలుస్తోంది.

## భారత సంతతి విద్యార్థి అంకురానికి అమెరికాలో అవార్డు

హోస్టన్: భారత సంతతికి చెందిన ఏరోస్పేస్ ఇంజినీరింగ్ విద్యార్థి అక్కు కుమార్ నేతృత్వంలోని ఏవియేషన్ టెక్నాలజీ అంకుర సంస్థ యారో అనాలటిక్స్‌కు అమెరికాలో అవార్డు లభించింది. విమాన బోర్డింగ్ గేట్‌ల వద్ద, లగేజీ వివాదాలకు చెక్ పెట్టడం కోసం ఏఐ ఆధారిత వ్యవస్థను రూపొందించినందుకు గాను.. టెక్సాస్ ఏఅండ్ఎం ఇన్నోవేషన్ నిర్వహించిన టెక్సాస్ ఏఅండ్ఎం న్యూవెంచర్స్ కాంపిటీషన్‌లో 11,000 డాలర్ల బహుమతిని ఈ అంకురం దక్కించుకుంది. అనుభవజ్ఞులైన వ్యవస్థాపకులు, అధ్యాపకులు, పరిశ్రమ పరిశోధకులతో పోటీపడిన అంకురాల్లో, కేవలం ఇద్దరే విద్యార్థులతో కూడినది ఇదీ. మొత్తం 125 దరఖాస్తుదార్లలో ఎలివేటర్ పిచ్ విభాగంలో యారో అనాలటిక్స్ నాలుగో స్థానంలో నిలిచింది. ఈ అంకుర సంస్థ తయారుచేసిన ఈజెడ్ బోర్డ్ అనే పరికరం.. బోర్డింగ్ గేట్ల వద్ద సీలింగ్‌కు అమర్చిన ఏఐ కెమేరాలను ఉపయోగించి, ప్రయాణికుల వద్ద ఉన్న హ్యాండ్ బ్యాగేజీ, విమానంలోని ఓవర్‌హెడ్ బిన్ ఖాళీ స్థలాన్ని రియల్ టైంలో పర్యవేక్షిస్తుంది. దీని ద్వారా చివరి నిమిషంలో అనూహ్యంగా లగేజీని గేట్ వద్ద చెక్-ఇన్‌లోకి మార్చాల్సిన అవసరం పడదు. 'కొత్త ఉత్పత్తి డిజైన్ చేసేందుకు, ఈ అవార్డు డబ్బు సహాయపడుతుంద'ని అక్కు కుమార్ తెలిపారు.






## 100 నగరాలకు బీపీసీఎల్ ఎల్‌పీజీ సిలిండర్లు

**న్యూఢిల్లీ:** ప్రభుత్వరంగ చమురు సంస్థ భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ తన 10 కేజీల ఎల్‌పీజీ సిలిండర్ల సేవలను మరిన్ని నగరాలకు విస్తరించనుంది. ఆగస్టు 15 నాటికి 24 రాష్ట్రాల్లోని 100 నగరాల్లో ఈ సిలిండర్లను అందుబాటులో తేనుంది. తొలి త్రైమాసిక ఫలితాల అనంతరం నిర్వహించిన ఎర్నింగ్స్ కాన్ఫరెన్స్‌లో సంస్థ ఈ విషయాన్ని వెల్లడించింది. ఎల్‌పీజీ కనెక్షన్‌ను తక్షణమే అందించడంతో పాటు గ్యాస్ సిలిండర్‌ను త్వరితగతిన డెలివరీ చేసే విధంగా భారత్ గ్యాస్ ఇటీవల 'లైట్ జిప్' పేరిట ప్రీమియం ఎల్‌పీజీ సర్వీసును ప్రారంభించింది. తక్కువ బరువు కలిగి, తుప్పుపట్టకుండా ఉండేలా ఈ సిలిండర్లను రూపొందించారు. ఈ సిలిండర్లను తరలించడం కూడా సులువు. మరో ప్రభుత్వరంగ సంస్థ హెచ్‌పీసీఎల్ ఇటీవల 'నవ్య' పేరిట 10 కేజీ సిలిండర్ సేవలను లాంచ్ చేసింది. ఈ నేపథ్యంలో బీపీసీఎల్ కూడా ఎక్స్‌ప్రెస్ డెలివరీ సేవలకు శ్రీకారం చుట్టింది. ఆగస్టు 15 నాటికి 100 నగరాలకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. మరోవైపు, బీపీసీఎల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27) ఏప్రిల్- జూన్ త్రైమాసికంలో రూ.3,962.13 కోట్ల నికర నష్టాన్ని చవిచూసింది. గత 15 త్రైమాసికాల్లో కంపెనీకి ఇదే తొలి నష్టం. 2025-26 ఇదే త్రైమాసికంలో కంపెనీ రూ.6,123.93 కోట్ల నికరలాభం ఆర్జించింది. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ముడిచమురు ధర 50% వరకు పెరిగినా.. దేశీయంగా పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ రిటెయిల్ ధరలను ఆ స్థాయిలో పెంచకపోవడమే ఈసారి నష్టాలకు కారణమని కంపెనీ తెలిపింది. సమీక్షిస్తున్న త్రైమాసికంలో గృహ వినియోగ వంటగ్యాస్ సిలిండర్ల విక్రయాలపైనే కంపెనీకి రూ.3,485.22 కోట్ల నష్టం వాటిల్లింది.

## మాదకద్రవ్యాల అక్రమ రవాణా.. అమెరికాలో భారతీయుడి అరెస్ట్




**వాషింగ్టన్:** కెనడా కేంద్రంగా నేర కార్యకలాపాలకు పాల్పడుతోన్న అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాలపై ఎఫ్‌బీఐ చర్యలు చేపట్టింది. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, పంపిణీ, ఎగుమతికి సంబంధించిన ఆరోపణలపై లారెన్స్ బిష్ణోయ్, జగ్గు భగవాన్‌పురియా, రవీందర్ ధాండా గ్యాంగ్‌లను లక్ష్యంగా చేసుకుని ఆపరేషన్ హార్డ్ బాల్ పేరుతో దాడులు నిర్వహించింది. ఇందులో భాగంగా భారత్‌కు చెందిన హర్మన్‌వీర్ సింగ్‌ను కాలిఫోర్నియాలో అరెస్ట్ చేసినట్లు ఎఫ్‌బీఐ వెల్లడించింది. ఎఫ్‌బీఐ వివరాల ప్రకారం.. రవీందర్ ధాండా ముఠా అమెరికా, కెనడా, మెక్సికో దేశాలకు భారీ మొత్తంలో కొకైన్, ఇతర మాదకద్రవ్యాలను అక్రమంగా రవాణా చేస్తోన్నట్లు దర్యాప్తులో తేలింది. ఈ ముఠాలో సభ్యుడైన హర్మన్‌వీర్ సింగ్‌పై జూన్ 23న అమెరికా ఫెడరల్ కోర్టు అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. ఈ క్రమంలోనే తాజాగా అతడిని అధికారులు అరెస్ట్ చేశారు. ఇక, ఈ నెల ప్రారంభంలో అమెరికా, కెనడా, ఐరోపా దేశాలు సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో.. అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాలకు చెందిన 24 మందిని అరెస్ట్ చేశాయి. వీరిలో 11 మందిని కాలిఫోర్నియాలోనే పట్టుకుంది.




## 20 వేల మంది ఫ్రెషర్లకు అవకాశం
**వేతన పెంపుపై ఇన్ఫీ కీలక ప్రకటన..**

**న్యూఢిల్లీ:** ప్రముఖ ఐటీ సేవల సంస్థ ఇన్ఫోసిస్ వేతన పెంపుపై కీలక ప్రకటన చేసింది. ఈ ఏడాది చివర్లో వేతన పెంపు చేపట్టనుంది. అక్టోబర్, జనవరి మధ్య మూడు దశల్లో ఈ పెంపు ఉంటుందని సీఈఓ సలీల్ పరేఖ్ తెలిపారు. త్రైమాసిక ఫలితాల సందర్భంగా నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఈ విషయాన్ని వెల్లడించారు. "అధిక శాతం ఉద్యోగులకు అక్టోబర్ నెలలో వేతనాల్లో పెరుగుదల ఉంటుంది. సీనియర్ ఉద్యోగుల వేతనాలు జనవరిలో పెరుగుతాయి" అని సలీల్ పరేఖ్ అన్నారు. ఎంత శాతం పెంచేదీ మాత్రం వెల్లడించలేదు. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 4 వేల మంది ఫ్రెషర్లను నియమించుకున్నట్లు ఇన్ఫోసిస్ తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 20 వేల మంది ఫ్రెషర్లను క్యాంపస్ నియామకాల ద్వారా నియమించుకునేందుకు కంపెనీ కట్టుబడి ఉందని పేర్కొంది. సమీక్షా త్రైమాసికం ముగిసే సమయానికి ఇన్ఫీలో 3.28 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. అట్రిషన్ రేటు 13 శాతంగా ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో ఇన్ఫోసిస్ రూ.7,769 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.6,921 కోట్ల నికర లాభంతో పోలిస్తే 12.3 శాతం వృద్ధి నమోదైంది. క్రితం త్రైమాసికంలో నమోదైన రూ.8501 కోట్ల లాభంతో పోల్చినప్పుడు లాభం 8.6 శాతం తగ్గుముఖం పట్టింది. కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయం 14 శాతం వృద్ధితో రూ.48,211 కోట్లుగా నమోదైంది.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
24 జూలై 2026

# విద్యార్థులు లక్ష్యసాధనతో ముందుకు సాగాలి

- సాన్వి నవోత్సవం - 2026ను ప్రారంభించిన మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్ బ్యూరో, జూలై 23 (జనంసాక్షి) :** విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతను అలవర్చుకుని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్‌లోని సాన్వి జూనియర్ కాలేజ్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో గురువారం రోజు కొత్తపల్లి రోడ్, రేకుర్తిలోని స్వాగత్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన “నవోత్సవం – 2026” సాంస్కృతిక వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... నేటి విద్యార్థులే రేపటి భారత నిర్మాణ శిల్పులని అన్నారు. చదువుతో పాటు వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి, సేవా దృక్పథం పెంపొందించుకోవాలని సూచించారు. సాన్వి జూనియర్ కాలేజ్, డిఫెన్స్ అకాడమీ విద్యార్థులను పోటీ ప్రపంచానికి అనుగుణంగా తీర్చిదిద్దుతూ విద్యా, క్రీడా, సాంస్కృతిక రంగాల్లో ప్రోత్సహించడం అభినంద నీయమని కొనియాడారు. లయన్స్ క్లబ్ నాయకుడు లయన్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని, సేవాభావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. సామాజిక సేవకుడు నాగేశ్వర్ మాట్లాడుతూ... యువత సమాజాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని అన్నారు.

కళాశాల చైర్మన్ అరంశెట్టి మునీందర్ మాట్లాడుతూ... విద్యార్థులను కేవలం పరీక్షల్లో ఉత్తీర్ణులుగా తీర్చిదిద్దడమే కాకుండా దేశానికి సేవ చేసే బాధ్యతగల పౌరులుగా తయారు చేయడమే సాన్వి జూనియర్ కాలేజ్, డిఫెన్స్ అకాడమీ లక్ష్యమని అన్నారు. నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, దేశభక్తిని పెంపొందించేలా ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. “కం టూ లెర్న్ గో టూ సర్వ్ అమలు చేస్తూ, విద్యార్థులను పోటీ ప్రపంచానికి సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు నవోత్సవం వంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ఆయన అన్నారు. కార్యక్రమం లో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నా యి. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అతిథులు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో శేఖర్, గుంటుపల్లి స్వామి, వంశీధర్ రెడ్డి, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతులకు గ్రామసభల ద్వారా
# ఎల్‌నినో ప్రభావంపై అవగాహన కల్పించాలి

- జలసిరి పనులను వేగవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలి



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, జూలై 23 (జనం సాక్షి);** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో జిల్లాలోని రైతులందరికీ గ్రామసభల ద్వారా స్పష్టమైన అవగాహ న కల్పించాలని,ప్రత్యామ్నాయ పంటలు సాగుచేసేలా ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. గురువారం ఉదయం ఎల్‌నినో ప్రభావంపై రైతులతో గ్రామసభలు నిర్వహించడం, జలసిరి కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న పనుల గ్రౌండింగ్,పురోగతి, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయడంపై వ్యవసాయ, పంచాయతీ రాజ్, గృహ నిర్మాణ శాఖల అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఆయా కార్యక్రమాల పురోగతిని మండలాల వారీగా తెలుసు కుని, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు.ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా రైతు గ్రామ సభల ద్వారా జిల్లాలోని రైతులందరికీ ప్రత్యామ్నాయ పంటల సాగు,వర్షపాతం లోటు, భూగర్భ జలాల తగ్గుదల, రిజర్వాయర్లలో వర్షం నీటి సంరక్షణపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు.ప్రతి మండల ప్రత్యేక అధికారి వారానికి కనీసం రెండు గ్రామసభలకు హాజరై రైతులతో నేరుగా మాట్లాడాలని సూచించారు. ఫామ్ పాండ్లు, బోర్‌వెల్ రీచార్జ్,ఇతర అన్ని నీటి సంరక్షణ పనులను పెద్ద సంఖ్యలో గ్రౌండింగ్ చేసి,వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని సూచించారు.

మండలాల వారీగా పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమన్వ యం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో పనులు వేగంగా జరిగేలా చూడాలని, జలసిరి పనులకు సంబంధించి నూతన ప్రతిపాదనలను త్వరితగతిన సమర్పించాలని కలెక్టర్ సూచించారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిని వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.మండలాల వారీగా మంజూరైన ఇండ్లు, నిర్మాణాల ప్రస్తుత స్థితిగతులు,పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మొదటి దశలో మంజూరైన ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్ళాలని, రెండవ విడతలో అర్హులైన, ఇండ్లు నిర్మించుకునేందుకు ఆసక్తిగా ఉన్న లబ్ధిదారులకు ఇండ్లు మంజూరు చేయాలని ఆదేశించారు.ముఖ్యంగా గుడిసెలు,రేకుల ఇళ్లలో నివసిస్తున్న అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు సమస్యలు ఎదురైతే సంబంధిత అధికారులు సమన్వయం చేసుకుంటూ పరిష్కరించాలని,నిర్మాణంలో ఉన్న ఇండ్ల పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.ఇట్టి టెలీ కాన్ఫరెన్స్ లో హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, డీఏఓ అఫ్జల్ బేగం, ఎంపీడీఓలు, మండల వ్యవసాయ అధికారులు, హౌసింగ్ డీఈ, ఏఈలు, ఏపీఓలు, పాల్గొన్నారు.

# నిందితులను కఠినంగా శిక్షించాలి

- కరీంనగర్ కమిషనరేట్‌ను సందర్శించిన జోన్ 3 డిఐజి సన్‌ప్రీత్ సింగ్
- భగత్ నగర్ డెకాయిటి ఘటనపై ఆరా
- సైబర్ నేరాలపై డిజిపి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డిఐజి, సీపీ



**కరీంనగర్ బ్యూరో, జూలై 23 (జనంసాక్షి) :** మల్టీ జోన్ 3 (జోన్-3) డిఐజి సన్‌ప్రీత్ సింగ్ గురువారం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనరేట్‌కు విచ్చేసిన డిఐజికి కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, పుష్ప గుచ్ఛం అందించి సాదర స్వాగతం పలికారు. సందర్శనలో భాగంగా, ఇటీవల కరీంనగర్‌లోని భగత్ నగర్‌లో మంగళవారం రాత్రి ఒక ఇంటిలో జరిగిన డెకాయిటి (దోపిడీ) ఘటనపై డిఐజి తీవ్రంగా స్పందించారు. ఈ కేసు పురోగతికి సంబంధించి సీపీ గౌష్ ఆలంను అడిగి వివరాలు తెలుసుకున్నారు. దోపిడీకి పాల్పడిన నిందితులను ఎంతటి వారైనా వదలకుండా, త్వరలోనే పట్టుకోవాలని అధికారులను ఆదేశించారు. నిందితులను తక్షణమే కోర్టులో ప్రవేశపెట్టి, వారికి చట్టప్రకారం కఠిన శిక్ష పడేలా బలమైన ఆధారాలతో కేసు నమోదు చేయాలని స్పష్టం చేశారు. అనంతరం, తెలంగాణ రాష్ట్ర డీజీపీ సైబర్ నేరాల నియంత్రణ, నివారణపై నిర్వహించిన ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్‌లో సీపీ గౌష్ ఆలంతో కలిసి డిఐజి సన్‌ప్రీత్ సింగ్ కమీషనరేట్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో పాల్గొన్నారు. సైబర్ నేరగాళ్లపై ఉక్కుపాదం మోపాలని, బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా చర్చించారు. వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం, డిఐజి తన కార్యాలయానికి చేరుకుని వివిధ సెక్షన్లలో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను, కేసుల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డిఐజి కార్యాలయ సూపరింటెండెంట్ కౌసల్య, సీసీ వేణులతో పాటు ఇతర పోలీస్ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థుల నమోదు పూర్తి చేయాలి

### అడిషనల్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి

**రంగారెడ్డి, జులై 23 (జనంసాక్షి) :** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల భౌతిక నమోదును తొలితగతిన పూర్తి చేయాలని అడిషనల్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో విద్యాశాఖకు సంబంధించిన వివిధ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల భౌతిక నమోదు ప్రక్రియను వేగవంతం చేసేందుకు మండల విద్యాధికారులు చొరవ చూపాలన్నారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థుల డేటాను తెప్పించుకొని త్వరితగతిన నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థుల భౌతిక డేటాకు, యుడైస్ లోని నమోదు సంఖ్యకు మధ్య తేడాపై దృష్టి సారించాలన్నారు. ప్రీ ప్రైమరీ పాఠశాలలు, కేజీబీవీ పాఠశాలల్లో నమోదు పెంచాలన్నారు. ప్రతి మండల విద్యాధికారి తమ పరిధిలోని పాఠశాలలను సక్రమంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. కొన్ని పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గి జీరో పాఠశాలలుగా మారడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని పరిశీలించారు. ఫేస్ రీడింగ్ స్కానింగ్ హాజరులో ఎంఆర్సీల్లోని సిఆర్పిల అటెండెన్స్ తక్కువగా ఉందన్నారు. అలాంటి వారిపై తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని పాఠశాలల్లో సివిల్ వర్క్స్ గురించి సమీక్షిస్తూ అన్ని పాఠశాలలో టాయిలెట్స్ ఉండే విధంగా చూడాలన్నారు. ప్రతి పాఠశాలలో వికలాంగ విద్యార్థులకు ప్రత్యేక టాయిలెట్స్ నిర్మించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధి కారి వెంకటేశ్వర్లు, విద్యాధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ క్యాంపు కార్యాలయం ముందు పటిష్ట భద్రత

- పోలీసుల అదుపులో బిజెపి నాయకులు
- శాంతియుత నిరసనలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి /వేములవాడ జులై 23 (జనంసాక్షి) :** దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న పరిణామాల క్రమంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేల నివాసాలు, క్యాంపు కార్యాలయాల ముట్టడికి బీజేపీ నాయకులు పిలుపునిచ్చిన క్రమంలో వేములవాడ పోలీసులు అప్రమత్తమయ్యారు.వేములవాడతో పాటు సబ్ డివిజన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.బీజేపీ నాయకులను ఎక్కడికక్కడే ముందస్తు ఆదుపులోకి తీసుకొని సమీప పోలీస్ స్టేషన్లలోకి తరలించారు. ఈ క్రమంలో వేములవాడలోని రాష్ట్ర ప్రభుత్వ విప్,స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నివాసం ముందు భారీ భద్రత ఏర్పాటు చేశారు. బిజెపి నాయకులు మాట్లాడుతూ ఢిల్లీలో జరుగుతున్న పరిణామాలకు క్రమంలో కరీంనగర్ కేంద్రంలోని భాజపా పార్టీ కార్యాలయం పైకి కాంగ్రెస్ నాయకులు బుధవారం దాడికి దిగడనికి నిరసనగా స్థానిక శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ ఇంటి వద్ద ధర్నా చేసేందుకు పిలుపునివ్వడం జరిగిందన్నారు.ఈ క్రమంలో గురువారం ఉదయము పోలీసులు మమ్మల్ని అదుపులోకి తీసుకొని స్టేషన్ తరలించారన్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కౌన్సిలర్ తూము మధు మాట్లాడుతూ టీపీసీసీ పిలుపు మేరకు, కేంద్ర ప్రభుత్వ ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి సంఘీభావంగా వేములవాడలోని తిప్పాపురం రాజీవ్ గాంధీ విగ్రహం దగ్గర నిరసన కార్యక్రమం నిర్వహించమన్నారు. రాహుల్ గాంధీపై జరిగిన దాడి దేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఒక దురదృష్టకర సంఘటన అన్నారు.

రాజకీయ విభేదాలను ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఎదుర్కోవాల్సిన ప్రభుత్వం, దాడులు మరియు కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడటం దేశానికి మంచిది కాదన్నారు.రానున్న ఎన్నికల్లో కేంద్రంలో రాహుల్ గాంధీని, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి అధికారంలోకి తీసుకురావడమే మా లక్ష్యం అన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, లౌకిక విలువలను పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని, దేశ ప్రజల కోసం రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి వేములవాడ ప్రజల తరఫున సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు.ఈ నిరసన కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

# యాచారం రైతుల్లో ‘ఫ్యూచర్ సిటీ’ గుబులు

## బఫర్ జోన్ సరిహద్దుల నిర్ధారణ ఏది?

- కంటిమీద కునుకు లేని యాచారం, కందుకూర్, కడ్తాల్ రైతాంగం
- పాత ఫార్మాసిటీ నిబంధనలతో గందరగోళం: పడిపోతున్న భూముల ధరలు
- ఎఫ్‌సిడిఏ మాస్టర్ ప్లాన్ ప్రకటనపైనే రియల్టర్ల ఆశలు




**యాచారం, జులై 23(జనం సాక్షి) :** రంగారెడ్డి జిల్లాలోని యాచారం, కందుకూరు, కడ్తాల్ మండలాల పరిధిలోని వివిధ గ్రామాల రైతులకు ఫ్యూచర్ సిటీ (ఫోర్త్ సిటీ) భయం పట్టుకుంది. ముఖ్యంగా కొత్తపల్లి, తక్కల్లపల్లి, మేడిపల్లి, నానక్ నగర్, తాడిపర్తి, కురుమిద్ద, నంది వనపర్తి, నజ్దిక్ సింగారం, గ్రామాల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో బఫర్ జోన్ పరిమితి ఎంతవరకు ఉంటుందో తెలియక స్థానిక రైతాంగం, రియల్టర్లు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మూడు మండలాల పరిధిలోని 10 గ్రామాల్లో దాదాపు 19 వేల 300 ఎకరాల భూములను సేకరించిన ప్రభుత్వం, కందుకూరు మండలం మిరఖాన్ పేట్‌లో ఎఫ్‌సిడిఏ ప్రధాన కార్యాలయాన్ని కూడా నిర్మించింది. అయితే, ఈ సేకరించిన భూముల చుట్టూ ఎన్ని ఎకరాల్లో బఫర్ జోన్ ఉంటుందనే విషయాన్ని మాత్రం అధికారులు వెల్లడించడం లేదు. గతంలో ఫార్మాసిటీ ప్లాన్ ఉన్నప్పుడు కాలుష్య నియంత్రణ కోసం బఫర్ జోన్ ఒకసారి ఐదు కిలోమీటర్లు, ఆ తర్వాత రెండు కిలోమీటర్లు అని ప్రకటించిన ప్రభుత్వం, ఇప్పుడు పర్యావరణ అనుకూల నెట్-జీరో ఫ్యూచర్ సిటీగా మార్చాక ఆ పరిధిని ఎంతకు పరిమితం చేసిందో చెప్పకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బఫర్ జోన్ ఉందో లేదో తెలియని అయోమయ పరిస్థితుల వల్ల ఈ ప్రాంతంలో వ్యవసాయ భూముల ధరలు ఒక్కసారిగా పడిపోతున్నాయని, కొత్త వెంచర్లకు అనుమతులు వస్తాయో రావో తెలియక రియల్ ఎస్టేట్ వ్యాపారులు కూడా పెట్టుబడులు పెట్టడానికి వెనకాడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఫ్యూచర్ సిటీ కోర్ ఏరియా చుట్టూ ఉన్న బఫర్ జోన్ సరిహద్దులను అధికారికంగా నిర్ధారించి, రైతులకు, రియల్టర్లకు స్పష్టత ఇవ్వాలని ఈ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఇంట్లో చోరీ.. రూ.4.80 లక్షల నగదు అపహరణ

**కరీంనగర్ టౌన్, జూలై 22 (జనం సాక్షి) :** కరీంనగర్ నగరంలోని వావిలాలపల్లి తులసీ నగర్‌లోని ఓ అద్దె ఇంట్లో చోరీ చోటు చేసు కుంది. గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళా లు పగులగొట్టి లోనికి ప్రవేశించి రూ.4.80 లక్షల నగదును అపహరించిన ఘటన బుధ వారం వెలుగులోకి వచ్చింది.బాధితుడు రోహిత్ తెలిపిన వివరాల ప్రకారం.. తాము ఆరు రోజుల క్రితమే బ్యాంక్ కాలనీ రోడ్ నెం.5 నుంచి తులసీనగర్‌లోని ప్రస్తుత అద్దె ఇంటికి మారారు. బుధవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో తల్లి సౌజన్యతో కలిసి ఇంటికి తాళం వేసి డీ-మార్ట్‌కు సరుకులు కొనుగోలు చేసేందుకు వెళ్లారు. మధ్యాహ్నం 1.10 గంటలకు తిరిగి వచ్చి చూడగా ప్రధాన ద్వారం తాళం, గడియ పగులగొట్టబడి కనిపించాయి. దీంతో వెనుకవైపు కిచెన్ తలుపు వద్దకు వెళ్లగా అది కూడా తెరిచి ఉండటంతో ఇంట్లోకి ప్రవేశించారు.ఇంట్లోని రెండు బీరువాలను తెరిచి అందులోని వస్తువులను చిందరవందర గా పడేసినట్లు గుర్తించారు. ఇటీవల ఇల్లు కొనుగోలు చేయడానికి బ్యాంకు నుంచి డ్రా చేసి బీరువాలో భద్రపరిచిన రూ.4.80 లక్షల నగదు కనిపించలేదు. అయితే బీరువాలో ఉన్న బంగా రం, వెండి నగలను దుండగులు తాకకుండా వదిలివెళ్లినట్లు బాధితులు తెలిపారు.ఈ ఘటన పై బాధితుల ఫిర్యాదు మేరకు 3వ పట్టణ పోలీ సులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# నిరుద్యోగుల కోసం నిరసన చేస్తే దాడులు చేయడం సిగ్గుచేటు

- మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి
- బాధిత విద్యార్థులకు నష్టపరిహారం అందించాలి
- టిపిసిసి డెలిగేట్ గంగాశంకర్



**బోధన్, జూలై 23 (జనంసాక్షి) :** దేశంలోని నిరుద్యోగ యువత కోసం నిరసన చేస్తే బిజెపి పోలీసులను అడ్డం పెట్టుకొని దాడులు చేయడం సిగ్గుచేటని, నీట్ పేపర్ లీకేజీకి కారణమైన మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, బాధిత విద్యార్థులకు నష్టపరిహారం అందించాలని టిపిసిసి డెలిగేట్ గంగాశంకర్ డిమాండ్ చేశారు. బోధన్ అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో విద్యార్థులపై, రాహుల్ గాంధీ పై జరిగిన దాడిని నిరసిస్తూ బోధన్ కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ మాట్లాడుతూ, భారతీయ జనతా పార్టీ హయాంలో దేశంలో అన్ని వర్గాలపై దాడులు పెరిగిపోతున్నాయి అన్నారు. అయితే ఎంతోమంది బీద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు చెమటోడ్చి చదివి నీట్ పరీక్ష రాస్తే తీరా పేపర్ లీక్ కావడంతో మనస్థాపంతో ఎంతోమంది విద్యార్థులు చనిపోయారన్నారు. బిజెపి హయాంలో ఎన్నోసార్లు పేపర్లు లీక్ కావడంతో విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని అంతే కాకుండా తమ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారడంతో చావే శరణంగా మారుతుందన్నారు. నీటి పేపర్ లీకేజీ వ్యవహారంలో సంబంధిత మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రధానమంత్రి నివాసం ముందు ఢిల్లీలో జరిగిన నిరసన కార్యక్రమంలో విద్యార్థులతో పాటు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల పై దాడి చేయడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా ప్రధానమంత్రి కళ్ళు తెరిచి నీట్ పేపర్ లీకేజీకి కారకుడైన మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను రాజీనామా చేయించడంతో పాటు మరణించిన విద్యార్థులకు, గాయాలు పాలైన విద్యార్థులకు నష్టహరిహారం అందించాలని గంగాశంకర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బోధన్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంకు దాము, మాజీ అధ్యక్షులు పాషా, కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ తూము శరత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నవీన్, కలీం, నాగేశ్వర్ రావు, చింటు, రామకృష్ణారెడ్డి, రామ్మూర్తి, హరికాంత్ చారి, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్ ఫారాలు అందని ఓటర్లు ప్రత్యేక హెల్ప్ డెస్క్‌లను వినియోగించుకోవాలి

### మధుయాష్కి గౌడ్

**హయత్ నగర్, జూలై 23 (జనం సాక్షి) :** ఎల్బీనగర్ నియోజకవర్గంలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో అర్హులైన ఓటర్లందరూ తమ ఎన్యూమరేషన్ ఫారాలను నింపి సంబంధిత బీఎల్ఓలకు అందజేయాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ, ఎల్బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మధుయాష్కి గౌడ్ కోరారు. ఇప్పటివరకు ఎన్యూమరేషన్ ఫారాలు అందని ఓటర్ల సౌకర్యార్థం ఎల్బీనగర్ ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్వో) ఆధ్వర్యంలో ఐదు చోట్ల ప్రత్యేక హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. సరూర్‌నగర్ మున్సిపల్ కార్యాలయం (మూడు సర్కిల్ కార్యాలయాలు), జోనల్ కార్యాలయం, నాగోల్ వార్డు కార్యాలయం, మన్సూరాబాద్ వార్డు కార్యాలయం, హయత్ నగర్ తహసీల్దార్ కార్యాలయాల్లో ఈ హెల్ప్ డెస్కులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గానికి చెందిన ఓటర్లు తమ ఫొటో, ఓటరు గుర్తింపు కార్డు, అవసరమైన ఇతర పత్రాలతో ఈ హెల్ప్ డెస్కులను సందర్శించి అక్కడికక్కడే ఎన్యూమరేషన్ ఫారాన్ని పొందడంతో పాటు పూర్తి చేసి సమర్పించవచ్చని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ముగియడానికి మరో పది రోజుల మాత్రమే గడువు ఉన్నందున, ఒక్క ఓటరు కూడా నిర్లక్ష్యం చేయకుండా అధికారులు ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్కులు లేదా తమ పోలింగ్ బూత్‌కు సంబంధించిన బీఎల్ఓను సంప్రదించి ఎన్యూమరేషన్ ఫారాన్ని తప్పనిసరిగా సమర్పించాలని మధుయాష్కి గౌడ్ విజ్ఞప్తి చేశారు. తమ ఓటు హక్కును పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఆస్తి కోసం తల్లిపై వేధింపులు..!

## తిరుమలాపూర్‌లో వృద్ధురాలి ఆవేదన

- కొడుకు, కోడలు బెదిరిస్తున్నారంటూ పోలీసులకు ఫిర్యాదు..



**గొల్లపల్లి, జులై 23 (జనంసాక్షి) :** ఆస్తి వివాదం నేపథ్యంలో ఓ వృద్ధ తల్లి తన సొంత కొడుకు,కోడలి నుంచి వేధింపులు ఎదుర్కొంటున్న ఘటన జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం తిరుమలాపూర్ గ్రామంలో వెలుగుచూసింది. గ్రామానికి చెందిన బొయ్యపోతుల బుచ్చవ్వ (70) తనకు ప్రాణహాని ఉందంటూ అధికారులను, పోలీసులను ఆశ్రయించింది. బుచ్చవ్వ తెలిపిన వివరాల ప్రకారం,ఆమె భర్త బొయ్యపోతుల నరసయ్య (75) కొద్ది నెలల క్రితం మరణించారు.వీరికి నలుగురు కుమార్తెలు,ఒక కుమారుడు ఉన్నారు.కుటుంబానికి చెందిన మొత్తం 14 ఎకరాల భూమిలో కుమార్తెలకు నాలుగు ఎకరాలు, కుమారుడి ముగ్గురు కొడుకులకు మూడు ఎకరాలు కొడుకు ఎకరం పంచి రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చినట్లు ఆమె పేర్కొన్నారు.తమ వృద్ధాప్య పోషణ కోసం ఐదు ఎకరాల భూమిని తమ పేరిటే ఉంచుకుని, ప్రత్యేకంగా ఇంటి నిర్మాణం చేసుకుని జీవిస్తున్నట్లు తెలిపారు. అయితే మిగిలిన ఐదు ఎకరాల భూమిని కూడా తన పేరున రిజిస్ట్రేషన్ చేయాలని కుమారుడు శ్రీశైలం,కోడలు వనిత ఒత్తిడి తెస్తున్నారని బుచ్చవ్వ ఆరోపించారు.భర్త మరణించిన తర్వాత వేధింపులు మరింత పెరిగాయని,తరచూ బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన పేరిట ఉన్న భూమిని అప్పగించకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరిస్తున్నారని, తమకు ప్రాణహాని ఉందని ఆమె పేర్కొన్నారు.ఈ విషయమై ఇప్పటికే గొల్లపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వృద్ధాప్యంలో ప్రశాంతంగా జీవించాల్సిన సమయంలో సొంత కొడుకు, కోడలి నుంచే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని బుచ్చవ్వ కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వం,పోలీసు అధికారులు స్పందించి తనకు తగిన రక్షణ కల్పించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కాగా,ఈ ఆరోపణలపై కొడుకు, కోడలి వాదన తెలియాల్సి ఉంది. పోలీసుల విచారణ అనంతరం వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# దేశం ధర్మం అంటూ విద్యార్థులపై ధమననీతా!

- లాఠీ చార్జ్, టియర్ గ్యాస్‌తో విద్యార్థుల పై దాడులు చేస్తారా
- భేషరతుగా విద్యార్థులకు ప్రధాని మోదీ, అమిత్ షా క్షమాపణలు చెప్పాలి
- మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మేధావులు, డాక్టర్లు, లాయర్లు పోటీ పరీక్షకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులతో కలిసి ‘చాయ్ పే చర్చ’



**కరీంనగర్ బ్యూరో, జులై 23 (జనంసాక్షి) :**

దేశం, ధర్మం అంటూ బిజెపి మాటలకే పరిమితం అవుతోందని, దేశం పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన మంత్రి పదవికి రాజీనామా చేసి విద్యార్థులకు క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. నీట్ పరీక్ష లీకేజీ పై దేశవ్యాప్తంగా విద్యార్థులు ఆందోళనకు దిగుతున్న నేపథ్యంలో నరేందర్ రెడ్డి వినూత్నంగా బిజెపి దమన నీతిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కరీంనగర్లో చాయ్ పై చర్చ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. విద్యావంతులు, మేధావులు, లాయర్లు, సీనియర్ సిటిజనులతో కేంద్ర ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలను వారితో పంచుకున్నారు. మేధావుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని, అందమైన భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిందని మండిపడ్డారు. విద్యార్థులపై లాఠీ చార్జి చేయటంతో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు పార్లమెంటులో గళం విప్పారని, ప్రధానమంత్రి అధికారిక నివాసం ముందు శాంతియుత ధర్నాకు దిగితే వారిని కర్కషంగా అరెస్టు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీని, ప్రియాంక గాంధీతో పాటు కాంగ్రెస్ ముఖ్య నేతలను అరెస్టు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కలెక్టరేట్ రోడ్డులోని సిరి టీ హోటల్ వద్ద చాయ్ పే చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఈ చర్చ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాదులు కొరివి వేణుగోపాల్, పెంచాల లక్ష్మణ్ రావు, ప్రముఖ డాక్టర్లు చాట్ల శ్రీధర్, వొడ్డే రాంరెడ్డి, వాకర్స్ గుడిపాటి రమణారెడ్డి, పి. కిషన్ రావు, ఎల్లారెడ్డి, బోయిని అశోక్ తో పాటు పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రజాస్వామ్య వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం నీరుగారుస్తోందని భేషరతుగా విద్యార్థి లోకానికి ప్రధాని మోదీ,అమిత్ షా క్షమాపణ చెప్పాలని ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.విద్యార్థులపై దమననీతి ప్రదర్శించడంలో కుట్ర దాగి ఉందని ఇప్పటికైనా ప్రధాని నరేంద్ర మోడీ కి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే అని నైతిక బాధ్యత వహించి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తో రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు.

## రాహుల్‌గాంధీపై పోలీసుల తీరుకు నిరసనగా కాంగ్రెస్ ర్యాలీ



**సికింద్రాబాద్, జూలై 23 (జనంసాక్షి) :** ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులకు సంఘీభావం తెలిపిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును ఖండిస్తూ మెట్టుగూడలో కాంగ్రెస్ నాయకులు నిరసన ప్రదర్శన చేపట్టారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి ర్యాల రాజేందర్ యాదవ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ నిరసన కార్యక్రమానికి సికింద్రాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ఆదం సంతోష్ కుమార్ హాజరయ్యారు. మెట్టుగూడ చౌరస్తాలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి కేంద్ర ప్రభుత్వ అణిచివేత విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ శాంతి యుత ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా రాజేందర్ యాదవ్ మాట్లాడుతూ.. తమ సమస్యలపై ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడుతున్న విద్యార్థులు, యువతపై కేంద్ర ప్రభుత్వం దౌర్జన్యానికి పాల్పడడం శోచనీయమన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ నిరసన తెలిపే రాజ్యాంగ హక్కు ఉందని, విద్యార్థులకు మద్దతుగా నిలిచిన రాహుల్ గాంధీని పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకోవడం కేంద్రం నిరంకుశ వైఖరికి నిదర్శనమని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మెట్టుగూడ డివిజన్ అధ్యక్షుడు బెన్న, పార్టీ నాయకులు అబ్దుల్, సైలేష్, రఘుపతి, అబ్రహీం, శ్రీనివాస్, ప్రతివరాజ్, మహిళా నాయకులు రమణి, పుష్పమ్మ, రూత్ క్లారి, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ డీఏపీ దందాపై పీడీ యాక్ట్ నమోదు చేయాలి

- రైతులతో రాజకీయం మానాలి
- రైతులను మోసం చేసిన దళారులను కాపాడితే భారీ ఉద్యమం తప్పదు
- కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో రైతాంగం తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడింది
- మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి

**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, జూలై 23 (జనంసాక్షి) :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు కరువు, ఎరువుల కొరత, కొనుగోలు కేంద్రాల అవ్యవస్థ, గన్నీ బ్యాగుల కొరత, ట్రాన్స్‌పోర్ట్ చెల్లింపుల జాప్యం, నకిలీ ఎరువుల దందా, దళారుల దోపిడీతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి విమర్శించారు. నాగర్‌కర్నూల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలపై ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. నకిలీ డీఏపీ ఎరువుల తయారీ, నిల్వ, విక్రయాల్లో పాల్గొన్న అసలు సూత్రధారులను గుర్తించి వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రైతులను మోసం చేసిన దళారులను ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే ఎందుకు కాపాడుతున్నారని ప్రశ్నించారు. సుమారు రూ.150 విలువ చేసే డీఏపీ సంచిని రూ.1,600కు పైగా విక్రయించి రైతులను దోచుకున్నారని, ఒక్కో సంచిపై వచ్చిన రూ.1,400కు పైగా అక్రమ లాభం ఎవరి జేబుల్లోకి వెళ్లిందో ప్రజలకు చెప్పాలని



డిమాండ్ చేశారు.

### హామీలు ఇచ్చి మోసం చేశారు

నకిలీ ఎరువుల వ్యవహారంలో నెల రోజుల్లో న్యాయం చేస్తామని చెప్పిన స్థానిక ఎమ్మెల్యే హామీ ఏమైందని ప్రశ్నించారు. "బొక్కలు వేయాలి" అని వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే ఇప్పటి వరకు ఒక్క మోసగాడిపైనా ఎందుకు చర్యలు తీసుకోలేదన్నారు. తన చుట్టూ ఉన్న అవినీతి పరులను చూడలేని వారు రైతులకు న్యాయం చేస్తామని చెప్పడం హాస్యాస్పదమని విమర్శించారు.

### మొక్కజొన్న కొనుగోళ్లలో అవినీతి

వ్యవసాయ శాఖ నివేదిక ప్రకారం నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో 1,04,263.29 ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరిగి సుమారు 40 లక్షల క్వింటాళ్ల దిగుబడి వచ్చిందన్నారు. దీనికి 80 లక్షల గన్నీ బ్యాగులు అవసరమని తెలిసినా ప్రభుత్వం కేవలం 20 లక్షల బ్యాగులు మాత్రమే సరఫరా చేసి కృత్రిమ కొరత సృష్టించిందని ఆరోపించారు. ఈ కొరతను ఆసరాగా చేసుకుని కొందరు కాంగ్రెస్ నాయకులు, అధికార పార్టీ నేతల అండతో ఒక్కో గన్నీ బ్యాగుపై రూ.5 నుంచి రూ.15 వరకు అదనంగా వసూలు చేసి రైతులను దోచుకున్నారని ఆరోపించారు. గన్నీ బ్యాగుల సబ్సిడీ,హమాలీ,ట్రాన్స్‌పోర్ట్‌లో అక్రమాలు ప్రభుత్వం ఒక్కో గన్నీ బ్యాగుకు రూ.22.11 రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించినా ఇప్పటి వరకు ఒక్క రైతుకూ ఆ మొత్తం అందలేదన్నారు. ఆ నిధులు ఎక్కడికి వెళ్లాయో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

### బిజినపల్లి రైతులకు మోసం

బిజినపల్లి మండలంలో రైతుల నుంచి మొక్కజొన్న కొనుగోలు చేసి డబ్బులు చెల్లించకుండా పరారైన ప్రైవేట్ దళారులపై ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమన్నారు. ట్రాన్స్‌పోర్ట్, గన్నీ బ్యాగుల పేరుతో రైతులను మోసం చేసిన వారిపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### కల్వకుర్తి రైతులను ఆదుకోవాలి

కల్వకుర్తి ఆయకట్టు రైతులు ఇప్పటికే నార్లు పోసుకున్నారని, శ్రీశైలం, ఆల్మట్టి జలాశయాలకు వరదలు వచ్చే అవకాశం ఉన్నందున ప్రభుత్వం వెంటనే నార్లాపూర్, కల్వకుర్తి లిఫ్ట్ పంపులను ప్రారంభించి రిజర్వాయర్లను నింపాలని డిమాండ్ చేశారు. విలేకర్ల సమావేశంలో మాజీ జెడ్పీటీసీ శ్రీశైలం, బిజినపల్లి మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ భగవంత్ రావు, వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ వెంకటయ్య, టిఆర్ఎస్ నాయకులు, పులేందర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటరు జాబితా స్వచ్ఛతకు అత్యంత ప్రాధాన్యత

- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

**తాండూరు, జూలై 23 (జనంసాక్షి) :** ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటరు జాబితా స్వచ్ఛతకు అత్యంత ప్రాధాన్యత ఉందని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం తాండూరు నియోజకవర్గం బషీరాబాద్ లోని గుర్రాల అనంతమ్మ గార్డెన్స్‌లో బషీరాబాద్ మండలానికి చెందిన బిఎల్ఏ మరియు చెన్నారం గేట్ దగ్గర అనిల్ గార్డెన్స్‌లో యాలాల్ మండలానికి చెందిన బిఎల్ఎలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సర్ పై బిఎల్ఎలకు పార్టీ శ్రేణులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బిఎల్ఎలు కీలకపాత్ర పోషిస్తున్నారు, మిగతా 10రోజులు కూడా మీ పాత్ర కీలకంగా ఉండాలన్నారు. సర్ ప్రక్రియ ప్రజాస్వామ్యానికి అత్యంత కీలకమని, ప్రతి అర్హులైన ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా బిఎల్ ఎలు ప్రత్యేక



శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఎవరూ తమ ఓటు హక్కును కోల్పోకుండా ఇంటింటికి వెళ్లి ఓటరు వివరాలను పరిశీలించి, అవసరమైన దరఖాస్తులను సకాలంలో సమర్పించాలని కోరారు. కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మార్పులు, ఇతర సవరణలను పారదర్శకంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి బూత్‌లో కాంగ్రెస్ పార్టీ బలాన్ని మరింత పెంచేందుకు బిఎల్ ఎలు ప్రజలతో నిరంతరం అందుబాటులో ఉండి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటరు జాబితా స్వచ్ఛతకు అత్యంత ప్రాధాన్యత ఉందని, ప్రతి బిఎల్ఏ బాధ్యతా యుతంగా పనిచేసి నియోజకవర్గంలో వంద శాతం ఖచ్చితమైన ఓటరు జాబితా తయారీలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సర్ పర్యవేక్షకులు కోటం వినయ్ రెడ్డి, జగదీశ్వర్ రావు, కాంగ్రెస్ పార్టీ సర్ నియోజకవర్గ కన్వీనర్ పురుషోత్తం రావు, మండల పార్టీ అధ్యక్షుడు రాజవర్ధన్ రెడ్డి, కుర్వ మహిపాల్, ప్రజాప్రతినిధులు, రెండు మండలాల సీనియర్ నాయకులు, బిఎల్ ఎలు, వివిధ గ్రామాల సర్పంచ్ లు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- ఎండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలి
- ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్




**రంగారెడ్డి, జులై 23 (జనంసాక్షి) :** రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పవన్ చౌహాన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం గాలికి వదిలేసిందని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల్లో పేరుకుపోయిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత కొద్ది కాలంగా పెండింగ్‌లోని ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడతల వారీగా కాకుండా, ఒకేసారి విడుదల చేయాలని స్పష్టం చేశారు. బకాయిలు రాకపోవడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు చదువుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్ బకాయిలను ఒకేసారి విడుదల చేసి విద్యార్థులను ఆదుకోకపోతే, రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు బొంగు అరుణ్ కుమార్ గౌడ్, పత్లావత్ ఆకాష్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు భుక్యా వినోద్ నాయక్, జిల్లా నాయకురాలు పార్వతి, మండల నాయకులు జూనొతల భాను ప్రకాష్, ఆందోజు నిఖిల్, వెంకట్ దుర్గా ప్రసాద్, చందు, క్రిష్, అరవింద్, మధు, హర్షిత్, గణేష్ పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణలో పారదర్శకతే లక్ష్యం

- మెదక్ జిల్లాలో 86 శాతం సర్ పూర్తి
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**నర్సాపూర్, జూలై 23 (జనం సాక్షి) :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. మరణించిన, డబుల్‌గా నమోదైన, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన, గైర్హాజరుగా ఉన్న ఓటర్ల వివరాలను విడివిడిగా నమోదు చేసి, పూర్తిస్థాయిలో ధృవీకరణ అనంతరమే తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. గురువారం నర్సాపూర్ ఆర్డీవో కార్యాలయంలో తహసీల్దార్లు, బీఎల్ఓలు, సూపర్వైజర్లతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. మెదక్ జిల్లాలో ప్రత్యేక సమగ్ర సర్వే (ఎస్ఐఆర్) 86 శాతం పూర్తయిందని తెలిపారు. 2002 ఓటరు జాబితా నుంచి ఇప్పటి వరకు గుర్తింపు కాని ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో సేకరించి, వారిని తప్పనిసరిగా గుర్తింపు ప్రక్రియలోకి తీసుకురావడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇప్పటికే గుర్తించిన ఓటర్ల వివరాల్లో ఉన్న వ్యత్యాసాలు, లోపాలను క్షుణ్ణంగా పరిశీలించి సరిదిద్దాలని సూచించారు. మరణించిన, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన, డబుల్‌గా నమోదైన ఓటర్ల పేర్ల తొలగింపునకు ముందు క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయి ధృవీకరణ నిర్వహించాలని చెప్పారు. అనంతరం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్ల సంతకాలు తీసుకున్న తర్వాతే సంబంధిత ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని బీఎల్ఓలకు ఆదేశించారు. సమావేశంలో నర్సాపూర్ ఆర్డీవో రామకృష్ణ, తహసీల్దార్ శ్రీనివాస్, బీఎల్ఓలు, సూపర్వైజర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## బాల్కంపేట ఆలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ ధర్నా

- రథోత్సవం ఆలస్యానికి తలసాని శ్రీనివాస్ యాదవ్ కారణం
- ఎల్లమ్మ సన్నిధిలో వెంటనే క్షమాపణలు చెప్పాలి
- కోట నీలిమ



**హైదరాబాద్, జూలై 23 (జనంసాక్షి) :** బాల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి రథోత్సవం ఆలస్యానికి మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కారణమని సనత్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కోట నీలిమ ఆరోపించారు. రథోత్సవం ఆలస్యంపై భక్తులకు సమాధానం చెప్పడంతో పాటు, బాల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి సన్నిధిలో తలసాని శ్రీనివాస్ యాదవ్ తక్షణమే క్షమాపణలు చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ మేరకు కోట నీలిమ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బాల్కంపేట ఎల్లమ్మ ఆలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కోట నీలిమ మాట్లాడుతూ.. రథోత్సవం ఆలస్యంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఎల్లమ్మ అమ్మవారి ఉత్సవాల విషయంలో నిర్లక్ష్యానికి తావులేదని పేర్కొన్నారు. రథోత్సవం ఎందుకు ఆలస్యమైందని ఆలయ అధికారులను, అర్చకులను ప్రశ్నించగా సరైన సమాధానం ఇవ్వలేదని ఆమె ఆరోపించారు. ఈ విషయంపై ముఖ్యమంత్రికి కూడా లేఖ రాస్తానని నీలిమ తెలిపారు. రథోత్సవం ఆలస్యానికి బాధ్యత వహిస్తూ తలసాని శ్రీనివాస్ యాదవ్ భక్తులకు క్షమాపణలు చెప్పాలని కోట నీలిమ డిమాండ్ చేశారు. భక్తుల మనోభావాలను గౌరవించాలని, ఈ వ్యవహారంపై ప్రజలకు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని ఆమె కోరారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని తలసాని శ్రీనివాస్ యాదవ్, ఆలయ కార్యనిర్వహణాధికారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## ఆగస్టు 28 నుంచి 30 వరకు క్రెడాయ్ హైదరాబాద్ 'ప్రాపర్టీ షో-26'




**ఖైరతాబాద్, జూలై 23 (జనం సాక్షి) :** క్రెడాయ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో 'క్రెడాయ్ హైదరాబాద్ ప్రాపర్టీ షో–2026'ను ఆగస్టు 28 నుంచి 30 వరకు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లోని హాల్–1, 3లో నిర్వ హించనున్నట్లు క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎన్.జైదీప్ రెడ్డి ప్రకటించారు. గురువారం నిర్వహించిన మీడియా సమా వేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది షో 'థీమ్ రేటు ఆగదు–డిమాండ్ తగ్గదు'గా నిర్ణయించినట్లు చెప్పారు. ఈ షోలో 100కు పైగా రెరా ఆమోదిత ప్రాజెక్టులు, అపార్ట్‌మెంట్లు, విల్లాలు, ప్లాటెడ్ డెవల ప్‌మెంట్లు, కమర్షియల్ స్పేస్‌లు ప్రదర్శనకు ఉంచ నున్నట్లు తెలిపారు. ప్రముఖ బ్యాంకులు, ఆర్థిక సంస్థలు గృహ రుణాలపై మార్గదర్శకత్వం అందిం చనున్నాయని తెలిపారు. ప్రభుత్వ అధికారులు, పరిశ్రమ నిపుణులు, రియల్ ఎస్టేట్ పరిశోధన సం స్థలతో ప్రత్యేక చర్చలు కూడా నిర్వహించనున్నా రని చెప్పారు. హైదరాబాద్‌లో మౌలిక సదుపాయా ల విస్తరణతో నాణ్యమైన ప్రాజెక్టులకు డిమాండ్, ఆస్తి విలువలు పెరుగుతున్నాయని అన్నారు. ధర లు తగ్గుతాయని ఎదురు చూడకుండా ఇప్పుడే పెట్టుబడి పెట్టాలని కొనుగోలుదారులకు సూచిం చారు. ప్రెసిడెంట్–ఎలెక్ట్ బి.జగన్నాథరావు మాట్లా డుతూ గచ్చిబౌలి వంటి ప్రధాన ప్రాంతాల్లో గత ఏడాదిలోనే చదరపు అడుగు ధరలు పెరిగాయని, అందువల్ల ఆలస్యం చేస్తే ఇళ్ల ధరలు మరింత పెరి గే అవకాశం ఉందన్నారు. షోలో 100 శాతం ధృవీ కరించిన, రెరా ఆమోదిత ప్రాజెక్టులను మాత్రమే అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ హైదరాబాద్ ప్రాపర్టీ షో కన్వీనర్ బి.జైపాల్ రెడ్డి, కో–కన్వీనర్ బి.వినోద్ రెడ్డి, ఆఫీస్ బేరర్లు, మేనేజింగ్ కమిటీ సభ్యులు పాల్గొ న్నారు.

# ఉప్పల్‌లో బోనాల జాతరకు భారీ ఏర్పాట్లు

- భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

**ఉప్పల్, జూలై 23 (జనం సాక్షి) :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల ఉత్సవాలను ఉప్పల్ డివిజన్‌లో అత్యంత ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నట్లు మాజీ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. బోనాల ఉత్సవాల సందర్భంగా ఉప్పల్ డివిజన్ పరిధిలోని వివిధ ఆలయాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులు, సౌకర్యాలను ముందుగానే కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఆమె వెల్లడించారు. బోనాల పండుగ సందర్భంగా ఉప్పల్ డివిజన్ పరిధిలోని మహంకాళి, పోచమ్మ, నల్ల పోచమ్మ ఆలయాలతో పాటు వివిధ ప్రాంతాల్లోని ఇతర అమ్మవారి ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు, బోనాల సమర్పణ కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయాల పరిసర ప్రాంతాల్లో రహదారులు, పారిశుద్ధ్యం, విద్యుత్ దీపాలు, మంచినీరు తదితర సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు.



### రూ.90 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు

బోనాల ఉత్సవాల నేపథ్యంలో ఉప్పల్ డివిజన్ వెంకటేశ్వర కాలనీలోని నల్ల పోచమ్మ ఆలయం వద్ద రూ.90 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం మాజీ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి పరిశీలించారు. ఆలయానికి వచ్చే భక్తులకు రాకపోకల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రహదారి సౌకర్యాలను మెరుగుపరచడం ఎంతో అవసరమని ఆమె పేర్కొన్నారు.

### అన్ని శాఖల అధికారులతో కలిసి ఆలయాల సందర్శన

అతి త్వరలోనే సంబంధిత అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో కలిసి ఉప్పల్ డివిజన్ పరిధిలోని ప్రధాన ఆలయాలను సందర్శించనున్నట్లు రజిత పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. ఆలయాల వద్ద ప్రస్తుతం ఉన్న పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించి, భక్తులకు అవసరమైన అదనపు సౌకర్యాలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించి అధికారులతో చర్చిస్తామని వెల్లడించారు.
ప్రతి ఆలయం వద్ద అవసరమైన పనులను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి, సంబంధిత శాఖల సమన్వయంతో వాటిని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. బోనాల ఉత్సవాలు ప్రారంభమయ్యే నాటికి భక్తులకు అవసరమైన సౌకర్యాలన్నీ అందుబాటులో ఉండేలా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సల్లా ప్రభాకర్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ నంగి శ్రీనివాస్, ట్రెజరర్ మిట్టపల్లి శ్రీనివాస్తో పాటు కాలనీ సభ్యులు భాస్కర్, విజయేందర్ రాజు, పాండు, చంద్రుడు, ధర్మారెడ్డి, సోమయ్య, నంగి సంపత్, భరత్, జక్కుల సంపత్, ఆనంద్, ఓంకార్, ప్రతాప్ సింగ్, రామకృష్ణ, సంజీవ్ రెడ్డి, కృష్ణారెడ్డి, రాజేంద్ర స్వామి తదితరులు పాల్గొన్నారు.

## భూగర్భ జలాలను పెంచాలి

- నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి
- మహేశ్వరం ఎంపీడీవో శారదమ్మ



**మహేశ్వరం, జూలై 23 (జనంసాక్షి) :** భూగర్భ జలాలను పెంచేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మహేశ్వరం ఎంపీడీవో శారదమ్మ అన్నారు. గురువారం మహేశ్వరం ప్రజా పరిషత్ కార్యాలయంలో జలసిరి కార్యక్రమంపై పలు గ్రామాల సర్పంచులకు,అధికారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శారదమ్మ మాట్లాడుతూ...చిన్న, సన్నకారు రైతులకు100 శాతం సబ్సిడీతో నీటి సంరక్షణ,నీటి వనరుల అభివృద్ధి పనులను అందించడం జరుగుతుందన్నారు. రైతులకు సాగునీటి సౌకర్యాలను మెరుగుపరచడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. రైతులకు సాగునీటి వనరులను అందుబాటులోకి తీసుకురావడం వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. అర్హులైన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి సామిరెడ్డి, ఎంపీవో రవీందర్ రెడ్డి,ఏవో నాగమణి,పలు శాఖల అధికారుల,పలు గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



# ఆర్మీ భూములు కాపాడండి

**హైడ్రా కమిషనర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేసిన ఆర్మీ లెఫ్టినెంట్ కల్నల్**

**హైదరాబాద్, జులై 23 (జనంసాక్షి) :** ఆర్మీకి చెందిన భూమిని కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారని.. ఆ భూమిని కాపాడాలని రక్షణ శాఖకు చెందిన ఉన్నతాధికారులు హైడ్రాను ఆశ్రయించారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను ఆర్మీ లెఫ్టినెంట్ కల్నల్ జై సింగ్ కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం, గ్రామంలోని జీఎల్ఆర్ సర్వే నంబరు 507లోని ఆర్మీకి చెందిన ఏ-1 భూమి ఉండగా అందులో ఆక్రమణలు జరుగుతు న్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆర్మీకి చెందిన భూమిని ఆక్రమించి జి ప్లస్ 2 భవనాన్ని నిర్మిస్తున్నారని తెలిపారు. ఆ నిర్మాణానికి అనుమ తులు కూడా లేవని పేర్కొన్నారు. నిర్మాణాలను ఆపించి ఆ స్థలాన్ని కాపాడాలని కోరారు. వినతిపత్రాన్ని పరిశీలించిన హైడ్రా కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆక్రమణలను నిర్ధారించుకున్న తర్వాత చర్యలు తీసుకోవాలని హైడ్రా అధికారులను ఆదేశించారు. హైడ్రా కమిషనర్‌ను లెఫ్టినెంట్ కల్నల్ కలిసినప్పుడు హైడ్రా ఏసీపీ ఉమామహేశ్వర రావు కూడా ఉన్నారు.

## సెలవు పెట్టినందుకు ఉద్యోగం నుంచి తొలగింపు

- టెక్ మహీంద్రా సంస్థ ఉద్యోగిని ఫిర్యాదు



**హైదరాబాద్, జూలై23 (జనంసాక్షి) :** ప్రముఖ ఐటీ సంస్థ టెక్ మహీంద్రాపై మహిళా సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని భావన దుండిగల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనారోగ్యం కారణంగా తాను, అనంతరం తన చిన్నారి ఆరోగ్యం బాగోలేక సెలవులు తీసుకున్న నేపథ్యంలో ఎలాంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా సంస్థ ఉద్యోగం నుంచి తొలగించిందని ఆమె ఆరోపించారు. భావన తెలిపిన వివరాల ప్రకారం, అనారోగ్యంతో 13 రోజుల పాటు సెలవులో ఉన్న సమయంలో, అలాగే తన కుమార్తె అనారోగ్యం కారణంగా మరికొన్ని రోజులు సెలవు తీసుకున్నప్పటికీ, యాజమాన్యం ఈ-మెయిల్‌ల ద్వారా వెంటనే విధులకు హాజరు కావాలని ఒత్తిడి తెచ్చిందని పేర్కొన్నారు. వ్యక్తిగత పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా వేధింపులకు గురిచేశారని ఆమె ఆరోపించారు. కార్యాలయంలో వాష్‌రూమ్‌కు వెళ్లాలన్నా అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితి ఉండేదని, ఉద్యోగులపై అత్యంత కఠినమైన నిబంధనలు అమలు చేస్తున్నారని ఆమె ఆరోపించారు. మహిళా ఉద్యోగులకు కుటుంబ బాధ్యతలు, చిన్నారుల సంరక్షణ వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ఐటీ సంస్థలు మరింత మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. భావన ఫిర్యాదును స్వీకరించిన దుండిగల్ పోలీసులు ఘటనకు సంబంధించిన వివరాలను పరిశీలిస్తున్నారు. మరోవైపు, ఈ ఆరోపణలపై టెక్ మహీంద్రా యాజమాన్యం నుంచి అధికారిక స్పందన రావాల్సి ఉంది.

## భూ వివాదంలో సినీ నిర్మాతలపై కేసులు

- వ్యాపారవేత్త రవిశంకర్ ఫిర్యాదు



**హైదరాబాద్, జూలై23 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న భూవివాదం నేపథ్యంలో ప్రముఖ సినీ నిర్మాత సి. కల్యాణ్, నిర్మాత బూరుగుపల్లి శివరామకృష్ణతో పాటు పలువురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వ్యాపారవేత్త కాంతమనేని రవిశంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివిధ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, జూబ్లీహిల్స్‌లోని ఉమెన్స్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో ఉన్న ఎ÷-లాట్ నంబర్?89పై యాజమాన్య వివాదం కొనసాగుతోంది. ఈ స్థలం తమదేనంటూ సి. కల్యాణ్, బూరుగుపల్లి శివరామకృష్ణ గతంలో కోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారంలో విచారణ జరిపిన న్యాయస్థానం జూన్ 10న మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ, సదరు స్థలం ఫిర్యాదుదారు కాంతమనేని రవిశంకర్ ఆధీనంలోనే కొనసాగాలని, అనుమతి లేకుండా ఎవరూ ప్రవేశించరాదని ఆదేశించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే కోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా నిందితులు స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి గేటు, తాళాలు ధ్వంసం చేశారని, అక్కడ ఉన్న సామగ్రిని చెల్లాచెదురు చేసి, సిబ్బందిని బెదిరించడంతో పాటు నిర్మించిన గదిని కూడా కూల్చివేశారని రవిశంకర్ ఆరోపించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# జెండా పండుగ దగ్గరికొచ్చే..

# యూనిఫాం రాకపాయే!



**బడి ప్రారంభమై నెల.. నెరవేరని కొత్త డ్రెస్ కల**

**ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వేలాది మంది విద్యార్థులు కొత్త విద్యా సంవత్సరంలోనూ పాత యూనిఫామ్‌లతోనే పాఠశాలకు హాజరవుతున్నారు.బడి ప్రారంభమైన నెల రోజులు గడుస్తున్నా ఇప్పటికి యూనిఫామ్ కోసం బట్టను అందించడంలో విద్యాశాఖ అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. మరో 20 రోజుల్లో పంద్రాగస్టు వస్తుందని దానికి పాత బట్టలతోనే ప్రభుత్వ విద్యార్థులు హాజరు కావాలా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గత విద్యా సంవత్సరం ఉన్న యూనిఫామ్ నమూనాను మారుస్తామని విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులందరికీ అందిస్తామని గొప్పలకు పోయిన ప్రభుత్వం, యూనిఫామ్‌లు అందించకపోవడంతో అసలుకే ఎసరు వచ్చిందన్న తీవ్ర విమర్శలకు తావిస్తోంది.**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూలై 23 (జనంసాక్షి)**

- **మారిన డ్రెస్ కోడ్... విద్యాశాఖకు తెలియని తీరు..!**
- **41,200 విద్యార్థుల నిరీక్షణ**

రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా స్వయాన ముఖ్యమంత్రి ఉండడంతో అత్యంత నాణ్యమైన ఆకర్షణ ఏమైనా కొత్త యూనిఫామ్ వస్తుందన్న గంపెడు ఆశలతో విద్యార్థులు ఇప్పటికే ఎదురుచూస్తున్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 41,200 మంది విద్యార్థులు చదువుతున్నారు.వీరందరికీ కలిపి 42 వేల జతల యూనిఫామ్‌లు అవసరం. అయితే ఇప్పటి వరకు యూనిఫామ్‌ల కుట్టింపునకు అవసరమైన క్లాత్ జిల్లాకు చేరకపోవడం గమనార్హం. ఈసారి ప్రభుత్వం విద్యార్థుల డ్రెస్ కోడ్‌ను మార్చింది. కొత్త నమూనాలో యూనిఫామ్‌లు ఇవ్వాలని నిర్ణయించినప్పటికీ, వాటి తయారీ ప్రక్రియలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంది. దీంతో విద్యార్థులు గత విద్యా సంవత్సరంలో వాడిన పాత యూనిఫామ్‌లతోనే పాఠశాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**ఆరంభ శూరత్వం**

ప్రతి ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభంలోనే యూనిఫామ్‌లు అందిస్తామని ప్రభుత్వం ప్రకటిస్తున్నా, ఆచరణలో మాత్రం పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. విద్యార్థులు, తల్లిదండ్రులు కొత్త డ్రెస్ కోసం ఎదురుచూస్తుండగా, విద్యాశాఖ నిర్లక్ష్య వైఖరిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పంద్రాగస్టు వేడుకల్లోనైనా విద్యార్థులు ఏకరూప దుస్తుల్లో కనిపిస్తారా..? లేక మరోసారి పాత యూనిఫామ్‌లతోనే జెండా వందనం చేయాల్సి వస్తుందా..? అనే ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

### ముందు చూపుతో కేజీబీవీ

దీపం ఉన్నప్పుడే చక్కబెట్టుకోవాలన్నట్టు విద్యా సంవత్సరం ప్రారంభంలోనే కొత్త డ్రెస్సులను ఇస్తామన్న వాగ్దానాలకు పోకుండా పాత యూనిఫామ్ విధానంలోనే విద్యార్థులకు ముందు చూపుతో సంబంధిత అధికారులు డ్రెస్సులను అందించి విమర్శల నుంచి తప్పుకున్నారు. జిల్లాలోని 13 కేజీబీవీ (కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు) విద్యార్థినులకు మాత్రమే మొదటి విడతలో 4,000 యూనిఫామ్‌లు పంపిణీ చేశారు.సాధారణ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మాత్రం ఇంకా యూనిఫామ్‌ల పంపిణీపై స్పష్టత లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

### కుట్టుకూలీ 75 రూపాయలు

ప్రభుత్వం యూనిఫామ్‌ల కుట్టింపు బాధ్యతను డీఆర్‌డీఏ ద్వారా మహిళా సంఘాలకు అప్పగించనుంది. ఒక్కో డ్రెస్ కుట్టినందుకు రూ 75 కుట్టు కూలి నిర్ణయించారు.అయితే క్లాత్ సరఫరాలోనే ఆలస్యం కావడంతో మహిళా సంఘాలు కూడా పనులు ప్రారంభించలేకపోతున్నాయి.

# ఎల్‌నినోతో రాష్ట్రంలో తీవ్ర వర్షాభావం

**అధికారులతో మంత్రి పొన్నం సమీక్ష**

**కార్యాచరణతో ముందుకు సాగాలని సూచన**



**సిద్దిపేట, జూలై23 (జనంసాక్షి) :** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. దీనినుంచి బయటపడేలా కార్యాచరణతో సాగాలని అన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఐఓసీ కార్యాలయంలో సిద్దిపేట, కరీంనగర్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు, అధికారులతో ఎల్‌నినో ప్రభావంపై మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఏడు మండలాల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. స్వేచ్ఛగా ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. భవిష్యత్తులో తాగునీటికి సంబంధించి ప్రధాన సమస్య వచ్చే అవకాశం ఉందని తెలిపారు. వచ్చే జూన్ వరకు వర్షాలు లేవని శాస్త్రవేత్తలు చెబుతున్నారన్నారు. పశువులకు పశుగ్రాసం ఇబ్బందులు తలెత్తకుండా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. వ్యవసాయానికి సంబంధించి కరవు పరిస్థితిలో ఆరుతడి పంటలు వేయాలని అన్నదాతలకు సూచిస్తున్నామని అన్నారు. గ్రౌండ్ వాటర్ రోజురోజుకూ పడిపోతోందని.. దీనిని పెంచేందుకు ప్రత్యేక యాక్షన్ ఎ÷-లాన్ ద్వారా ముందుకెళ్లాలని దిశానిర్దేశర చేశారు. వీబీజీ రాంజీ ఉపాధి హామీ పథకం కింద ఇంకుడు గుంతలు తవ్వే అవకాశం ఉందని వెల్లడించారు. ప్రతి వర్షం చుక్కను కాపాడుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ఈ సమావేశంలో సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమవతి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి, ఆయా జిల్లాల అదనపు కలెక్టర్లు, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తాగునీటి సరఫరా, సాగునీటి నిర్వహణ, పశుగ్రాసం, చెరువుల్లో నీటి నిల్వలు, ఇతర అత్యవసర చర్యలపై సమీక్ష నిర్వహించారు. తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రౌండ్ వాటర్ పెంపునకు ఇంకుడు గుంతల తవ్వకం, రైతులు ఆరుతడి పంటలు, ఆయిల్ ఫామ్ సాగు చేపట్టేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని, అవసరమైన వనరులను సిద్ధంగా ఉంచాలని సమావేశంలో నిర్ణయించారు.



## పెద్దమ్మ ఆలయంలో కవిత దంపతుల పూజలు

**హైదరాబాద్, జూలై 23 (జనంసాక్షి) :** తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తన భర్త దేవనపల్లి అనిల్, కుటుంబ సభ్యులతో కలిసి జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మ తల్లి ఆలయాన్ని దర్శించుకున్నారు. తమ చిన్న కుమారుడు ఆర్య జన్మదినం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య కవిత దంపతులకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్ పి. విష్ణువర్ధన్‌రెడ్డి కవిత దంపతులను సత్కరించి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

# దమ్ముంటే నీట్‌పై చర్చకు రావాలి

- విపక్షాలకు బిజెపి అధ్యక్షుడు నితిన్ నబిన్ సవాల్



**న్యూఢిల్లీ, జులై 23 (జనంసాక్షి) :** దేశంలో ప్రకంపనలు పుట్టిస్తోన్న నీట్ పరీక్ష వ్యవహారం, పేపర్ లీక్‌ల అంశంపై పార్లమెంట్ వేదికగా ఓపెన్ డిబేట్‌కు సిద్ధమా అని భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ విపక్షాలకు సవాల్ విసిరారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు విపక్ష కూటమి పార్లమెంట్‌లో చర్చకు రాకుండా పారిపోతోందని, సభ ముందుకు వస్తే వారి 'ద్వంద్వ నీతి' బయట పడుతుందనే భయంతోనే వెనకడుగు వేస్తున్నారని నితిన్ నబిన్ ఆరోపించారు. పేపర్ లీక్ దోషులకు కఠిన శిక్షలు ఖరారు చేసేందుకు 'ఫాస్ట్ ట్రాక్ కోర్టులు' ఏర్పాటు చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రకటన అనంతరం రాహుల్ గాంధీ తీవ్ర విమర్శల నేపథ్యంలో బీజేపీ అధ్యక్షుడు ఈ వ్యాఖ్యలు చేశారు. మీడియాతో మాట్లాడిన నితిన్ నబిన్ ప్రతిపక్షాల తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'విద్యార్థులు, యువత భవిష్యత్తుకు సంబంధించి ప్రతి అంశంపైనా లోక్‌సభలో చర్చించేందుకు ఎన్డీఏ ప్రభుత్వం పూర్తి సిద్ధంగా ఉంది. ఔఇఇ÷ సహా ఏ అంశంపైనైనా చర్చకు మేము సిద్ధం, మీరు సిద్ధమా? పార్లమెంట్ వేదికగా చర్చకు రావాలని రాహుల్ గాంధీకి సవాల్ విసురుతున్నాం' అని ఆయన అన్నారు. 'రాహుల్ గాంధీ రాజకీయ ప్రస్థానం అంతా పారిపోవడమే. దాదాపు 50-60 ఏళ్లుగా యువతను వంచించడం, రెచ్చగొట్టడం, దారి మళ్లించడమే కాంగ్రెస్ చరిత్ర. అందుకే సభలో చర్చకు వస్తే తమ రంగు బయటపడుతుందని భయపడుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. విపక్షాలు యువతను కేవలం నిరసనకారులుగా, 'రాళ్లు విసిరేవారిగా' మాత్రమే చూశాయని, కానీ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం యువతకు సురక్షితమైన, ప్రకాశవంతమైన భవిష్యత్తును అందించేందుకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# ఆందోళనకారులకు యువతి మద్దతు

**పోలీస్ వ్యాన్‌కు అడ్డంగా నిలబడి ఆందోళనకారుల విడుదలకు యత్నం**

**సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న వీడియో**



**ముంబై, జూలై23 (జనంసాక్షి) :** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలం టూ, పరీక్షల నిర్వహణలో అక్రమాలు జరిగా యంటూ.. దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువె త్తున్నాయి. ఈ నేపథ్యంలో మహా రాష్ట్రలోని ముంబైలో చోటుచేసుకున్న ఓ ఘటన నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ఆందోళనకారులను తీసుకెళ్తున్న పోలీసు వ్యాన్‌కు ఓ యువతి అడ్డుగా నిలిచి నిరసన తెలిపారు. దాదర్‌లోని శివాజీ పార్క్ సమీపంలో జరిగిన విద్యార్థుల నిరసనల్లో రియా యాదవ్ అనే యువతి ఈ సాహసానికి పాల్పడ్డారు. వర్షంలో హుడీ, టోపీ ధరించి పోలీసు వ్యాన్ ఎదుట నిల్చున్న ఆమెను చూసి.. అక్కడి నిరసనకారులు మరింత రెచ్చిపోయారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. దీంతో అప్పటికే అదుపులోకి తీసుకున్న కొందరు నిరసనకారులను పోలీసులు విడుదల చేసినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా రియా స్పందిస్తూ.. 'పోలీసులు తమ బాధ్యతల్ని సక్రమంగా నిర్వర్తించడం లేదు. వారు బాధ్యతగా వ్యవహరించకపోతే పౌరుల కోసం మేమే బాధ్యత తీసుకుంటాం' అని అన్నారు. తాను విద్యార్థిని కాకపోయినప్పటికీ.. విద్యార్థుల ఉద్యమానికి సంపూర్ణ మద్దతిస్తానని ఆమె చెప్పుకొచ్చారు. మరోవైపు.. ఢిల్లీలో నిరసనకారులపై టియర్‌గ్యాస్, లాఠీఛార్జ్ వంటి ఘటనలనూ ఆమె ఖండించారు. రియా యాదవ్.. నటి, మోడల్, పారిశ్రామికవేత్తగా గుర్తింపు పొందారు. ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో సుమారు లక్ష మంది వరకు ఫాలోవర్స్ ఉన్నారు. పలు మ్యూజిక్ వీడియోల్లో నటించిన ఆమె.. ఇటీవల 'దిల్‌బారా' అనే సాంగ్‌తో మెరిశారు. అలాగే 'రియాసత్' పేరుతో ఓ చేనేత వస్త్రాల బ్రాండ్‌నూ నిర్వహిస్తున్నట్టు సమాచారం.

# కోచింగ్ సెంటర్లకు దాసోహంగా మారిన నీట్

**వెంటనే రద్దు చేసి, రాష్ట్రాలకే బాధ్యతలు ఇవ్వాలి**

**విద్యార్థుల ఆందోళనకు మద్దతు పలికిన మాజీ సిఎం స్టాలిన్**



**చెన్నై, జులై 23 (జనంసాక్షి) :** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నీట్‌కు వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన నిరసనలపై తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ స్పందించారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులకు తన పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన పోస్టు పెట్టారు. నీట్ పరీక్షను నిలిపివేయడమే విద్యార్థుల సమస్యలకు ఏకైక పరిష్కారమని పేర్కొన్నారు. 'రాష్ట్రాలను నమ్మండి.. నీట్‌ను రద్దు చేయండి' అని డిమాండ్ చేశారు. నీట్ ప్రవేశపెట్టిన మూడు ప్రధాన లక్ష్యాల్లోనూ ఈ వ్యవస్థ పూర్తిగా విఫలమైందని స్టాలిన్ ఆరోపించారు. విద్యలో సమాన అవకాశాలు కల్పించడం, పారదర్శకత పెంచడం, నాణ్యమైన విద్యను ప్రోత్సహించడం వంటి లక్ష్యాలు సాధించడంలో నీట్ విఫలమైందని విమర్శించారు. పాఠశాల విద్యా వ్యవస్థను బలహీనపరిచి, కోచింగ్ సెంటర్ల ఆధిపత్యాన్ని పెంచే పరిస్థితిని నీట్ తీసుకువచ్చిందని పేర్కొన్నారు. విద్యార్థుల ఆవేదన, ఆందోళనలు కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కావాలని స్టాలిన్ వ్యాఖ్యానించారు. విద్యార్థుల భవిష్యత్తు, సామాజిక న్యాయం, రాష్ట్రాల హక్కులను దృష్టిలో ఉంచుకుని కేంద్రం తన వైఖరిని పున:సమీక్షించాల్సిన అవసరం ఉందని సూచించారు. సామాజిక న్యాయాన్ని పరిరక్షించాలంటే నీట్ రద్దు అత్యవసరమని స్పష్టం చేశారు. గ్రామీణ, పేద, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నీట్ అన్యాయం చేస్తోందని అభిప్రాయపడ్డారు. విద్యార్థుల హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందని స్టాలిన్ స్పష్టం చేశారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370